www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 13-7-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 88 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం; తిథి: తదియ రా.1.03 తదుపరి చవితి; నక్షత్రం: శ్రవణం ఉ.6.53 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: ఉ.10.52-12.28; దుర్ముహూర్తం: సా.5.06-5.57; అమృతఘడియలు: రా.8.26-10.02; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 5.52; సూర్యాస్తమయం: 6.49 | హైదరాబాద్ సిటీ

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



నల్సార్ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

విదేశీ విద్యకు వెంపర్లాడొద్దు!

- అప్పులతో అమ్మానాన్నలకు బరువు కావొద్దు
- అదే మీ విలువ నిర్ధారిస్తుందనుకుంటే పొరపాటే
- ఆ 70 లక్షలతో ఇక్కడే వృత్తికి పదును పెట్టొచ్చు
- న్యాయ వృత్తి గౌరవప్రదమే కానీ రాచబాట కాదు
- ఫలితాలు వస్తాయనే గ్యారెంటీ కూడా లేదు
- నిత్యం నిన్ను నువ్వు నిరూపించుకోవాల్సిందే
- నల్సార్ స్నాతకోత్సవంలో సీజేఐ జస్టిస్ గవాయ్
- బంగారు పతకాలు ప్రదానం చేసిన సీఎం

2

రాజకీయ న్యాయానికి భరోసా!

అట్టడుగున ఉన్న వ్యక్తికీ న్యాయం జరగాలి.. రాజ్యాంగ సవరణలకు అంబేడ్కర్ మద్దతుంది

- సవరణలతోనే సామాజిక, ఆర్థిక న్యాయం సాధ్యం
- అంబేడ్కర్ మాటల్లోంచే ఆర్టికల్ 32కు ఊపిరి
- ఇప్పుడు రాజ్యాంగానికి రక్షణ కవచం అదే
- రాజ్యాంగ రచనే ఒక రక్తపాత రహిత విప్లవం
- భావితరాలను దృష్టిలో పెట్టుకొని రూపొందించారు
- భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్
- రాజ్యాంగ రచనలో అంబేడ్కర్ పాత్రపై ప్రసంగం
- నిజాం రాజ్య చీఫ్ జస్టిస్ పదవిని అంబేడ్కర్ కాదనుకున్నారు: సుప్రీం జడ్జి జస్టిస్ శ్రీనరసింహ

హైదరాబాద్ సిటీ, జూలై 12(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య ప్రక్రియలో దేశంలో అట్టడుగున ఉన్న వ్యక్తికి కూడా న్యాయం జరుగుతుందనే భరోసా కల్పించాలని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ పిలుపునిచ్చారు. దీన్నే ఆయన రాజకీయ న్యాయం(పొలిటికల్ జస్టిస్)గా అభివర్ణించారు. ఆర్థిక, సామాజిక న్యాయాలతో పాటుగా 'రాజకీయ న్యాయం' జరిగేట్లు చూడాలన్న లక్ష్యానికి అందరూ కట్టుబడి ఉండేందుకు ప్రయత్నించాలని కోరారు. భవిష్యత్తు అవసరాల రీత్యా రాజ్యాంగాన్ని సవరించడాన్ని అంబేడ్కర్ స్వాగతించారని, మనం కూడా అదే స్ఫూర్తితో పని చేయాలని అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో "భారత రాజ్యాంగ రూపకల్పనలో అంబేడ్కర్ పాత్ర" అంశంపై జరిగిన సదస్సులో ప్రధాన న్యాయమూర్తి పాల్గొని, ప్రసంగించారు. ఈ అంశం తన మనసుకు నచ్చినదని, దీనిపై ఇప్పటికే దేశదేశాల్లో మాట్లాడానని చెప్పారు. రాజ్యాంగ నిర్మాణంలో అంబేడ్కర్ పాత్ర వెలకట్టలేనిదని, ప్రపంచ వ్యాప్తంగా ఆయన గొప్పదనాన్ని గుర్తించారని అన్నారు. అంబేడ్కర్‌కు 1953లో డీలిట్ ఇచ్చిన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రసంగించే అవకాశం రావడాన్ని గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. రాజ్యాంగ రచన సమయంలో అంబేడ్కర్ ఆలోచనా సరళిని విశ్లేషిస్తూ, అతి సమైక్య, అతి కేంద్రీకృత రాజ్యాంగాన్ని అంబేడ్కర్ వ్యతిరేకించారని జస్టిస్ గవాయ్ అన్నారు. మొదటి రాజ్యాంగ సభ సమావేశంలో రాజ్యాంగ లక్ష్యాలు, తీర్మానాలు ఎలా ఉండాలనే అంశమై అంబేడ్కర్ మాట్లాడినపుడు అందరూ ముగ్ధులయ్యారని తెలిపారు. అందరూ హక్కుల

మిగతా 2వ పేజీలో...

ఆ ఇద్దరికీ నేనే టార్గెట్!

మీడియాను టార్గెట్‌గా ఎంచుకోవడంలో ఎవరికి ఎవరు ఆదర్శమో తెలియదు గానీ భారత రాష్ట్ర సమితి-వైసీపీలు అవిభక్త కవలలుగా వ్యవహరిస్తున్నాయి. రాజకీయ పార్టీలు తమ రాజకీయ ప్రత్యర్థులతో తలపడాలి కానీ మీడియాను తమ ప్రత్యర్థులుగా ప్రకటించుకోవడాన్ని ఇప్పుడే చూస్తున్నాం. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి అనేక మీడియా సంస్థలు ఆయా ప్రభుత్వాలకు మద్దతునివ్వడం, విమర్శించడం చూశాం. తమ ప్రభుత్వాన్ని విమర్శించే మీడియాను ఇప్పటిలాగా రాజకీయ ప్రత్యర్థిగా ఎవరూ ప్రకటించలేదు.



కొత్త పలుకు

ఆంధ్రప్రదేశ్‌లో 2014-19 మధ్య కాలంలోను, 2024 నుంచి నేటి వరకు జగన్ మీడియా కూటమి ప్రభుత్వంపై ఎంతలా విరుచుకుపడుతున్నదో చూస్తున్నాం. తెలంగాణలో కేసీఆర్ మీడియాదీ అదే ధోరణి. తమ దారికి రాని మీడియా సంస్థలకు ప్రభుత్వపరంగా ప్రకటనలు నిలిపివేయడం గతంలోనూ జరిగింది. అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్, జగన్ రెడ్డి 'ఆంధ్రజ్యోతి' సంస్థకు పైసా ప్రకటన కూడా ఇవ్వలేదు. అయినా వాటిని మేం ఖాతరు చేయలేదు. ఇప్పుడు అంతటితో ఆగకుండా మీడియాపై దాడులు చేయాలన్న నిర్ణయానికి కూడా రావడం ఆశ్చర్యంగా ఉంది. ఈ ధోరణి సమర్థనీయం అయితే కేసీఆర్, జగన్ రెడ్డి మీడియాలపై ఏ స్థాయిలో దాడులు చేయాలి?

ఉమ్మడి రాష్ట్రంలో రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ ధోరణికి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో కేసీఆర్, ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్ రెడ్డి మీడియాను రాజకీయ ప్రత్యర్థులుగా ప్రకటించుకున్నారు. తెలంగాణ శాసనసభకు తొలిసారిగా ఎన్నికైన కొందరు సభ్యులు ప్రమాణస్వీకారం సందర్భంగా ఇబ్బంది పడటాన్ని 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' చానల్ హేళన చేయకపోయినా చేసినట్టు ప్రచారం చేసి తెలంగాణలో చానల్ ప్రసారాన్ని అడ్డుకున్నారు. 2024 ఎన్నికలకు ముందు జగన్మోహన్ రెడ్డి కూడా ఎంపిక చేసిన కొన్ని మీడియా సంస్థలను రాజకీయ ప్రత్యర్థులుగా ప్రకటించుకున్నారు.

మీడియాపై ఆధారపడి రాజకీయాలు చేసే వారు బలమైన నాయకులు కాలేరు. 2023 ఎన్నికలకు ముందు 'ఆంధ్రజ్యోతి' మినహా మిగతా మీడియా అంతా కేసీఆర్ ప్రభుత్వాన్ని తలపై పెట్టుకొని మోసింది. అయినా ఎన్నికల్లో ఆయనను ప్రజలు తిరస్కరించారు. రాజకీయ నాయకులు ఈ వాస్తవాన్ని ఎందుకు గుర్తించడం లేదో? ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌కు అనుకూలంగా ఆయన మీడియా ఎంత ప్రచారం చేసినా ఓటమిని తప్పించుకోలేకపోయారు కదా? ఇప్పుడు మీడియాపై దాడులు చేయాలనుకుంటున్న వారు అలా చేస్తే ప్రజల్లో మరింత వ్యతిరేకత పెరుగుతుందని గుర్తించలేకపోవడం విషాదం.

4

అటు జగన్ మీడియాకు, ఇటు కేసీఆర్ మీడియాకు నేను ఒక ముడిసరుకుగా మారాను. దాదాపు పదిహేను సంవత్సరాలుగా ఈ ఇరువురి మీడియా సంస్థలు నాపై పుంఖాను పుంఖాలుగా వార్తలు వండి వడ్డించాయి. అయినా ఇటు తెలంగాణలో గానీ, అటు ఆంధ్రప్రదేశ్‌లో గానీ మా సంస్థను ప్రజల నుంచి దూరం చేయలేకపోయారు. తెలంగాణలో కేసీఆర్‌కు సీఎం రేవంత్, ఏపీలో జగన్ రెడ్డికి సీఎం చంద్రబాబు ప్రధాన ప్రత్యర్థులు. అయినా కేసీఆర్, జగన్ రెడ్డిలు ఆ ఇరువురి కంటే నన్నే ప్రధాన ప్రత్యర్థిగా పరిగణిస్తున్నారు. ఒక జర్నలిస్టుగా ఇందుకు నేను గర్విస్తున్నాను.

మా సంస్థలకు దురుద్దేశాలు ఆపాదించాలని ఎంతగా ప్రయత్నించినా మాకు ఉన్న విశ్వసనీయత మిగిలే ఉంది. నన్ను రాజకీయ ప్రత్యర్థిగా టార్గెట్ చేసుకున్నంత మాత్రాన ప్రజాక్షేత్రంలో వారి బలం పెరగదు. తమ చర్యల ద్వారా నన్ను పెంచుతూ తమను తాము తక్కువ చేసుకుంటున్న వాస్తవాన్ని కేసీఆర్, జగన్ గుర్తిస్తే వారికే మంచిది. కొంతమంది రాజకీయ మరుగుజ్జులు, విదూషకులు చేసే ప్రకటనలకు స్పందించవద్దని, అలా చేస్తే వారి స్థాయి పెరుగుతుందని బీఆర్ఎస్‌కు చెందిన కొంత మంది ముఖ్యులు నాకు సలహా ఇచ్చారు. దాన్ని పాటించాలనే నిర్ణయించుకున్నాను.

క్రిమినల్ సైకాలజీలో ఆరితేరినవారు ముందుగా ప్రత్యర్థుల బలహీనతలను అధ్యయనం చేస్తారు. ఆ తర్వాత ఎవరిని ఎలా లొంగదీసుకోవాలో స్కెచ్ వేసి అమలుచేస్తారు. ఈ క్రమంలోనే ఏపీలో జగన్ అండ్ కో టీడీపీ శాసనసభ్యులు, మంత్రులలో గూడుకట్టుకుని ఉన్న భయాన్ని ఆసరాగా చేసుకొని విజృంభిస్తున్నారు. జనసైనికులు కూడా సోషల్ మీడియాలో ఉన్నంత చురుగ్గా క్షేత్ర స్థాయిలో ఉండటం లేదు. భారతీయ జనతా పార్టీ టచ్ మీ నాట్ అన్నట్టే ఉంటోంది.

రిజర్వేషన్లపై ఢిల్లీకి

దేశవ్యాప్త మద్దతు కూడగట్టేందుకు సీఎం ప్రయత్నం



2029 ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లే ఎజెండా

- స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం..
- రిజర్వేషన్లపై నా నిబద్ధతను ప్రశ్నించలేరు
- మోదీ స్థానంలో రాహుల్‌గాంధీ ఉంటే.. 48 గంటల్లో రిజర్వేషన్లను సాధించేవాడిని
- చట్టబద్ధత కల్పించాల్సింది కేంద్ర ప్రభుత్వమే
- మంత్రులు, బీసీ నేతలతో భేటీలో సీఎం

13

- 16, 17 తేదీల్లో హస్తినలోనే రేవంత్‌రెడ్డి
- రాష్ట్రపతి ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీని కలిసే అవకాశం
- రిజర్వేషన్లపై రాష్ట్ర ఎంపీలతోపాటు ఇండీ కూటమి ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- 21న లేదా ఆ తరువాత ఒకటి, రెండు రోజుల్లో ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో సదస్సు
- పార్లమెంటులో మాట్లాడాలని ఎంపీలను కోరనున్న సీఎం

అధిక వడ్డీలతో అల్లాడిపోతున్నాం!

- రాష్ట్ర ఆదాయమంతా అటే పోతోంది
- ప్రధాని ఆర్థిక సలహా మండలి చైర్మన్‌తో రేవంత్‌రెడ్డి

2



గాంధీభవన్‌లో రాహుల్, రేవంత్, మహేశ్‌గౌడ్ ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేస్తున్న ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పించే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం వేగం పెంచింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో అసెంబ్లీలో బిల్లు ఆమోదించుకుని షెడ్యూల్ 9లో చేర్చాలంటూ కేంద్రానికి పంపిన బిల్లులపై మరోమారు మోదీ సర్కారుతో చర్చించి, ఒప్పించేలా ప్రయత్నం చేస్తోంది. అలాగే ఈ అంశానికి సంబంధించి ఇండియా కూటమి మద్దతును కూడగట్టనుంది. ఈ దిశగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పావులు కదుపుతున్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై ఢిల్లీ వెళ్లాలని ఆయన నిర్ణయించుకున్నట్టు

మిగతా 13వ పేజీలో...

బీసీ బిల్లు రాష్ట్రపతి వద్ద ఉండగా.. ఆర్డినెన్స్ తేవడంలో

ఆంతర్యమేంటి?

- గవర్నర్ ఆమోదం తెలిపే అవకాశముందా?
- రాష్ట్ర ప్రభుత్వానికి బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ప్రశ్నలు

13



2 నెలల క్రితమే పెళ్లి

సెల్ఫీ దిగుదామని చెప్పి.. భర్తను

నదిలోకి తోసిన భార్య

- బ్రిడ్జి నుంచి పడి వరదలో కొట్టుకెళ్లిన బాధితుడు
- రాళ్లపైకి ఎక్కి ప్రాణాలు దక్కించుకున్న వైనం
- కర్ణాటకలోని రాయచూర్ జిల్లాలో ఘటన

10

60 లక్షల బీమా.. హత్య

- అత్త కోసం భారీగా బీమా.. ఆపై ఆమెను వాహనంతో ఢీకొట్టించి చంపించిన అల్లుడు
- సిద్దిపేట జిల్లా పెద్ద మాసాన్‌పల్లిలో ఘటన

10

భారత్‌పై సుంకాలు.. 20% లోపే!

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయం
- తాత్కాలిక వాణిజ్య ఒప్పందానికి సన్నాహాలు
- బ్రిటన్ తర్వాత మనతోనే ఈ తరహా అవగాహన

12

ప్రపంచవ్యాప్తంగా వేగంగా పెరుగుతున్న

ముస్లిం జనాభా

- 2010-20 మధ్య 25.6 శాతానికి
- 14.9 శాతానికి తగ్గిన హిందువుల జనాభా
- క్రైస్తవుల జనాభాలోనూ తగ్గుదల నమోదు
- మత విశ్వాసాలు పట్టని వారి సంఖ్య పైపైకి
- ప్యూ రీసెర్చ్ సెంటర్ అధ్యయనంలో వెల్లడి

12

నీట్-యూజీ కౌన్సెలింగ్

షెడ్యూల్ విడుదల

- 21 నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం
- తొలుత ఆల్ ఇండియా కోటా
- రాష్ట్రంలో 30 నుంచి కౌన్సెలింగ్ షురూ
- తెలంగాణలో 8,690 ఎంబీబీఎస్ సీట్లు

14



ప్రయాణానికి రాజమార్గం

- సాంకేతికత ఆధారంగా హైవేలపై ఇబ్బందుల్లేని ప్రయాణం
- రోడ్డు.. ట్రాఫిక్ సమాచారం అంతా అరచేతుల్లోనే
- 'రాజ్‌మార్గ్ యాత్ర' యాప్‌లో ఎమర్జెన్సీ సేవల నుంచి టోల్ చార్జీల దాకా 10 రకాల సేవలు
- రహదారులు బాగాలేకుంటే ఫిర్యాదు కూడా చేయొచ్చు

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మీరు హైదరాబాద్ నుంచి విజయవాడకు లేదా ఇతర ప్రాంతాలకు జాతీయ రహదారులపై వెళ్లాలనుకుంటున్నారా..? ఆ రోడ్డు పరిస్థితి ఎలా ఉంది? ఎక్కడైనా ట్రాఫిక్ జామ్‌లు ఉన్నాయా? ఆ మార్గంలో టోల్ ప్లాజాల సంఖ్య ఎంత? వాటిల్లో చార్జీల వివరాలేంటి? ప్రయాణించే దూరానికి చేరుకోవడానికి ఎంత సమయం పడుతుంది? ఇలాంటి వివరాలన్నీ మీ సెల్‌ఫోన్ ఇట్టే చెప్పేస్తుంది. అంతేనా?? ఉదయం సాయంత్రం వేళల్లో అల్పాహారం, మధ్యాహ్న భోజనాలకు ఆ మార్గంలో ఉన్న రెస్టారెంట్లు, హోటళ్ల వివరాలు కూడా

మిగతా 2వ పేజీలో...

కిల్లర్ 'స్విచ్'

ఇంధన స్విచ్‌లు కటాఫ్‌కు.. ఆగిపోయిన 2 ఇంజన్లు

అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటనపై ఏఏఐబీ నివేదిక

- 'ఇంధన స్విచ్‌లు ఎందుకు ఆఫ్ చేశావు? నేను ఆఫ్ చేయలే..' పైలట్ల సంభాషణ
- స్విచ్‌లను తిరిగి ఆన్‌చేసినా.. ఇంజన్లు పుంజుకునే లోగా ఘోరం
- టేకాఫ్ అయిన 32 సెకన్లలోనే దుర్ఘటన
- ప్రస్తుత ఆధారాల మేరకు కుట్ర కోణమేదీ లేదని భావిస్తున్నట్టు ఏఏఐబీ వెల్లడి
- ఇంధన స్విచ్‌లు ఎలా కటాఫ్‌కు మారాయనే దానిపై సందేహాలు
- విమానాన్ని కావాలనే కూల్చివేసినట్టుందని పలువురు నిపుణుల ఆరోపణ

న్యూఢిల్లీ, జూలై 12: అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదానికి సంబంధించి ఇంధన స్విచ్‌లు కీలకంగా మారాయి. రెండు ఇంధన స్విచ్‌లు 'రన్' నుంచి 'కటాఫ్' మోడ్‌లోకి మారడంతో.. ఇంధన సరఫరా నిలిచిపోయి సెకన్ల వ్యవధిలోనే రెండు ఇంజన్లు నిలిచిపోయాయి. పైలట్లు దీన్ని గుర్తించి సరిచేసేందుకు ప్రయత్నించినా.. ఆలోపే ప్రమాదం జరిగిపోయింది. టేకాఫ్ తర్వాత 32 సెకన్లలోనే కుప్పకూలింది. 'విమాన ప్రమాదాల దర్యాప్తు సంస్థ (ఏఏఐబీ)' శనివారం విడుదల చేసిన నివేదికలో ఈ అంశాలను వెల్లడించింది. గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి లండన్‌లోని గాట్విక్ విమానాశ్రయానికి బయల్దేరిన ఎయిరిండియా ఏఐ171 విమానం (బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్).. ఎయిర్‌పోర్టు పక్కనే ఉన్న బీజే వైద్య కళాశాల హాస్టల్ భవనంపై కుప్పకూలిన విషయం

మిగతా 12వ పేజీలో...



అప్పుడే ఒక నిర్ణయానికి రావొద్దు

- ఇది ప్రాథమిక నివేదికే: కేంద్ర మంత్రి కింజరాపు

పైలట్లపైకి తప్పు నెట్టే యత్నం!

- ఏఏఐబీ నివేదికను ఖండిస్తున్నాం
- ఎయిర్‌లైన్ పైలట్ల అసోసియేషన్ మండిపాటు

12

ప్రయాణానికి రాజమార్గం

(మొదటిపేజీ తరువాయి)

అరచేతిలో ప్రత్యక్షమవుతాయి. వీటితోపాటు.. రోడ్లపై గోతులుంటే.. "ఇవేం గుంతలు.. మన కర్మ" అనుకోకుండా.. వెంటనే వాటి ఫొటోలు, వీడియోలతో ఫిర్యాదు చేయవచ్చు. ఒక్కమాటలో చెప్పాలంటే.. ఎమర్జెన్సీ సేవలు మొదలు.. టోల్‌చార్జీల వివరాల దాకా 10 రకాల సేవలను స్మార్ట్ ఫోన్‌లో అందజేసేలా కేంద్ర ప్రభుత్వం 'రాజ్‌మార్గ్ యాత్ర' పేరుతో ఓ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) ఈ యాప్‌ను అభివృద్ధి చేయించింది.

యాప్‌లో సేవలు ఇవే..

ఇప్పటికే దేశ వ్యాప్తంగా ఉన్న పలు జాతీయ రహదారులను కేంద్రప్రభుత్వం డిజిటల్‌గా మారుస్తోంది. వాటిపై అత్యంత అధునాతనమైన సీసీ కెమెరాలను ఏర్పాటుచేసి, ఎప్పటికప్పుడు ట్రాఫిక్ రద్దీ వివరాలను అంచనా వేయనుంది. దీని వల్ల ప్రమాదాలను తగ్గించే అవకాశాలుంటాయి. దీనికి అనుసంధానంగానే రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌ను కూడా కేంద్రం తీసుకువచ్చింది. డిజిటల్ రోడ్ల వివరాలను కూడా ఈ యాప్‌తో అనుసంధానించనున్నారు. యాప్‌లో అందించే సేవలు ఇలా..

- ప్రయాణించే హైవేపై రెస్టారెంట్లు, హోటళ్లు, పోలీస్‌స్టేషన్లు, పెట్రోల్ పంపులు, విద్యుత్తు వాహనాల చార్జింగ్ స్టేషన్లు, ఆస్పత్రులు, ఏటీఎంలు, ప్రజా మరుగుదొడ్లు, వాహన మెకానిక్ సేవలు, పర్యాటక ప్రాంతాల వివరాలను యాప్ ద్వారా తెలుసుకోవచ్చు.
- కొత్త ఫాస్టాగ్ తీసుకోవడంతో పాటు, ఇప్పటికే ఉన్న వాటికి రీచార్జ్ చేసుకునే వెసులుబాటు ఈ యాప్‌లో ఉంది. అంతేకాదు.. నెలవారీ పాసులను కూడా ఇందులో రీచార్జ్ చేసుకోవచ్చు. వచ్చే నెల 15(పంద్రాగస్టు) నుంచి అందుబాటులోకి రానున్న కొత్త ఫాస్టాగ్ విధానం సేవలను ఈ యాప్ ద్వారా పొందవచ్చు.
- రూట్‌ప్లానర్ అనే ఆప్షన్‌లో మనం ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తున్నామనే వివరాలను అందజేస్తే.. వెంటనే ఆ మార్గంలో ట్రాఫిక్, అడ్డంకుల వివరాలు స్మార్ట్‌ఫోన్ తెరపై ప్రత్యక్షమవుతాయి. రద్దీ ఎక్కువగా ఉంటే.. ప్రత్యామ్నాయ రహదారులను సూచిస్తుంది.
- 'రికార్డ్ యువర్ జర్నీ' అనే ఆప్షన్‌లో మన టూర్ మొత్తాన్ని రికార్డు చేసుకోవచ్చు.
- యాప్‌లోని భారత్ మ్యాప్‌లో.. రాష్ట్రాల వారీగా టోల్ ప్లాజాల వివరాలను తెలుసుకోవచ్చు. ఉదాహరణకు.. తెలంగాణ మ్యాప్‌పై క్లిక్ చేస్తే.. ప్రాంతాల వారీగా ఉన్న 28 టోల్ ప్లాజాల వివరాలు ప్రత్యక్షమవుతాయి. టోల్ బూత్‌పై క్లిక్ చేస్తే.. (ఉదాహరణకు పంతంగి టోల్ ప్లాజా) కారుకు రూ.80, రిటర్న్ జర్నీకి రెండువైపులా కలిపి రూ.115 ఖర్చవుతుందనే విషయం తెలుస్తుంది.
- టోల్‌ప్లాజాలకు సంబంధించిన నెలవారీ పాసులను ఈ యాప్ ద్వారా తీసుకోవచ్చు.
- రోడ్డు బాగోకుంటే.. గోతులు, సమస్యలకు సంబంధించిన ఫొటోలు తీసి, అధికారులకు ఫిర్యాదు చేయొచ్చు. ఫిర్యాదు పురోగతిని తెలుసుకోవచ్చు.
- వాతావరణ వివరాల అప్‌డేట్స్ కూడా ఈ యాప్‌లో తెలుస్తాయి. ఉదాహరణకు వెళ్తున్న మార్గంలో భారీవర్షాలు, ఇతర హెచ్చరికలు ఉంటే ఈ యాప్‌లో ప్రత్యక్షమవుతాయి.
- జాతీయ రహదారులకు ఇరువైపులా ప్రయాణికులు, వాహనాలకు సంబంధించి ఏవైనా సౌకర్యాలను వినియోగించుకోవాలనుకుంటే.. ఆయా వివరాలతో 'రిజిస్టర్ అమినిటీస్' అనే ఆప్షన్ ద్వారా నమోదుచేసుకోవచ్చు.



నల్సార్ స్నాతకోత్సవంలో సీజేఐ జస్టిస్ గవాయ్, సీఎం రేవంత్‌రెడ్డి, సుప్రీం జడ్జి జస్టిస్ శ్రీనరసింహం, హైకోర్టు సీజే జస్టిస్ సుజోయ్‌పాల్

విదేశీ విద్యకు వెంపర్లాడొద్దు!

- అమ్మానాన్నలకు బరువు కావొద్దు
- ఆ 70 లక్షలతో ఇక్కడే వృత్తికి పదును పెట్టొచ్చు
- నల్సార్ స్నాతకోత్సవంలో సీజేఐ జస్టిస్ గవాయ్
- బంగారు పతకాలు ప్రదానం చేసిన ముఖ్యమంత్రి

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదం అత్యంత గౌరవప్రదమైన వృత్తి అయినప్పటికీ ఇందులో రాచబాట అంటూ ఏదీ ఉండదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. శనివారం శామీర్‌పేట్‌లోని నల్సార్ విశ్వవిద్యాలయం 22వ స్నాతకోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పమిడిఘంటం శ్రీ నర్సింహ, హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, వైస్ ఛాన్స్‌లర్ శ్రీకృష్ణదేవరావులతో కలిసి సీజేఐ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ బీఆర్ గవాయ్ మాట్లాడుతూ, న్యాయవాద వృత్తిలో కచ్చితమైన ఫలితాలు వస్తాయనే గ్యారెంటీ లేదని చెప్పారు. "న్యాయవాదం ఎంచుకున్న ప్రతీ ఒక్కరికీ ఫలితాలు వస్తాయని గ్యారెంటీ లేదు. కోర్టుకు, నిన్ను ఆశ్రయించే కక్షిదారులకు నిత్యం నిన్ను నువ్వు నిరూపించుకోవాలి. మరోవైపు నీ ఆత్మసాక్షి కూడా నిన్ను అంచనా వేస్తుంది.. నీవు వెళ్లే మార్గాన్ని ప్రశ్నిస్తుంది. చాలా అంశాలపై స్పష్టత ఉండాలి. ఉద్దేశం ఏంటో తెలుసుకోవాలి. 'మండేలా బ్రీఫ్' పుస్తక రచయిత థామస్ గ్రాంట్ న్యాయవాద వృత్తికి గొప్ప నిర్వచనాన్ని ఇచ్చారు. 'ఈ వృత్తిలో అంచనాలు భారీగా ఉంటాయి. ఎక్కువ గంటలు పని చేయాల్సి వస్తుంది. భావోద్వేగ పరంగా మనల్ని ఒంటరిని చేస్తుంది. కొన్నిసార్లు సక్సెస్ అయినట్లు కనిపించడానికి కూడా కష్టపడాల్సి వస్తుంది' అని చెప్పారు. అమెరికాలో ఒక అధ్యయనం ప్రకారం న్యాయవాదులు తమ వృత్తిని చివరి వరకు కొనసాగించలేక పోతున్నట్లు తేలింది. డేటా ప్రైవసీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి రంగాలకు సైతం లా విస్తరిస్తోంది. చట్టంలోని ప్రాథమిక భావనలను కచ్చితత్వంతో స్పష్టంగా ఎవరు చెప్తారో వారే ఈ వృత్తిలో గట్టిగా బలమైన నిపుణులుగా నిలబడతారు. ప్రతి కొత్త పోకడను ఆకళింపు చేసుకునే వారు కాదు. మీరు ప్రతిచోటా ఉండాల్సిన అవసరం లేదు. మీరు ఉన్న చోటే బలంగా ఉంటే సరిపోతుంది. మార్టిన్ లూథర్ కింగ్ చెప్పిన విధంగా మీపై మీరు విశ్వాసం కలిగి ఉండండి. ప్రతిదీ పుస్తకాల్లో, తీర్పుల్లో దొరకదు. ఇతరుల అనుభవాల నుంచి, మెంటార్‌షిప్ నుంచి నేర్చుకోవాలి. అధికారంలో ఉన్న వారి మార్గదర్శకత్వం కోరుకోకండి. సమగ్రత ఉన్న వారి మార్గదర్శకత్వంలో పని చేయండి. ఒక నాటికి మీరే మార్గదర్శకులుగా మారుతారు. విదేశాల్లో మాస్టర్ డిగ్రీ చదువుతా అని తల్లిదండ్రులపై ఒత్తిడి చేయకండి. రూ.50 నుంచి రూ.70 లక్షలు ఖర్చు పెట్టి కుటుంబానికి భారం కాకండి. కేవలం విదేశీ డిగ్రీ మాత్రమే మీ విలువను నిర్ధారిస్తుందని అనుకోవద్దు. ఇతరుల ఒత్తిడితో విదేశీ విద్యకు వెళ్లి ఒత్తిడికి గురయ్యే బదులు అందులో కొంత మొత్తం పెట్టుబడి పెట్టి స్వతంత్రంగా ప్రాక్టీస్ పెట్టుకోవచ్చు. విదేశీ డిగ్రీ పోకడ పెరగడం దేశంలోని పోస్ట్ గ్రాడ్యుయేట్ లీగల్ ఎడ్యుకేషన్, దేశంలో పరిశోధనపై విశ్వాసం లేకపోవడాన్ని సూచిస్తోంది. దేశంలో న్యాయ పరిశోధన, శిక్షణపై విశ్వాసాన్ని పాదుకొల్పాల్సిన అవసరం ఉంది" అన్నారు.

బంగారు పతకాలు అందజేసిన సీఎం

పీహెచ్‌డీలు, ఎల్‌ఎల్‌ఎం, ఎంబీఏ, ఎంఏ ట్యాక్సేషన్ లా, క్రిమినల్ జస్టిస్ మేనేజ్‌మెంట్, బీఏఎల్‌ఎల్‌బీ హానర్స్ బీబీఏ హానర్స్ బీబీఏ, పీజీడిప్లొమో ఇన్ ట్యాక్సేషన్, పీజీ డిప్లొమో ఇన్ క్రిమినల్ జస్టిస్ మేనేజ్‌మెంట్ తదితర కోర్సుల్లో విద్యను పూర్తి చేసిన మొత్తం 462 మంది విద్యార్థులకు ఈ కార్యక్రమంలో డిగ్రీలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అత్యున్నత ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సీఎం రేవంత్‌రెడ్డి బంగారు పతకాలు అందజేశారు. ఎల్‌ఎల్‌ఎంలో ముస్కాన్ కార్లా రెండు బంగారు పతకాలు, బీ హరిణి, హుజైఫా షేక్, నందిని ఒక్కోటి, బీఏ ఎల్‌ఎల్‌బీ హానర్స్‌కు చెందిన ఇషికా గార్గ్ ఎనిమిది బంగారు పతకాలు, కేఎస్ శైలేంద్ర ఏడు, అర్పిత ఆరు, భవ్య నాలుగు, తేజస్విని, శృతి, అఖిల్ సూర్య మూడు చొప్పున, సాన్వి, శ్రీవల్లి, అనుష్క, అరివళగన్, జాన్వి, ప్రద్యుమ్న, షామిక్, విష్ణు ఒక్కోటి చొప్పున బంగారు పతకాలు అందుకున్నారు. పిల్లల హక్కులు, నాల్సార్ లా రివ్యూ పుస్తకాలను సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, సీఎం రేవంత్‌రెడ్డి, జస్టిస్ పీఎస్ నర్సింహ, జస్టిస్ సుజోయ్‌పాల్, వీసీ శ్రీకృష్ణదేవరావు ఆవిష్కరించారు.

రాజకీయ న్యాయానికి భరోసా!

(మొదటిపేజీ తరువాయి)

గురించే మాట్లాడుతున్నారని, వాటిని చేర్చాక ఎలా కాపాడుకోవాలో ఎవరూ మాట్లాడరేంటని ప్రశ్నించారని తెలిపారు. ఆయన మాటల్లోంచే రైట్ టు కాన్స్టిట్యూషనల్ రెమెడీస్(ఆర్టికల్ 32) వచ్చిందని చెప్పారు. ఈ ఆర్టికల్ రాజ్యాంగానికి ఆత్మలా, రక్షణ కవచంలా పని చేస్తోందని అన్నారు. పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లితే నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించే వెసులుబాటు కలిగిందని చెప్పారు. రాజ్యాంగ రచన ఒక రక్తపాత రహిత విప్లవమని కొనియాడారు.

భవిష్యత్తు తరాల్ని దృష్టిలో పెట్టుకుని రాజ్యాంగ రచన

కాలానుగుణంగా సవాళ్లను అధిగమించడానికి రాజ్యాంగ సవరణలు చేయడం ద్వారా ఆర్థిక, సామాజిక న్యాయాన్ని సాధించవచ్చని జస్టిస్ గవాయ్ అన్నారు. రాజకీయ మార్గంలో సోషలిస్ట్ సిద్ధాంతంతో రాజ్యాంగ నిర్మాణం జరిగినప్పటికీ నాటి తీర్మానాలలో సామాజిక, ఆర్థిక సమానత్వానికి సంబంధించిన అంశాలు తక్కువగానే ఉన్నాయని తెలిపారు. రాజ్యాంగ సభకు అంబేడ్కర్ ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గం దేశ విభజన తర్వాత తూర్పు పాకిస్థాన్‌లో ఉందని తెలిపారు. ఆయన రాజ్యాంగ సభలో అడుగు పెట్టే నాటికి రాజ్యాంగ రచన కమిటీలో సభ్యునిగా ఉంటాననే సంగతి కూడా తెలియదన్నారు. రెండు సంవత్సరాల కష్టం తర్వాత రచనా సంఘం సవివరంగా రాజ్యాంగ ప్రతిని సభకు సమర్పించిందని చెప్పారు. ఆనాడు అంబేడ్కర్ తన ప్రసంగంలో రాజ్యాంగం అంటే ఏమిటి? దేనికి ప్రతిరూపంగా నిలుస్తుంది? వంటి ప్రశ్నలకు వివరణలు ఇచ్చారని జస్టిస్ గవాయ్ గుర్తు చేసుకున్నారు. "అమెరికాలో లాగా సమాఖ్య వ్యవస్థ ఉంటుంది కానీ, అక్కడిలాగా ద్వంద్వ పౌరసత్వం ఉండదు. అక్కడలా కేంద్రానికి, రాష్ట్రానికి వేర్వేరు రాజ్యాంగాలు ఉండవు. మనది ఒకటే మిషన్... ఒకటే రాజ్యాంగం. దేశం ఐక్యంగా ఉండటానికి అది అవసరమని అంబేద్కర్ గట్టిగా నమ్మారు. వాదించారు. భారత రాజ్యాంగాన్ని ఒకవైపు నుంచి చూస్తే మరీ కఠినంగా ఉందని, మరోవైపు నుంచి చూస్తే మరీ ఉదారంగా ఉందని విమర్శలు వచ్చాయి. వాటికి అంబేద్కర్ సమాధానమిస్తూ, తాము రాజ్యాంగాన్ని భావి తరాలను దృష్టిలో ఉంచుకొని రచించామని చెప్పారు" అని జస్టిస్ గవాయ్ తెలిపారు. మన రాజ్యాంగం మరీ సమాఖ్య రూపంలో ఉందని కొందరు, కేంద్రీకృతంగా ఉందని కొందరు విమర్శించగా, శాంతి, యుద్ధ సమయాల్లో దేశాన్ని ఏకతాటిపై నడిపించడానికి వీలుగా అలా రూపొందించామని అంబేడ్కర్ చెప్పారన్నారు. 75 సంవత్సరాల పయనంలో భారత్ బయట నుంచి, దేశీయంగా అనేక సవాళ్లను ఎదుర్కొందని, భారతీయులంతా ఏకతాటిపై ఉన్నారని చాటి చెప్పిందని జస్టిస్ గవాయ్ గుర్తు చేశారు. దేశాన్ని ఐక్యంగా ఉంచడంతో రాజ్యాంగం పాత్ర వెలకట్టలేనిదన్నారు.



హైదరాబాద్ ఉస్మానియా వర్సిటీలో సీజేఐ జస్టిస్ గవాయ్‌ని సన్మానిస్తున్న దృశ్యం

నిజాం ఆఫర్‌ను అంబేడ్కర్ తిరస్కరించారు

హైదరాబాద్ రాజ్య ప్రధాన న్యాయమూర్తి పదవిని చేపట్టాని అప్పటి నిజాం అంబేడ్కర్‌ను ఆహ్వానించారని, ఆ ఆఫర్‌ను అంబేడ్కర్ సున్నితంగా తిరస్కరించారని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీ నరసింహ వెల్లడించారు. అంబేడ్కర్‌కు హైదరాబాద్‌కు ఉన్న అనుబంధాన్ని, అంబేడ్కర్ ఆత్మకథలోని విషయాలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. హైదరాబాద్‌లో జరిగిన సామాజిక ఉద్యమాలకు అంబేడ్కర్ మద్దతు ప్రకటించారని తెలిపారు. అంబేడ్కర్ ఆత్మకథలో హైదరాబాద్ ఉద్యమాలు, సామాజిక న్యాయం ప్రస్తావనలు ఉన్నాయని గుర్తు చేశారు. అంబేడ్కర్ ఆలోచనలు వాస్తవ రూపం దాల్చాయనడానికి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ గవాయ్ నియామకమే నిదర్శనమని చెప్పారు. తన సొంత నగరానికి, తాను చదువుకున్న విశ్వవిద్యాలయానికి భారత ప్రధాన న్యాయమూర్తితో కలిసి రావడం ఆనందంగా ఉందని అన్నారు. భారత ప్రధాన న్యాయమూర్తితో అంబేడ్కర్ మీద కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని ఉస్మానియా విశ్వవిద్యాలయం చొరవ చూపడాన్ని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్ ప్రశంసించారు. అడ్వకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి కూడా విశ్వవిద్యాలయం చొరవను కొనియాడారు. రాష్ట్ర పోస్టల్ శాఖ రూపొందించిన అంబేడ్కర్ స్మారక పోస్టల్ కవర్‌ను, పోస్టు కార్డును జస్టిస్ గవాయ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ఎం.కుమార్ మొలుగరం, ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ సలహాదారు కేశవరావు, రాష్ట్ర చీఫ్ పోస్టు మాస్టర్ జనరల్ డాక్టర్ పి.విద్యాసాగర్‌రెడ్డి, సింగరేణి సీఎండీ బలరాం నాయక్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టుల న్యాయమూర్తులు, న్యాయాధికారులు, న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అధిక వడ్డీలతో అల్లాడిపోతున్నాం!

- ప్రధాని ఆర్థిక సలహా మండలి చైర్మన్ మహేంద్రదేవ్‌తో సీఎం రేవంత్

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సమాఖ్య వ్యవస్థలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పరం గౌరవించుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి చైర్మన్ ఎస్.మహేంద్రదేవ్ ముఖ్యమంత్రిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఇరువురి మధ్య పలు అంశాలతో పాటు తెలంగాణను అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లే విషయంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రాలు అభివృద్ధి అయితేనే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా హైదరాబాద్‌తో పాటు పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించామని తెలిపారు. పారిశ్రామిక రంగంతో పాటు సేవల రంగం అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నామని, సముచితమైన అవకాశాలు కల్పిస్తేనే రాష్ట్రానికి కంపెనీలు వస్తాయని అన్నారు. గత ప్రభుత్వం అధిక వడ్డీలకు తీసుకున్న రుణాల గురించి మహేంద్రదేవ్ దగ్గర ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. అధిక శాతం వడ్డీల కారణంగా రాష్ట్రాభివృద్ధి కుంటుపడుతోందని, చెల్లింపులకు ఇబ్బంది అవుతోందని వివరించారు. వడ్డీలు చెల్లించడం కోసమే రాష్ట్ర ఆదాయాన్ని ఖర్చు చేయాల్సి వస్తోందని చెప్పారు.

14 నుంచి రేషన్ కార్డుల పంపిణీ

- తుంగతుర్తిలో ప్రారంభించనున్న సీఎం

రాష్ట్రంలో ఈ నెల 14 నుంచి కొత్త రేషన్ కార్డుల జారీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు కార్డులు పంపిణీ చేస్తామని నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త రేషన్ కార్డులతో కలుపుకుని రాష్ట్రంలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 95.56 లక్షలకు చేరుతుందని, ఫలితంగా లబ్ధి పొందే కుటుంబ సభ్యుల సంఖ్య 2.81 కోట్ల నుంచి 3.09 కోట్లకు పెరుగుతుందని తెలిపారు. కొత్త కార్డుల జారీ వల్ల రాష్ట్ర ఖజానాపై అదనంగా నెలకు రూ.95.89 కోట్ల భారం పడనుందని, ఏడాదికి ఇది రూ.1,150.68 కోట్లు అవుతుందని వివరించారు.

కార్పొరేట్లకు రాయితీలు.. పేదలపై భారం

- ఇదే ప్రధాని మోదీ విధానం: ఎ.విజయ రాఘవన్
- అమెరికా వల్ల జరిగే నష్టాలనూ చెప్పాలి: రాఘవులు

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సంస్థలకు రాయితీలు కల్పిస్తూ, పేదలపై భారం మోపడమే ప్రధాని నరేంద్ర మోదీ విధానం అని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎ.విజయ రాఘవన్ విమర్శించారు. మోదీ పాలనలో సామాన్యుల జీవన ప్రమాణాలు దిగజారాయని, ఉపాధి అవకాశాల కల్పనలో విఫలమయ్యారని విమర్శించారు. రాష్ట్ర కమిటీ సమావేశాల సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కేంద్రం అమలుచేస్తున్న జీఎస్టీ విధానం పేదలకు అనుకూలంగా లేదన్నారు. కార్పొరేట్ పన్నులు మాత్రం తగ్గించి, సంపన్నులకు ఉపయోగపడే విధానాలను కేంద్రం అమలు చేస్తోందని విమర్శించారు. అమెరికా విధిస్తున్న టారిఫ్‌లపై భారత ప్రభుత్వ విధానాన్ని ప్రకటించాలన్నారు. పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు మాట్లాడుతూ.. అమెరికా విధించిన సుంకాలకు మోదీ ప్రభుత్వం లొంగిపోతే తెలుగు రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని హెచ్చరించారు. పని గంటలు పెంచుతూ రేవంత్ ప్రభుత్వం జీవో తేవడం దురదృష్టకరం అన్నారు. అమెరికాను పొగడడమే కాకుండా దాని వల్ల జరుగుతున్న నష్టాన్ని కూడా సీఎం గ్రహించాలని హితబోధ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ.. కల్తీ కల్లు ఘటనపై సీఎం స్పందించాలని డిమాండ్ చేశారు. బసవతారకం నగరంలో పేదల ఇళ్లు కూల్చడం దుర్మార్గమన్నారు. అధికారంలోకి రాకముందు అక్కడ ఇళ్లు నిర్మించి ఇస్తామన్న సీఎం, ఇప్పుడు కూల్చడం ఏంటని ప్రశ్నించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక ఎన్నికలకు వెళ్లాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం బలంగా ఉన్న చోట బరిలో ఉంటామన్నారు.

దక్షిణ మధ్య రైల్వే నూతన జీఎంగా సంజయ్ కుమార్ బాధ్యతల స్వీకరణ


సంజయ్ కుమార్

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ (జీఎం)గా సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ బాధ్యతలు స్వీకరించారు. శ్రీవాస్తవ ఇంతకు ముందు సెంట్రల్ ఆర్గనైజేషన్ ఆఫ్ రైల్వే ఎలక్ట్రిఫికేషన్ జీఎంగా బాధ్యతలు నిర్వర్తించారు. మొదట వల్సాద్‌లో అసిస్టెంట్ ఇంజనీర్‌గా వృత్తిని ప్రారంభించిన శ్రీవాస్తవ ముంబై, వడోదరలో డివిజనల్ ట్రాక్ ఇంజనీర్, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ వంటి పదవులను నిర్వహించారు. రైట్స్ (ఆర్ఐటీఈఎస్)లో జీఎంగా, బికనీర్‌లో డివిజనల్ రైల్వే మేనేజర్‌గానూ పని చేశారు.

వికసిత్ తెలంగాణ బీజేపీకే సాధ్యం

ప్రజా చైతన్యంలో న్యాయవాదుల పాత్ర కీలకం

- బీజేపీ మద్దతు లేకుంటే రాష్ట్ర ఏర్పాటు అసాధ్యం
- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు


రాంచందర్‌రావును సన్మానిస్తున్న బీజేపీ లీగల్‌సెల్ నాయకులు

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణను వికసిత రాష్ట్రంగా మార్చడం కేవలం బీజేపీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు స్పష్టం చేశారు. ప్రజావ్యతిరేక విధానాలను ఎదుర్కొని ధర్మ యుద్ధం చేయాల్సిన సమయం వచ్చిందని, ఇందులో న్యాయవాదులు క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఉద్యమాల్లో న్యాయవాదులు ఎప్పుడూ ముందుంటారని, ప్రజల్లో మళ్లీ చైతన్యం తీసుకురావడానికి వారి పాత్ర కీలకమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తోందని, ఇలాంటి సర్కారును గద్దె దించాలంటే న్యాయవాదులు పెద్దసంఖ్యలో బీజేపీలో చేరాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వ ఏర్పాటు కోసం కృషి చేయాలని కోరారు. బీజేపీ లీగల్‌సెల్ ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో రాంచందర్‌రావుకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. "తెలంగాణ ఉద్యమ పితామహుడు కేసీఆర్ అని బీఆర్ఎస్ నేతలు.. తెలంగాణ ఇచ్చింది సోనియాగాంధీ అని కాంగ్రెస్ నేతలు చెప్పుకొంటున్నా.. బీజేపీ మద్దతు లేకపోతే రాష్ట్ర ఆవిర్భావం సాధ్యమయ్యేది కాదు. తెలంగాణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టే ముందు నేను, సీనియర్ అడ్వొకేట్ ప్రకాశ్ రెడ్డి, బార్ కౌన్సిల్ మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి, రాజ్యసభ సభ్యుడు, సీనియర్ అడ్వొకేట్ నిరంజన్ రెడ్డి కలిసి తెలంగాణ బిల్లు కాపీలతో అరుణ్ జైట్లీని కలిశాం. ఆయన సూచనతో సుష్మా స్వరాజ్‌ను కలిసి చర్చించాం. అనంతరం ప్రకాష్ జావడేకర్‌ను కలిశాం. తెలంగాణ బిల్లు పార్లమెంటులో న్యాయపరంగా ఇబ్బందులు లేకుండా పాస్ చేసే ప్రక్రియలో న్యాయవాదుల పాత్ర ఎంతో కీలకం. తెలంగాణ సాధనలో న్యాయవాదుల పాత్రను మరువలేం' అని రాంచందర్‌రావు అన్నారు.

బీసీ రిజర్వేషన్లపై స్పష్టత ఇవ్వాలి: పాయల్ శంకర్

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. శాసనసభ సమావేశం ఏర్పాటు చేసి రిజర్వేషన్లపై చర్చ జరపాలని డిమాండ్ చేశారు.

భట్టి ఆరోపణలు అప్రజాస్వామికం: నగేశ్

రాంచందర్‌రావుపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన ఆరోపణలు ప్రజాస్వామ్య వ్యతిరేకమని బీజేపీ ఎంపీ నగేశ్ అన్నారు. రోహిత్ వేముల కేసు ఎఫ్ఐఆర్‌లో రాంచందర్‌రావు పేరు లేదని.. హైకోర్టు ఈ కేసును ముగించినా ఆయనపై భట్టి ఆరోపణలు చేయడం దుస్సాహసమని మండిపడ్డారు. రాంచందర్‌రావుపై భట్టి ఆరోపణలు దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ తెలిపారు.

'బస్తీమే సవాల్.. తెల్లారితే పరార్' ఇది సీఎం రేవంత్ తీరు

ఎమ్మెల్సీ కవిత విమర్శ.. పోస్టుకార్డుల ఉద్యమానికి శ్రీకారం

షాద్‌నగర్/ కేశంపేట/హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): 'అభివృద్ధి గురించి మాట్లాడితే బస్తీమే సవాల్ అంటాడు.. తెల్లారితే పరార్ అవుతాడు.. ఇదీ ముఖ్యమంత్రి తీరు'.. అంటూ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత రేవంత్‌రెడ్డిపై ధ్వజమెత్తారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ. 2500 ఇస్తామన్న హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం రంగారెడ్డి జిల్లా కాకునూరు గ్రామం నుంచి పోస్టుకార్డుల ఉద్యమానికి ఆమె శ్రీకారం చుట్టారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను నిలబెట్టుకునేలా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని అధినేత్రి సోనియాగాంధీకి పోస్టుకార్డు పంపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయని కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి ఒక్క కాకునూరు గ్రామ మహిళలకే ఈ 18 నెలల్లో రూ. 5 కోట్లు బాకీ పడ్డారని, ఆడబిడ్డలకు స్కూటీలు ఇప్పించేందుకు అందరూ ఉద్యమించాలని కవిత అన్నారు.

రెండో దశ భూ సమీకరణపై హడావుడి వద్దు

- సీఆర్‌డీఏకు చంద్రబాబు సూచన
- రైతుల అభ్యంతరాలపై క్యాబినెట్‌లో చర్చ

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

రాజధాని అమరావతి రెండో విడత భూ సమీకరణ విషయంలో హడావుడి వద్దని సీఆర్‌డీఏ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం మౌఖికంగా ఆదేశించింది. మొదటి దశలో భూములు ఇచ్చిన రైతుల సమస్యలు ఇంకా అపరిష్కృతంగా ఉండటంపై రెండో దశలో భూములు ఇవ్వాల్సిన రైతుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. రెండోదశ పూలింగ్ ఎందుకు? ఈ భూములను ఏం చేస్తారు? భూములిచ్చే రైతులకు కలిగే ప్రయోజనాలేమిటి? రాజధానిని పరిపూర్ణం చేసే విషయంలో ప్రభుత్వ ప్రణాళికలు ఏమిటనే అంశాలపై రైతులకు అవగాహన కల్పించకపోవడం, హడావిడిగా గ్రామసభల నిర్వహణతో వారిలో ఆగ్రహం నెలకొంటోంది. రైతుల సందేహాలను పూర్తిస్థాయిలో తీర్చే ప్రయత్నాలు జరగలేదని ప్రభుత్వం కూడా అంగీకరిస్తోంది. రెండో దశ భూ సమీకరణపై మంత్రుల కమిటీని నియమించి పూర్తిస్థాయిలో అధ్యయనం చేసిన తర్వాతే రైతులను ఒప్పించి ముందుకు అడుగు వేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో ఈ ప్రక్రియను నిదానంగా ముందుకు తీసుకువెళ్లాలని అధికారులకు నిర్దేశించింది. కొత్తగా సమీకరించే భూముల్లో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్ట్‌తో పాటు స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీ, స్పోర్ట్స్ సిటీ వంటి వాటిని నిర్మిస్తామని ప్రభుత్వం చెబుతోంది. రెండోదశలో అమరావతి మండలంలోని 20,494 ఎకరాలు యుద్ధ ప్రాతిపదికన తీసుకోవాలని భావిస్తున్నారు. వీటికి ల్యాండ్ పూలింగ్ నిబంధనలు అమలు చేస్తూ చట్టసవరణ చేశారు. రెండో విడతలో 44 వేల ఎకరాలు సమీకరిస్తామని, తక్షణం 24వేల ఎకరాలు తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించడంతో ఆయా ప్రాంత రైతుల్లో ఆందోళన నెలకొంది. ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశం అనంతరం భూ సమీకరణ ప్రక్రియను నిదానంగా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. రైతుల అభ్యంతరాల అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద ప్రస్తావించిన కొందరు మంత్రులు.. తొందరపడకూడదని సూచించినట్టు సమాచారం.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

పరిస్థితి ఎంత వరకూ వెళ్లిందంటే అధికారుల్లోనూ ఈ భయం ఏర్పడింది. ఫలితంగా వారు చురుగ్గా వ్యవహరించలేకపోతున్నారు. జగన్ హయాంలో వలె ఇప్పుడు గుడ్డిగా పై నుంచి వచ్చే ఆదేశాలను అమలు చేయడానికి నిరాకరిస్తున్నారు. ప్రతి విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే తాము టార్గెట్ కాకూడదన్న ఉద్దేశంతోనే అధికారులు అతి జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఫలితంగా ప్రభుత్వంపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు పట్టు రాలేదన్న అభిప్రాయం ఏర్పడుతోంది. అధికారుల్లో ఎవరిని నమ్మాలో తెలియని పరిస్థితి. ఏ ఉద్దేశంతో తమది మంచి ప్రభుత్వం అని చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రకటించుకున్నారో గానీ అధికార యంత్రాంగం సహాయ నిరాకరణ వల్ల మంచి ప్రభుత్వం నినాదం కాస్తా మెతక ప్రభుత్వం అన్న అభిప్రాయంగా మారిపోయింది! రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందా? లేక జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నారా? అని తెలుగుదేశం కార్యకర్తలు ప్రశ్నించే వరకు పరిస్థితి వెళ్లింది.

ఆ ఇద్దరికీ నేనే టార్గెట్!


పరామర్శల పేరిట ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జరుపుతున్న పర్యటనలు ఎందుకు వివాదాస్పదం అవుతున్నాయి? పరామర్శలతో బాధితులకు సాంత్వన కలిగించాలి గానీ బలప్రదర్శన జరపడం ఏమిటి? పరామర్శల పేరిట జగన్‌రెడ్డి బయలుదేరినప్పటి నుంచి తిరిగి వెళ్లేవరకు ఉద్రిక్తతలు ఎందుకు చోటుచేసుకుంటున్నాయి? పరామర్శ యాత్రలలో వైసీపీ కార్యకర్తలు, అభిమానులు అతిగా ఆవేశపడటం దేనికి సంకేతం? ఇంతకీ ఈ బలప్రదర్శనలు జగన్‌రెడ్డి బలుపా? వాపా? రాష్ట్రంలో ప్రభుత్వం మారి ఏడాది మాత్రమే అయింది. ఇంతలోనే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అంత వ్యతిరేకత ఏర్పడుతుందా? ఒకవేళ ప్రజల్లో నిజంగానే వ్యతిరేకత ఏర్పడినా ఎన్నికలకు ఇంకా నాలుగేళ్ల వ్యవధి ఉంది. మరి ఇప్పటి నుంచే 'సీఎం సీఎం' అని కార్యకర్తలు, అభిమానులతో నినాదాలు ఇప్పించుకోవడం వల్ల జగన్‌రెడ్డి వెంటనే ముఖ్యమంత్రి అయిపోరు కదా? జగన్ పరామర్శ యాత్రలకు వస్తున్న జనం బలుపునకు సంకేతమని ఆయన మద్దతుదారులు సంబరపడిపోతుండగా, అదంతా వాపేనని, ఒక పథకం ప్రకారం కార్యకర్తలు, అభిమానులను పోగేసి గొడవ చేయిస్తున్నారని కూటమి నేతలు భావిస్తున్నారు. జగన్‌రెడ్డి రాజకీయ ఎత్తుగడలను అర్థం చేసుకోలేనివారు తమకు తోచిన విశ్లేషణలు చేస్తున్నారు. ఏడాది క్రితం జరిగిన ఎన్నికల్లో అనూహ్య పరాజయాన్ని చవిచూసిన ఆయన తేరుకోవడానికి ఎంతో సమయం పట్టలేదు. 2019 ఎన్నికల్లో ఓటమి పాలైన తెలుగుదేశం పార్టీ కోలుకోవడానికి చాలా సమయం పట్టింది. కొవిడ్ కూడా వచ్చి పడటంతో 2022 వరకు తెలుగుదేశం నాయకులు బయటకు రాలేదు. దానికితోడు ప్రభుత్వం వేధింపులు పెరిగిపోవడంతో ప్రతిపక్షాలు కకావికలం అయ్యాయి. తెలుగుదేశం నాయకులు పలువురు కలుగుల్లో దూరిపోయారు. దీంతో ఆ పార్టీ బలహీనత జగన్‌రెడ్డికి తెలిసిపోయింది. ప్రతిపక్షం నుంచి చెప్పుకోదగిన ప్రతిఘటన ఎదురుకాకపోవడంతో అంతా సవ్యంగా ఉందని జగన్ అండ్ కో భావించారు. ఫలితమే గత ఎన్నికల్లో 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోవడం. తెలుగుదేశం నాయకుల బలహీనతలను గుర్తించిన జగన్‌రెడ్డి.. ఓటమి నుంచి కోలుకొని ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండి కూడా అధికార పక్షానికి కంటి మీద కునుకు లేకుండా చేయడం కోసం వ్యూహ రచన చేసుకున్నారు. ఫలితమే పరామర్శల సందర్భంగా కార్యకర్తలతో హడావిడి చేయడం. నాలుగేళ్ల తర్వాత జరిగే ఎన్నికల కోసం ఇప్పటి నుంచే హడావిడి ఎందుకు? అన్న అనుమానం కలగడం సహజం. జగన్‌రెడ్డి తెలివితక్కువవాడు కాదు. రాజకీయంగా ఆయన ఎత్తుగడలు ప్రత్యేకంగా ఉంటాయి. నాలుగేళ్ల తర్వాత జరిగే ఎన్నికల్లో తామే అధికారంలోకి వస్తామన్న భరోసా, ఆత్మస్థైర్యాన్ని కార్యకర్తలు, అభిమానుల్లో నింపడం ప్రధాన ఉద్దేశం అయినప్పటికీ మరో లక్ష్యం కూడా ఇందులో ఉంది. కార్యకర్తల్లో భరోసా కల్పించడానికి మళ్లీ అధికారంలోకి వస్తామని ఏ రాజకీయ పార్టీ అయినా ప్రచారం చేసుకోవడం సహజం. జగన్‌రెడ్డి ఆలోచనలు మాత్రం అంతటితో ఆగిపోవు. ప్రతిపక్షంలో ఉండి కూడా అధికారపక్షాన్ని భయపెట్టడానికి ఆయన వినూత్న ఎత్తుగడలు ఎంచుకున్నారు. తెలుగునాట రాజకీయాలు ఇదివరకులా లేవు. ప్రతిపక్షంలో మనుగడ సాగించడం కష్టతరంగా మారింది. ఈ కారణంగానే 11 సీట్లకు మాత్రమే పరిమితమైనా అధికారపక్షంలో ఉన్న వారిని భయపెట్టే మార్గాన్ని జగన్‌రెడ్డి ఎంచుకున్నారు. ఆయన ఐదేళ్ల పాలనను చూసిన ప్రజలు, ఆయా రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తల్లో ఆయనంటే వణుకు ఏర్పడింది. మళ్లీ జగన్ అధికారంలోకి వస్తే? అన్న భయం సామాన్య ప్రజల నుంచి వివిధ స్థాయిల్లో ఉన్నవారిలో ఏర్పడింది. ఇది గమనించిన జగన్‌రెడ్డి భయపెట్టడాన్నే నమ్ముకున్నారు. ముందుగా సొంత పార్టీ కార్యకర్తల్లో భవిష్యత్తుపై నమ్మకం కలిగించడం ఎలా? ఆ తర్వాత అధికార కూటమి నాయకులు తన జోలికి, తమ వాళ్ల జోలికీ రాకుండా చేయడం ఎలా? అన్న దానిపై కసరత్తు చేశారు. ఈ కసరత్తు నుంచే భయపెట్టాలి అన్న ఆలోచన వచ్చింది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తాడంటారా? అన్న ప్రశ్న ప్రతి ఇద్దరిలో ఒకరి నుంచి వస్తోంది. ఆయన మళ్లీ గెలిస్తే పరిస్థితి ఏమిటి? అన్న భయం కూడా వారిలో వ్యక్తమవుతోంది. రాజకీయాలతో సంబంధం లేనివారిలో అలాంటి భయాందోళనలు ఉంటే అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి నేతల్లో కూడా ఇలాంటి భయాందోళనలు ఉండటం ఆశ్చర్యంగా ఉంది. దీన్నిబట్టి జగన్‌రెడ్డి ఎత్తుగడ ఫలించినట్టే కదా! పరిస్థితి ఎంత వరకూ వెళ్లిందంటే అధికారుల్లోనూ ఈ భయం ఏర్పడింది. ఫలితంగా వారు చురుగ్గా వ్యవహరించలేకపోతున్నారు. జగన్ హయాంలో వలె ఇప్పుడు గుడ్డిగా పై నుంచి వచ్చే ఆదేశాలను అమలు చేయడానికి నిరాకరిస్తున్నారు. ప్రతి విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే తాము టార్గెట్ కాకూడదన్న ఉద్దేశంతోనే అధికారులు అతి జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఫలితంగా ప్రభుత్వంపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు పట్టు రాలేదన్న అభిప్రాయం ఏర్పడుతోంది. అధికారుల్లో ఎవరిని నమ్మాలో తెలియని పరిస్థితి. ఏ ఉద్దేశంతో తమది మంచి ప్రభుత్వం అని చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రకటించుకున్నారో గానీ అధికార యంత్రాంగం సహాయ నిరాకరణ వల్ల మంచి ప్రభుత్వం నినాదం కాస్తా మెతక ప్రభుత్వం అన్న అభిప్రాయంగా మారిపోయింది! రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందా? లేక జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నారా? అని తెలుగుదేశం కార్యకర్తలు ప్రశ్నించే వరకు పరిస్థితి వెళ్లింది. అంటే, జగన్‌రెడ్డి ఎత్తుగడ సక్సెస్ అయినట్టే కదా? అధికారంలో ఉన్నప్పుడే కాదు.. ప్రతిపక్షంలో, అది కూడా 11 సీట్లకు పరిమితమై కూడా భయపెట్టగలగడం ఆయన ప్రత్యేకత. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో ఈ పరిస్థితి ఏర్పడటం వింతగా ఉంది. అధికారంలో ఉండి కూడా భయం నీడలో బతకడం ఆశ్చర్యంగా ఉంది. ఈ భయం కారణంగా చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ వంటి వారిని మినహాయిస్తే, మిగతా నాయకులు ప్రస్తుతానికి అధికారం అనుభవిద్దాం, 2029 తర్వాత ఏం జరిగినా మనం సేఫ్‌గా ఉందాం అన్న ధోరణిని అలవర్చుకుంటున్నారు. భయపెట్టే ప్లాన్ సత్ఫలితాలు ఇస్తుండటంతో జగన్ అండ్ కో మరింతగా రెచ్చిపోతున్నారు. ఈ క్రమంలోనే రప్పా రప్పా నరుకుతాం అన్న నినాదాన్ని అందుకున్నారు. వైసీపీ నాయకుల నుంచి కార్యకర్తల వరకు ఇప్పుడు ఈ పదాలే ఫ్యాషన్ అయ్యాయి. మామిడి రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదంటూ చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో జగన్‌రెడ్డి చేపట్టిన తాజా పరామర్శ యాత్రలో కొంత మంది కార్యకర్తలు.. పోలీసు అధికారుల చేతులు నరుకుతామని హెచ్చరికలు చేశారు. పనిలో పనిగా 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడి చేశారు. అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే కాదు.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా దాడులు చేయగలమని రుజువు చేసుకుంటున్నారు. పోలీసుల చేతులు నరుకుతామని రంకెలు వేసినవారు స్వేచ్ఛగా తిరగడం దేనికి సంకేతం? మొగుడిని కొట్టి మొగసాలకు ఎక్కినట్టుగా ప్రతిపక్షంలో ఉండి కూడా ఇటు అధికారులను, అధికార పార్టీ నాయకులను భయపెట్టడంతో పాటు మరోవైపు మీడియాపై దాడులకు తెగబడుతున్న జగన్ అండ్ కో.. కూటమి ప్రభుత్వమే రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందని నిందిస్తున్నారు. కూటమి నాయకులు ఉత్తుత్తి ప్రకటనలు చేస్తుండగా ప్రతిపక్ష వైసీపీ నాయకులు, కార్యకర్తలు చేసి చూపిస్తున్నారు.

భయం ఆసరాగా విజృంభణ

పిరికితనం అనేది తెలుగుదేశం పార్టీ నాయకుల డీఎన్ఏలోనే ఉంది. ఎన్టీఆర్ హయాం నుంచీ ఇదే పరిస్థితి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పోరాటాలు చేయాలంటే భయం. అధికారంలో ఉన్నప్పుడు ఎందుకైనా మంచిదని అవతలి పక్షంతో లాలూచీ పడటం పరిపాటి అయింది. క్రిమినల్ సైకాలజీలో ఆరితేరినవారు ముందుగా ప్రత్యర్థుల బలహీనతలను అధ్యయనం చేస్తారు. ఆ తర్వాత ఎవరిని ఎలా లొంగదీసుకోవాలో స్కెచ్ వేసి అమలుచేస్తారు. ఈ క్రమంలోనే జగన్ అండ్ కో తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులు, మంత్రులలో గూడుకట్టుకుని ఉన్న భయాన్ని ఆసరాగా చేసుకొని విజృంభిస్తున్నారు. జనసైనికులు కూడా సోషల్ మీడియాలో ఉన్నంత చురుగ్గా క్షేత్ర స్థాయిలో ఉండటం లేదు. భారతీయ జనతా పార్టీ టచ్ మీ నాట్ అన్నట్టే ఉంటోంది. స్థూలంగా కూటమి పరిస్థితి ఇది. ఫలితంగా జగన్‌రెడ్డి పరామర్శ యాత్రలు సంచలనం అవుతున్నాయి. నిజానికి జగన్‌రెడ్డిది బలుపు కాదు.. వాపు మాత్రమే. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉంటే రోడ్ల మీదకు వచ్చి నరుకుతాం.. చంపుతాం అని రంకెలు వేయరు. 2024 ఎన్నికలకు ముందు చంద్రబాబు, పవన్ కల్యాణ్ సభల్లో ఇలాంటి నినాదాలు వినపడలేదే? ఎన్నికల వరకు సైలెంట్‌గా ఉండే జనం పోలింగ్ రోజు బ్యాలెట్ పెట్టెల్లో మాత్రమే తమ అంతరంగాన్ని ఆవిష్కరిస్తారు. తెలంగాణలో కేసీఆర్ విషయంలో కూడా ఇలాగే జరిగింది. 2024కు ముందు జగన్‌రెడ్డి పట్ల ఈ స్థాయిలో వ్యతిరేకత ఉందని తలపండిన రాజకీయ విశ్లేషకులు, సెఫాలజిస్టులు కూడా పసిగట్టలేకపోయారు. ఇప్పుడు జగన్ పర్యటనల్లో కనిపిస్తున్న హడావిడి 2024కు ముందు చంద్రబాబు సభల వద్ద కనిపించలేదు. ముఖ్యమంత్రిగా ఉన్న జగన్‌రెడ్డి సభల వద్ద కూడా ఈ హడావిడి ఉండేది కాదు. ఇప్పుడే ఎందుకు? కార్యకర్తలు, అభిమానులు మొదటిసారి జగన్‌ను చూస్తున్నారా అంటే అదేమీ కాదు. 2019కి ముందు పాదయాత్రల పేరిట నెలల తరబడి ఆయన జనంలోనే ఉన్నారు. ఇప్పుడు ఎన్నికల్లో ఓడిపోయి ఏడాది తిరగకముందే జగన్ పట్ల జనంలో ఎందుకు క్రేజ్ ఏర్పడుతుంది? తాము పిచ్చి పిచ్చిగా అభిమానించే నాయకుడు ఓడిపోయాడనే బాధ ఉంటే ఉండవచ్చు. అలాంటి వారు ఇలా రెచ్చిపోయి నరుకుతామంటూ హెచ్చరికలు చేయరు. తమ నాయకుడికి సంఘీభావం చెప్పడానికి మాత్రమే బయటకు వస్తారు. పదిహేనేళ్లుగా రాజకీయాల్లో, అది కూడా జనాల్లో కలియదిరిగిన ఏ నాయకుడికైనా సినిమా స్టార్‌లాగా క్రేజ్ ఉండటం అసహజంగా అనిపించడం లేదా? పై స్థాయి నుంచి కింది స్థాయి వరకు అందరూ కూడబలుక్కున్నట్టుగా అధికారంలోకి వచ్చాక నరుకుతాం, చంపుతాం, సినిమా చూపిస్తాం అని హెచ్చరికలు చేయడం వెనుక కచ్చితంగా పకడ్బందీ వ్యూహమే ఉంది. జగన్‌రెడ్డి పాలనలో గ్రామస్థాయిలో తెలుగుదేశం, జనసేన కార్యకర్తలు అనేక వేధింపులకు గురయ్యారు. కేసులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు వారందరూ ప్రతీకారం తీర్చుకోవాలని కోరుకోవడం సహజం. ఈ కారణంగానే కింది స్థాయిలో తమ పార్టీ కార్యకర్తల జోలికి రావాలంటే భయపడే పరిస్థితిని కల్పించాలని జగన్‌రెడ్డి వ్యూహ రచన చేసినట్టుగా ఉంది. ఈ క్రమంలోనే అవతలి పక్షాన్ని ముందుగానే భయపెట్టడం అనే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. ఫలితంగా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బాధలు పడిన కార్యకర్తల గోడును ఇప్పుడు పదవులు అనుభవిస్తున్న కూటమి నాయకులు పట్టించుకోవడం లేదు. పోలీసులు, ఇతర అధికార యంత్రాంగం గురించి ఇది వరకే చెప్పుకొన్నాం.

పదిహేనేళ్లుగా రాజకీయాల్లో, అది కూడా జనాల్లో కలియదిరిగిన ఏ నాయకుడికైనా సినిమా స్టార్‌లాగా క్రేజ్ ఉండటం అసహజంగా అనిపించడం లేదా? పై స్థాయి నుంచి కింది స్థాయి వరకు అందరూ కూడబలుక్కున్నట్టుగా అధికారంలోకి వచ్చాక నరుకుతాం, చంపుతాం, సినిమా చూపిస్తాం అని హెచ్చరికలు చేయడం వెనుక కచ్చితంగా పకడ్బందీ వ్యూహమే ఉంది.

జగన్‌రెడ్డి చూపిస్తున్న వాపును చూసి కూటమి నాయకులు, కార్యకర్తలు భయపడే పరిస్థితి ఏర్పడింది. నిజంగా జగన్‌రెడ్డి బలపడ్డారా? అని ఆరా తీస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. తమపై అధికారాన్ని ప్రయోగించకుండా కూటమిని కట్టడి చేయడంలో జగన్ అండ్ కో సఫలం అవుతున్నారు. పరామర్శ యాత్రల సందర్భంగా అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఎక్కడ దాక్కుంటున్నారో కూడా తెలియదు. ప్రతిపక్ష నాయకుడికి వ్యతిరేకంగా కనీసం ప్రకటనలు చేయడానికి కూడా వారు సిద్ధపడటం లేదు. అంటే జగన్ జోలికి ఎవరూ రాకుండా కట్టడి చేయడానికి స్టెరాయిడ్స్ మాదిరిగా పరామర్శ యాత్రలను బలప్రదర్శన యాత్రలుగా మార్చుకుంటున్నారు. అధికార కూటమి నాయకులు, కార్యకర్తల్లో భయం నెలకొల్పిన జగన్ అండ్ కో ఇప్పుడు మీడియాను కూడా టార్గెట్‌గా ఎంచుకోబోతున్నారు. మాజీ మంత్రి పేర్ని నాని శుక్రవారం నాడు చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. చీకట్లో కన్ను కొట్టగానే పనై పోవాలి గానీ రప్పా రప్పా అంటూ గోల చేయడం ఏమిటి? మన శత్రువులను చెప్పకుండా వేసేయాలి అని పేర్ని నాని కార్యకర్తలను పరోక్షంగా రెచ్చగొడుతున్నారు. కార్మిక సంఘాల నాయకుడిగా, రాజకీయ నాయకుడిగా లబ్ధప్రతిష్ఠుడైన పేర్ని కృష్ణమూర్తి కుమారుడైన పేర్ని నాని ఇలా మాట్లాడటం శోచనీయం. సహవాస దోషం కాబోలు. అధికారంలోకి వస్తే నరుకుతామని వాగడం వల్ల ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడే ప్రమాదం ఉందని, నరుకుదామనుకున్న వారిని చెప్పకుండానే నరకాలని, చీకట్లోనే పనైపోవాలని టిప్స్ ఇచ్చే స్థాయికి ఆయన దిగజారారు. తాజాగా జగన్‌ను వ్యతిరేకించే మీడియాను కూడా ముక్కలు ముక్కలుగా నరకాలని ఆయన కార్యకర్తలకు నూరి పోస్తున్నారు.



జగన్‌రెడ్డి పాలనలో గ్రామస్థాయిలో తెలుగుదేశం, జనసేన కార్యకర్తలు అనేక వేధింపులకు గురయ్యారు. కేసులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు వారందరూ ప్రతీకారం తీర్చుకోవాలని కోరుకోవడం సహజం. ఈ కారణంగానే కింది స్థాయిలో తమ పార్టీ కార్యకర్తల జోలికి రావాలంటే భయపడే పరిస్థితిని కల్పించాలని జగన్‌రెడ్డి వ్యూహ రచన చేసినట్టుగా ఉంది. ఈ క్రమంలోనే అవతలి పక్షాన్ని ముందుగానే భయపెట్టడం అనే వ్యూహాన్ని అమలుచేస్తున్నారు. ఫలితంగా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బాధలుపడిన కార్యకర్తల గోడును ఇప్పుడు పదవులు అనుభవిస్తున్న కూటమి నాయకులు పట్టించుకోవడం లేదు. జగన్‌రెడ్డి చూపిస్తున్న వాపును చూసి కూటమి నాయకులు, కార్యకర్తలు భయపడే పరిస్థితి ఏర్పడింది. నిజంగా జగన్‌రెడ్డి బలపడ్డారా? అని ఆరా తీస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పరామర్శ యాత్రల సందర్భంగా అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఎక్కడ దాక్కుంటున్నారో కూడా తెలియదు. ప్రతిపక్ష నాయకుడికి వ్యతిరేకంగా కనీసం ప్రకటనలు చేయడానికి కూడా వారు సిద్ధపడటం లేదు.

సరికొత్త దుస్సంప్రదాయం!

మీడియాను టార్గెట్‌గా ఎంచుకోవడంలో ఎవరికి ఎవరు ఆదర్శమో తెలియదు గానీ భారత రాష్ట్ర సమితి–వైసీపీలు అవిభక్త కవలలుగా వ్యవహరిస్తున్నాయి. రాజకీయ పార్టీలు తమ రాజకీయ ప్రత్యర్థులతో తలపడాలి కానీ మీడియాను తమ ప్రత్యర్థులుగా ప్రకటించుకోవడాన్ని ఇప్పుడే చూస్తున్నాం. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి అనేక మీడియా సంస్థలు ఆయా ప్రభుత్వాలకు మద్దతునివ్వడం, విమర్శించడం చూశాం. తమ ప్రభుత్వాన్ని విమర్శించే మీడియాను ఇప్పటిలాగా రాజకీయ ప్రత్యర్థిగా ఎవరూ ప్రకటించలేదు. అత్యవసర పరిస్థితి ప్రకటించినప్పుడు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వంటి అనేక పత్రికలు అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీని వ్యతిరేకించాయి. అప్పుడు ప్రభుత్వపరంగా సదరు పత్రికలకు ఇబ్బందులు సృష్టించారు గానీ ఆయా పత్రికల యాజమాన్యాలు, సిబ్బందిని ఇందిరాగాంధీ తన రాజకీయ ప్రత్యర్థులుగా ప్రకటించలేదు. ఉమ్మడి రాష్ట్రంలో రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ ధోరణికి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో కేసీఆర్, ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్‌రెడ్డి మీడియాను రాజకీయ ప్రత్యర్థులుగా ప్రకటించుకున్నారు. తెలంగాణ శాసనసభకు తొలిసారిగా ఎన్నికైన కొందరు సభ్యులు ప్రమాణస్వీకారం సందర్భంగా ఇబ్బంది పడటాన్ని 'ఏబీఎన్–ఆంధ్రజ్యోతి' చానల్ హేళన చేయకపోయినా చేసినట్టు ప్రచారం చేసి తెలంగాణలో చానల్ ప్రసారాన్ని అడ్డుకున్నారు. 2024 ఎన్నికలకు ముందు జగన్మోహన్‌రెడ్డి కూడా ఎంపిక చేసిన కొన్ని మీడియా సంస్థలను రాజకీయ ప్రత్యర్థులుగా ప్రకటించుకున్నారు. ఈ పని కేసీఆర్ చేసినా, జగన్‌రెడ్డి చేసినా అది వారి బలహీనతకు నిదర్శనం. ఈ ఇరువురు నాయకులకూ సొంత మీడియా సంస్థలు ఉన్నాయి. అధికారం కోల్పోగానే ప్రభుత్వాలపై వారి మీడియా సంస్థలు ఎంత దారుణంగా దుష్ప్రచారం చేస్తున్నాయో చూస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌లో 2014–19 మధ్య కాలంలోను, 2024 నుంచి నేటి వరకు జగన్ మీడియా కూటమి ప్రభుత్వంపై ఎంతలా విరుచుకుపడుతున్నదో చూస్తున్నాం. తెలంగాణలో కేసీఆర్ మీడియాదీ అదే ధోరణి. తమ దారికి రాని మీడియా సంస్థలకు ప్రభుత్వపరంగా ప్రకటనలు నిలిపివేయడం గతంలోనూ జరిగింది. అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్, జగన్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి' సంస్థకు పైసా ప్రకటన కూడా ఇవ్వలేదు. అయినా వాటిని మేం ఖాతరు చేయలేదు. ఇప్పుడు అంతటితో ఆగకుండా మీడియాపై దాడులు చేయాలన్న నిర్ణయానికి కూడా రావడం ఆశ్చర్యంగా ఉంది. ఈ ధోరణి సమర్థనీయం అయితే కేసీఆర్, జగన్‌రెడ్డి మీడియాలపై ఏ స్థాయిలో దాడులు చేయాలి? తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అయినా కేసీఆర్ మీడియాపై దూకుడు ప్రదర్శించలేదు. అధికారంలో ఉన్నవారు దాడులు చేయించాలనుకుంటే ఆపేది ఎవరు? ఆంధ్రప్రదేశ్‌లో కూడా జగన్‌రెడ్డి మీడియాపై కూటమి నేతలు దాడులు చేయించి, సిబ్బందిని కొట్టడం వంటి చర్యలకు పాల్పడలేదు. విచిత్రంగా ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ, బీఆర్ఎస్ నాయకులే దాడుల గురించి మాట్లాడుతున్నారు. మీడియాపై ఆధారపడి రాజకీయాలు చేసేవారు బలమైన నాయకులు కాలేరు. 2023 ఎన్నికలకు ముందు 'ఆంధ్రజ్యోతి' మినహా మిగతా మీడియా అంతా కేసీఆర్ ప్రభుత్వాన్ని తలపై పెట్టుకొని మోసింది. అయినా ఎన్నికల్లో ఆయనను ప్రజలు తిరస్కరించారు. రాజకీయ నాయకులు ఈ వాస్తవాన్ని ఎందుకు గుర్తించడం లేదో? ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌కు అనుకూలంగా ఆయన మీడియా ఎంత ప్రచారం చేసినా ఓటమిని తప్పించుకోలేకపోయారు కదా? ఇప్పుడు మీడియాపై దాడులు చేయాలనుకుంటున్నవారు అలా చేస్తే ప్రజల్లో మరింత వ్యతిరేకత పెరుగుతుందని గుర్తించలేకపోవడం విషాదం. అటు జగన్ మీడియాకు, ఇటు కేసీఆర్ మీడియాకు నేను ఒక ముడిసరుకుగా మారాను. దాదాపు పదిహేను సంవత్సరాలుగా ఈ ఇరువురి మీడియా సంస్థలు నాపై పుంఖాను పుంఖాలుగా వార్తలు వండి వడ్డించాయి. అయినా ఇటు తెలంగాణలో గానీ, అటు ఆంధ్రప్రదేశ్‌లో గానీ మా సంస్థను ప్రజల నుంచి దూరం చేయలేకపోయారు. తెలంగాణలో కేసీఆర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌రెడ్డికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాన ప్రత్యర్థులు. అయినా కేసీఆర్, జగన్‌రెడ్డిలు ఆ ఇరువురి కంటే నన్నే ప్రధాన ప్రత్యర్థిగా పరిగణిస్తున్నారు. ఒక జర్నలిస్టుగా ఇందుకు నేను గర్విస్తున్నాను. ఎక్కడో నిజామాబాద్ జిల్లాలోని మారుమూల గ్రామంలో పుట్టి పెరిగిన నేను కేసీఆర్–జగన్‌కు టార్గెట్ అయ్యే స్థాయికి ఎదగడం నా మటుకు నాకు గర్వకారణం. మా సంస్థలకు దురుద్దేశాలు ఆపాదించాలని ఎంతగా ప్రయత్నించినా మాకు ఉన్న విశ్వసనీయత మిగిలే ఉంది. నన్ను రాజకీయ ప్రత్యర్థిగా టార్గెట్ చేసుకున్నంత మాత్రాన ప్రజాక్షేత్రంలో వారి బలం పెరగదు. తమ చర్యల ద్వారా నన్ను పెంచుతూ తమను తాము తక్కువ చేసుకుంటున్న వాస్తవాన్ని కేసీఆర్, జగన్‌రెడ్డి గుర్తిస్తే వారికే మంచిది. కొంత మంది రాజకీయ మరుగుజ్జులు, విదూషకులు చేసే ప్రకటనలకు స్పందించవద్దని, అలా చేస్తే వారి స్థాయి పెరుగుతుందని భారత రాష్ట్ర సమితికి చెందిన కొంత మంది ముఖ్యులు నాకు సలహా కూడా ఇచ్చారు. ఈ సలహాను పాటించాలనే నేను నిర్ణయించుకున్నాను. తమకు వ్యతిరేకంగా ఉంటున్న మీడియా సంస్థలను ముక్కలు ముక్కలుగా చేయాలని కార్యకర్తలను పేర్ని నాని వంటి వారు రెచ్చగొట్టినంత మాత్రాన భయపడేంత బలహీనంగా మీడియా సంస్థలు ఉండవు. తాత్కాలికంగా ఇబ్బందులు ఏర్పడినా తట్టుకోగలవు. దుష్ట సంప్రదాయాలను నెలకొల్పాలనుకుంటే అవి రేపటి రోజున మనల్నే మింగేస్తాయి అని ఇలాంటి వారు గుర్తుంచుకోవాలి!

మన వీధికి వచ్చిన నాటకం

సాంస్కృతిక దార్శనికుడు బాదల్ సర్కార్. నాటకం అంటే పుక్కిటి పురాణం కాదనీ, జనజీవన ప్రతిబింబమని నమ్మిన బాదల్ సర్కార్ భారతీయ రంగస్థలాన్ని విప్లవీకరించారు. అభివ్యక్తికి ఒక మౌలిక లక్ష్యం నిర్దేశించారు. అసమానతల గోడల్ని కూల్చడం కోసమే కళ అంటూ నినదించారు. ఉన్నత వర్గాల వారికి మాత్రమే పరిమితమైన రంగస్థలానికి స్వేచ్ఛను ప్రసాదించి, ప్రజా రంగస్థలంగా మలిచారు. కల్పిత కథలు, నిజ జీవితంతో సంబంధం లేని పాత్రలను కాలదన్ని పీడిత ప్రజలకు అండనిచ్చే హృద్యమైన మానవతా మంద్ర స్వరంగా నాటకాన్ని బాదల్ మార్చివేశారు. నాటక ప్రయోక్తగా ఎన్నో భిన్నమైన ప్రయోగాలు చేశారు. సగటు మనిషి ప్రసక్తి లేని పౌరాణిక నాటకాన్ని, కులీన వర్గానికి మాత్రమే నవీన నాటకం రెంటినీ అధిగమించి మొట్టమొదటిసారిగా సగటు మనిషి కోసం 'మూడో రంగస్థలం' (థర్డ్ థియేటర్)ను సృష్టించారు. అందుకే ప్రపంచ రంగస్థలం ఆయన్ని 'ఫాదర్ ఆఫ్ థర్డ్ థియేటర్'గా గౌరవిస్తోంది.

జూలై 15, 1925న కలకత్తాలో సుధీంద్ర సర్కార్‌గా పుట్టిన బాదల్ ఇంజనీరింగ్ చదివారు. ఇంగ్లాండ్, నైజీరియా మొదలైన దేశాలలో ఉద్యోగాలు చేశారు. యాభై వరకు నాటకాలు రచించిన బాదల్ సర్కార్ భారతదేశంలో పీడిత ప్రజల పక్షాన ప్రత్యామ్నాయ రంగస్థలాన్ని లోతుగా అధ్యయనం చేసిన మొదటి వ్యక్తి. సంప్రదాయక నాటక రంగాన్ని కాదని సమిష్టి కృషితోనే కళ సంపూర్ణ వికాసం పొందుతుందని ఆయన నిరూపించారు. అందుకే, నాటక ప్రదర్శనకి ఆయన సరికొత్త నిర్వచనం ఇచ్చారు. ప్రదర్శనశాలలకు పరిమితమైన నాటకాన్ని ఏకంగా నాలుగు వీధుల కూడలిలోకి తీసుకువచ్చి మొదటిసారిగా 'వీధి నాటకాన్ని' నిర్మించారు. భారతీయ రంగస్థల చరిత్రలో అదో అసాధారణ విప్లవం. నాటకం అంటే గంటలకొద్దీ సాగే కథనం కాదని, అది ఒక నిరంతర చైతన్య ప్రవాహమని బాదల్ చాటారు. వీధి నాటకాన్ని ప్రజా ఉద్యమంగా మలిచారు. ఆ ప్రక్రియలో నిత్య ప్రయోగశీలిగా నిలిచారు. ఈనాటికి కూడా స్ట్రీట్ ప్లే (వీధి నాటకం), అది ఏ ప్రాంతంలో, ఏ స్థాయిలో ప్రదర్శితమౌతున్నా దానికి ఆద్యుడు మాత్రం బాదల్ సర్కారే.

బాదల్ సర్కార్ దృష్టిలో నాటకం అంటే సమాజంలో భాగం, జీవితానికి ప్రతిబింబం, సత్యాన్వేషణకి సోపానం. నాటక కళ నలుగుర్ని దగ్గరికి చేర్చాలి. వారి గుండె బరువు తీర్చాలని ఆయన విశ్వసించారు. సగటు మనిషి కోసం 'మూడో రంగస్థలం' (థర్డ్ థియేటర్)ను సృష్టించి మానవతా మంద్ర స్వరంగా నాటకాన్ని బాదల్ మార్చివేశారు.



బాదల్ సర్కార్ దృష్టిలో నాటకం అంటే జీవితాన్ని వినూత్నంగా దర్శింపజేసే విశిష్టమైన కళాత్మక సాధనం. అదేదో అలౌకికమైనది కాదు. సమాజంలో భాగం. జీవితానికి ప్రతిబింబం. సత్యాన్వేషణకి సోపానం. నాటక కళ నలుగుర్ని దగ్గరికి చేర్చాలి. వారి గుండె బరువు తీర్చాలి. అందుకే, అసలు వీధి నాటకం కళే కాదన్న వారికి దీటుగా జవాబిస్తూ, 'ప్రధాన స్రవంతి నాటకం ఆధిపత్య రూపమైతే, ప్రత్యామ్నాయ నాటకం మార్పుకు మాధ్యమం' అని బాదల్ నిరూపించారు. నక్సల్బరి ప్రభావితులయిన సగటు బెంగాల్ యువత సంక్లిష్ట మనస్తత్వాన్ని చిత్రించే అనేక విలువైన నాటక రచనలు బాదల్ చేశారు. 'అవర్ స్ట్రీట్ థియేటర్' (మన వీధి నాటకం) అన్న తన పుస్తకంలో పాలకుల నిర్బంధంలో వీధినాటకం, 'గెరిల్లా నాటకం'గా రూపాంతరం చెందుతుందని బాదల్ అన్నారు. ప్రశ్నను సహించలేని పాలక వర్గాలు, ధిక్కారాన్ని ఓర్చుకోలేని ప్రభుత్వాలు కళలను కట్టడి చేయడానికి, అణచివేయడానికి ప్రయత్నించినప్పుడు ప్రజా నాటకం మరింత బలోపేతం కావాలని బాదల్ అన్నారు. నాటక కళా తాత్వికతను పునర్ నిర్వచించిన బాదల్, నాటకం అంటే కేవలం కల్పిత వినోద 'ప్రదర్శన' కాదని, అది వ్యవస్థలోని నిజాలను 'నిదర్శనం'గా చూపే శక్తిమంతమైన వాహకమని అన్నారు.

అందుకు అనుగుణంగానే చివరి వరకు ఆయన జీవితం సాగింది. దశాబ్దాల పాటు ప్రత్యామ్నాయ నాటక కళా ఉద్యమానికి నేతృత్వం వహించిన బాదల్ సర్కార్ ఎన్నడూ పాలకుల మెప్పు కోసం పాకులాడలేదు. మొదట్లో పద్మశ్రీ, సంగీత నాటక అకాడమీ పురస్కారాల్ని అంగీకరించినా తర్వాత కాలంలో చైతన్యం పెంపొంది ప్రభుత్వం ఇస్తానన్న పద్మభూషణ్ అవార్డును రెండుసార్లు నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. 1967లో 'శతాబ్ది' అనే రంగస్థల సంస్థను స్థాపించిన బాదల్, ఈబాంగ్ ఇంద్రజిత్, బాసి ఖబర్, సారీ రాత్, పగల గోడా, స్పార్టకస్, బోమా వంటి అనేక వైవిధ్య నాటకాలు రచించారు.

అతి తక్కువ ఖర్చుతో, తక్కువ మందితో ఎక్కడికక్కడ సొంతంగా ప్రదర్శించగలిగేది వీధి నాటకం. అందుకనే, పౌరసమాజంపై వెన్వెంటనే గాఢమైన ముద్రవేసే ఈ ప్రక్రియ త్వరలోనే ప్రజల్లోకి లోతుగా వెళ్ళిపోయింది. అనేక సాంస్కృతిక సంఘాలు వీధి నాటకాన్ని ఆయుధంగా ప్రయోగించడం పెరిగిపోయింది. 80వ దశకంలో కేరళలో ప్రారంభమై దేశ వ్యాప్తంగా కొనసాగిన వైజ్ఞానిక కళాజాతా మొదలుకుని జాతీయ స్థాయిలో జరిగిన మూఢనమ్మకాల వ్యతిరేక ఉద్యమం, తెలుగు రాష్ట్రాల్లో ఉవ్వెత్తున ఎగిసిన అక్షరాస్యత ఉద్యమం, మద్యపాన వ్యతిరేక ఉద్యమం తదితర ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్న అసంఖ్యాక ప్రజలకు స్ఫూర్తి నింపిన వివిధ కళా రూపాలు, వీధి నాటకాలకు మూలం నాడు బాదల్ సర్కార్ రూపొందించిన రంగస్థల కార్యాచరణ ప్రభావితాలే. అదక్కడితో ఆగలేదు, అటు ఆదివాసి దళిత బహుజన సాంస్కృతిక సంస్థల నుండి, ఇటు ప్రగతిశీల మహిళా, గాంధేయవాద, సోషలిస్టు, వామపక్ష శక్తుల వరకు ప్రతి ప్రజాసంఘమూ వీధి నాటకాన్ని, భావజాల ప్రచార పనిముట్టుగా ఆశ్రయించాల్సి రావడం, బాదల్ సర్కార్ భావోద్యమాలలో సాధించిన అరుదైన విజయం. ప్రత్యామ్నాయ కళా రూపకంగా వీధి నాటకానికి మాత్రమే దక్కిన అపూర్వ గౌరవం. ప్రత్యామ్నాయ నాటకం ప్రజాచైతన్య పూరకం. మనిషి జీవితానికి సంబంధించిన ఉన్నత విలువలను ప్రమాణీకరించేది నాటకం. అది అనాదిగా అభివృద్ధి చెందుతున్న మానవాళి అభివ్యక్తికి ఆదర్శాత్మక చిహ్నం.

కళాకారుడిగా, ప్రయోక్తగా, రచయితగా, సాంస్కృతిక కార్యకర్తగా, నిత్య చైతన్యశీలిగా బతికిన బాదల్ సర్కార్ 2011, మే 11న కేన్సర్‌తో చనిపోయారు. భారతీయ రంగస్థల చరిత్రలో మహత్తరమైన మార్పుకి సారథ్యం వహించిన ప్రజాపక్ష మేధావిగా బాదల్ సర్కార్ శాశ్వతంగా నిలిచిపోతారు. ఆయన దిశానిర్దేశం చేసిన ప్రత్యామ్నాయ రంగస్థలాన్నీ, అందులో ప్రధానమైన వీధి నాటకాన్ని మరింత బలోపేతం చేసుకుని సమసమాజ నిర్మాణం దిశగా సాగడమే బాదల్ సర్కార్ ఆశయ స్ఫూర్తికి మనం ఇవ్వాల్సిన బాధ్యతాయుతమైన నివాళి.

▪ గౌరవ్
సాంస్కృతిక కార్యకర్త (90320 94492)

(జూలై 15: బాదల్ సర్కార్ శతజయంతి)



నేడు లష్కర్ బోనాలు

తెల్లవారుజామున 3.30గంటలకే తొలిబోనం

అమ్మవారిని దర్శించుకోనున్న సీఎం రేవంత్‌రెడ్డి





సికింద్రాబాద్, రాంగోపాల్‌పేట్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆచార వ్యవహారాలు, సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే లష్కర్ బోనాల జాతరకు సర్వం సిద్ధమైంది. ఉజ్జయినీ మహాకాళి బోనాలకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. ఆదివారం బోనాల సమర్పణ, సోమవారం భవిష్యవాణి వినిపించే రంగం కార్యక్రమాలు జరగనున్నాయి. అమ్మవారి దర్శనం కోసం మొత్తం 6 క్యూలను ఏర్పాటు చేయగా బోనాలతో వచ్చే భక్తులకు వీటిలో 2 క్యూలను ప్రత్యేకంగా కేటాయించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు 2,500మందికిపైగా పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతమున్న వాటికి అదనంగా మరో 40 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

- ఆదివారం తెల్లవారుజామున 3.30గంటలకు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఆలయ అనువంశిక ధర్మకర్తల కుటుంబ సభ్యులు సురిటి రామేశ్వర్, సురిటి కామేశ్వర్‌లు అమ్మవారికి తొలి బోనం సమర్పిస్తారు.
- రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం ఉదయం 10.30గంటలకు శ్రీఉజ్జయినీ మహాకాళి అమ్మవారిని దర్శించుకోనున్నారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకోనున్నారు.

బోనాల చెక్కుల పంపిణీలో రగడ 6

స్వచ్ఛ సర్వేక్షణ్ 2025లో జీహెచ్‌ఎంసీకి సెవెన్ స్టార్

టాప్ – 5లోపు ర్యాంకు దక్కే అవకాశం

17న ఢిల్లీలో అవార్డుల ప్రదానం

హైదరాబాద్ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్ 2025లో జీహెచ్ఎంసీకి మెరుగైన రేటింగ్ దక్కింది. 10 లక్షలకు పైగా జనాభా ఉన్న కేటగిరీలో సెవెన్ స్టార్ రేటింగ్ పొందినట్టు జీహెచ్ఎంసీ వర్గాలు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నాయి. గార్బేజ్ ఫ్రీ సిటీగా ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే మెరుగైన స్థితిలో హైదరాబాద్ ఉండటం వల్లే ఈ ఘనత సాధించినట్టు అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు జీహెచ్ఎంసీ 9వ ర్యాంకు పొందుతూ వచ్చింది. ఇప్పుడు టాప్- 5 లోపు ర్యాంకు ఉండే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నెల 17వ తేదీన ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో అవార్డులు ప్రదానం చేస్తారన్నారు. అయితే, టాప్-3 లో చోటు దక్కితే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా పురస్కారం పొందే అవకాశం దక్కనుంది.

అండర్‌గ్రౌండ్ ఎలక్ట్రిసిటీ

నగర వ్యాప్తంగా భూగర్భ కేబుల్ వ్యవస్థ ఏర్పాటుపై డిస్కం దృష్టి

బెంగళూర్‌లో పరిశీలించిన డిప్యూటీ సీఎం, సీఎండీ

మూడు జోన్లలో సర్కిళ్ల వారీగా డీపీఆర్‌లు సిద్ధం

అంచనా వ్యయం రూ. 14-15 వేల కోట్లు

కేంద్రం ఆర్‌డీఎస్ఎస్ పథకంలో భాగంగా పనులు చేపట్టే యోచన



బెంగళూర్‌లో భూగర్భ కేబుల్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క(ఫైల్)



భూమిలో అంతర్గత డ్రిల్లింగ్‌తో కేబుల్స్ వేసే విధానం

హైదరాబాద్ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : నగరంలో వేలాడే విద్యుత్‌తీగలను తగ్గిస్తూ భూగర్భ (అండర్‌గ్రౌండ్) కేబుల్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చే దిశగా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందుకుగాను జూన్‌లోనే డిస్కం క్షేత్రస్థాయిలో సర్కిళ్లవారీగా ప్రత్యేక సర్వేను నిర్వహించింది. జోన్ల వారీగా డిటైల్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)లను సిద్ధం చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్థల బలోపేతానికి ప్రవేశపెడుతున్న పథకాల్లో భాగమైన రివ్యాంపుడ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ (ఆర్‌డీఎస్ఎస్) పథకంలో గ్రేటర్‌లో అండర్ కేబుల్ వ్యవస్థను విస్తరించే అవకాశాలపై దృష్టి సారించింది.

బెంగళూరులో పరిశీలన

బెంగళూరులో అమలులో ఉన్న అండర్‌గ్రౌండ్ విద్యుత్ సరఫరా వ్యవస్థను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు దక్షిణ డిస్కం సీఎండీ ముషారఫ్ ఫరూఖీ, ఇతర ఉన్నతాధికారులు గత నెలలో పరిశీలించారు. అండర్‌గ్రౌండ్ ప్రాజెక్టుకు బ్యాంకు రుణాలు, సాంకేతిక సమస్యలు, నష్టాలు, లాభాలు, ప్రమాదాల వంటి అంశాలను స్థానిక ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. కొత్తగా నిర్మించ తలపెట్టిన ఫ్యూచర్ సిటీలో అండర్‌గ్రౌండ్ కేబుల్ వ్యవస్థను అందుబాటులోకి

మిగతా 8వ పేజీలో..

గ్రేటర్‌లో విద్యుత్ వ్యవస్థ ఇలా.. (కి.మీలలో)	
33 కేవీ ఓవర్ హెడ్(వేలాడే) లైన్లు	3,725
11 కేవీ ఓవర్ హెడ్ లైన్లు	21,643
11 కేవీ యూజీ (అండర్‌గ్రౌండ్) కేబుల్	957

సంపులో పడి బాలుడి మృతి



అభి (ఫైల్)

మియాపూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నీళ్లను తీసుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు సంపులో పడి ఓ బాలుడు మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్‌కు చెందిన శ్రీను, నీల దంపతులకు కుమార్తె అఖిల, కుమారుడు అభి(4)ఉన్నాడు. బతుకు దెరువు కోసం మియాపూర్‌కు వచ్చి న్యూ హఫీజ్‌పేట్‌లోని మార్తాండనగర్ కాలనీలో ఉంటూ స్థానికంగా పెయింటింగ్ పనులు చేస్తున్నారు. శ్రీను దంపతులు శనివారం కూలి పనుల నిమిత్తం వెళ్లగా అఖిల, అభి ఇంటివద్ద ఉండిపోయారు. మధ్యాహ్న సమయంలో అభి ఇంటి ఆవరణలో ఉన్న సంపులో నుంచి నీటిని తీసుకునేందుకు వెళ్లి అందులో పడిపోయాడు. అక్కడే ఆడుకుంటున్న అఖిల చూసి వెంటనే బాబాయ్‌కి చెప్పగా స్థానికుల సహాయంతో అభిని బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే బాలుడు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ఇటీవల సైబర్ క్రైమ్ పోలీసులు పట్టుకున్న సైబర్ క్రిమినల్స్

2 నెలలు.. 60 మంది..

సైబర్ నేరగాళ్ల ఆటకట్టించిన నగర పోలీసులు

రూ. 15.27కోట్లు రికవరీ.. బాధితులకు రీఫండ్

లోక్ అదాలత్ ద్వారా మరో రూ.3.67 కోట్లు

వివరాలు వెల్లడించిన సైబర్ క్రైమ్ డీసీపీ

హైదరాబాద్ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. రెండు నెలల్లో 140 కేసులను ఛేదించారు. సైబర్ స్పెషల్ ఆపరేషన్ పేరుతో 9 రాష్ట్రాలను గాలించి 60మంది క్రిమినల్స్‌ను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.15.27 కోట్లను రికవరీ చేసి బాధితులకు అందజేశారు. ఈ మేరకు రెండు నెలల సైబర్ క్రైమ్ రౌండప్‌ను డీసీపీ ధార కవిత శనివారం వెల్లడించారు. రోజూ నమోదవుతున్న సైబర్ మోసాల్లో ట్రేడింగ్, ఇన్వెస్టిమెంట్ ఫ్రాడ్‌లు, ఫెడెక్స్ మనీ ల్యాండరింగ్, ఓటీపీ, క్రెడిట్‌కార్డు, కస్టమర్ కేర్, ఏపీకే ఫైల్స్

మిగతా 8వ పేజీలో..



ఆన్‌లైన్ మోసాలపై అవగాహన ఉండాలి

ఆన్‌లైన్‌లో జరుగుతున్న సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి. ఆన్‌లైన్‌లో పొంచి ఉంటున్న సైబర్ క్రిమినల్స్.. మోసపూరిత ప్రకటనలు గుప్పించి, ప్రముఖుల వాయిస్‌తో ఏఐ వాయిస్ వీడియోలు సృష్టించి బోల్తా కొట్టిస్తారు. మోసపూరిత ఏపీకే ఫైల్స్ లింక్‌లను పంపి అడ్డంగా దోచేస్తారు. అనుమానం వచ్చిన వెంటనే 1930కు రిపోర్టు చేయాలి.

\- ధార కవిత, డీసీపీ, సిటీ సైబర్ క్రైమ్ విభాగం



మెరిసే.. మెరిసే

రీ సైకిల్ చేసిన ఫ్యాబ్రిక్ అవశేషాలు, ప్లాస్టిక్ సీసాలు, వార్తాపత్రికలు తదితర వస్తువులతో రూపొందించిన మోడ్రన్ దుస్తులతో ర్యాంప్‌పై క్యాట్‌వాక్ చేస్తూ విద్యార్థులు మెరిశారు. బంజారాహిల్స్‌లోని ఓ కళాశాల విద్యార్థినులు 'ట్రాషిక్ - ది బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్' పేరిట నిర్వహించిన ఫ్యాషన్ షో ఆద్యంతం ఆసక్తిగా సాగింది.

\- బంజారాహిల్స్, జూలై 12(ఆంధ్రజ్యోతి)

ఆసక్తికరం.. జూబ్లీహిల్స్ రాజకీయం

మాగంటి మరణంతో త్వరలో ఉప ఎన్నిక

పోటీచేసేందుకు ప్రధాన పార్టీలు రెడీ

సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకునేందుకు బీఆర్ఎస్..

నగరంలో పాగా వేసేందుకు కాంగ్రెస్

మారుతున్న సమీకరణాలకు అనుగుణంగా బీజేపీ ఎత్తులు

సందిగ్ధంలో ఎంఐఎం




బంజారాహిల్స్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నగరం నడిబొడ్డున ఉన్న జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. వరుసగా మూడుసార్లు గెలిచి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గుర్తింపు పొందిన మాగంటి గోపీనాథ్ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందిన నేపథ్యంలో త్వరలో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో సెగ్మెంట్‌లో పాగా వేసేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటినుంచే సిద్ధమవుతున్నాయి.

అధికార కాంగ్రెస్ ఆరాటం..

జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానాన్ని తమ ఖాతాలో వేసుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. జూబ్లీహిల్స్‌లో

మిగతా 6వ పేజీలో..



నిజాం నగలను నగరానికి తెప్పించండి

సీఎం రేవంత్‌కు నిజాం మునిమనవడి లేఖ



హైదరాబాద్ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నిజాం నగలు తెలంగాణ సంస్కృతి, ఘన చరిత్ర వారసత్వానికి ప్రతీకలని, ఢిల్లీలో ఉన్న జువెలరీని నగరానికి తెచ్చేలా కృషి చేయాలని నిజాం మునిమనవడు హిమాయత్ అలీమీర్జా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. భారత ప్రభుత్వం 1995లో రూ.217 కోట్లు చెల్లించి ముంబై కొలాబాలోని హాంకాంగ్ షాంఘై బ్యాంకు లాకర్‌ల నుంచి నగలను తీసుకున్నారని, ఈ సమయంలో ప్రిన్స్ ముఫ్‌కంజా, నిజాం ట్రస్టు సభ్యులతోపాటు తాను ప్రత్యక్షంగా ఉన్నానని గుర్తు చేశారు. తెలంగాణ ఖ్యాతి, వారసత్వానికి ప్రతీకలుగా ఉన్న నగలను హైదరాబాద్‌కు దూరంగా ఉంచారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకొని

మిగతా 6వ పేజీలో..

రెండు రోజుల్లో 1,749 గుంతల పూడ్చివేత



మాదాపూర్‌లో మరమ్మతులు

హైదరాబాద్ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నేపథ్యంలో నగరంలోని వివిధ ప్రాంతాల్లో రహదారులపై ఏర్పడిన గుంతలను జీహెచ్ఎంసీ సిబ్బంది పూడ్చుతున్నారు. ఇప్పటికే ఎల్‌బీనగర్, చార్మినార్, ఖైరతాబాద్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, సికింద్రాబాద్ జోన్లలో 8,062 గుంతలను గుర్తించారు. శనివారం 1,309 గుంతలున్న ప్రాంతాల్లో పూడ్చివేత పనులు చేపట్టారు. రెండు(శుక్ర,శనివారం)రోజుల్లో మొత్తం 1,749 గుంతలను పూడ్చినట్లు అధికారులు తెలిపారు.



క్రీడల్

- ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో వేధిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుల కొరత
- 22 కళాశాలల్లో ఒకే ఒక్క పీడీ
- ఐదేళ్లుగా ఇదే దుస్థితి

6

కేసును వదిలేయండి

- ఎంతో కొంత సాయం చేస్తామని పోలీసుల ఒత్తిడి
- బాధితులు రాంబాబు, కనకదుర్గ దంపతుల ఆరోపణ
- కుమారుడిపై దాడి చేసిన వారిపై చర్యలకు డిమాండ్



6

సోమాలియా యువకుడికి కత్తిపోట్లు

బైక్ యూటర్న్ తీసుకుంటుండగా గొడవ

అనురాగ్ వర్సిటీలో కూలిన సెంట్రింగ్

- నలుగురు కార్మికులకు గాయాలు



గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కూలీలు

ఘట్‌కేసర్ రూరల్, జూలై12(ఆంధ్రజ్యోతి): స్లాబ్ వేసే క్రమంలో ప్రమాదవశాత్తు సెంట్రింగ్ జాక్ రాడ్డు జారీ పైఅంతస్తు నుంచి కింది అంతస్తులో పడింది. ఈ ప్రమాదంలో నలుగురు కార్మికులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పోచారం ఐటీ కారిడార్ పోలీసుస్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో శనివారం ఉదయం ఓ భవన నిర్మాణం పదో అంతస్తుకు స్లాబ్ వేస్తున్నారు. ప్రమాదవశాత్తు సెంట్రింగ్ జాక్ రాడ్ కదలడంతో పై అంతస్తులో సెంట్రింగ్ పనిచేస్తున్న నలుగురు కార్మికులు తొమ్మిదో అంతస్తులో పడ్డారు. ఈ ప్రమాదంలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రాజుయాదవ్ (34), ఓంప్రకాశ్(28), మహబూబ్‌నగర్‌కు చెందిన రాజు(20), కేశవ్(30)లకు గాయాలయ్యాయి. దీంతో తోటికార్మికులు వారిని హుటాహుటిన స్థానిక ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును తెలుసుకొన్నారు. ఈ ప్రమాదంపై భవన నిర్మాణ సంస్థ కాంట్రాక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వేళకు రావు.. బస్టాపుల్లో ఆగవు

గ్రేటర్‌లో సిటీ బస్సుల తీరిది



ఉదయం, సాయంత్రం రద్దీ రూట్లలో తగ్గిన బస్సులు

హైదరాబాద్ సిటీ, జూలై 12(ఆంధ్రజ్యోతి): నగరంలో సిటీ బస్సులు వేళలను పాటించడం లేదు. రద్దీ రూట్లలో పది నిమిషాలకు ఓ బస్సు నడుపుతున్నామంటూ ఆర్టీసీ చెబుతున్నా, ఒకేరూట్‌లో అరగంటకు కూడా బస్సు రావడం లేదు. వస్తే ఒకేసారి 4, 5 బస్సులు వరుసగా రావడం, లేదంటే 30నుంచి 40 నిమిషాల వరకు ప్రయాణికులు బస్సుల కోసం పడిగాపులు కాయాల్సివస్తోంది. దీంతో ప్రయాణికులు రోడ్లపై నిలబడలేక ప్రైవేట్‌వాహనాలను ఆశ్రయిస్తూ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో వచ్చిన ఒకటి, రెండు బస్సులు బస్టాపులకు దూరంగా నిలుపుతూ ప్రయాణికులు వచ్చేలోపు ముందుకు కదులుతుండటంతో ఎక్కలేకపోతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహాలక్ష్మి ఉచిత ప్రయాణాలతో బస్సుల్లో ప్రయాణికుల రద్దీ భారీగా పెరిగింది. ఉదయం బస్సుల్లో కాలుపెట్టేందుకు కూడా స్థలం లేకపోవడంతో మహిళలు సైతం ఫుట్‌బోర్డు ప్రయాణాలు చేస్తున్నారు. గ్రేటర్ జోన్ వ్యాప్తంగా 3,045 బస్సుల్లో రోజూ 24లక్షల మంది ప్రయాణాలు సాగిస్తుండగా వారిలో 16లక్షల మంది మహిళా ప్రయాణికులే ఉంటున్నారు. ఈసీఐఎల్, సంజీవరెడ్డినగర్, అమీర్‌పేట, ఎర్రగడ్డ, కూకట్‌పల్లి, జేఎన్‌టీయూ,

మిగతా 6వ పేజీలో..



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వర్‌రావు

నిరవధిక సమ్మె తాత్కాలికంగా వాయిదా

● తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ నేతలు

హైదరాబాద్ సిటీ, జూలై 12(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఆర్టిజన్లు జూలై 14 సోమవారం నుంచి తలపెట్టిన నిరవధిక సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ చైర్మన్ ఈశ్వర్‌రావు, కన్వీనర్ ఎం.ఏ.వజీర్, కోచైర్మన్లు గాంబో నాగరాజు ప్రకటించారు. ఖైరతాబాద్ మింట్ కాపౌండ్‌లోని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రధాన కార్యాలయం వద్ద జేఏసీ ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు మాట్లాడుతూ ఆర్టిజన్ల సమస్య పరిష్కారానికి కార్మికశాఖ రెండు వారాల సమయం అడిగిందని, వారి సూచన మేరకు సోమవారం నుంచి జరగబోయే సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తెలిపారు. కార్మికులకు న్యాయం చేయకుంటే నిరవధిక సమ్మెకు వెళ్లక తప్పదని జేఏసీ నేతలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ స్టేట్ కోచైర్మన్ వి.నరేందర్, పి.కోటి గౌడ్, లింగం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలి

● విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి



సమావేశంలో మాట్లాడుతున్న ఆకునూరి మురళి

హైదరాబాద్ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాటు రాష్ట్ర బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయిస్తేనే పాఠశాల విద్యారంగం బాగుపడుతుందని తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. తెలంగాణ టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం నాంపల్లిలోని తెలంగాణ ఫోర్త్‌క్లాస్ ఎంప్లాయీస్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పదేళ్లుగా తెలంగాణలో విద్యారంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, దీనిని బాగు చేసేందుకు ఉద్యమం జరగాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ సంకల్పంతోనే విద్యావ్యవస్థ బాగుపడుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ స్పోక్స్‌పర్సన్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టిపెట్టి విద్యాశాఖలో ఖాళీలు భర్తీ చేయడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించారని అన్నారు. పాఠశాల విద్యారంగాన్ని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు, ప్రపంచస్థాయి పౌరులను తయారు చేసేందుకు త్వరతలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ వ్యవస్థను తీసుకువస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీటీయూ ప్రధాన కార్యదర్శి పోలంపల్లి ఆదర్శన్‌రెడ్డి, ముఖ్య సలహాదారు డాక్టర్ ఏరుకొండ నరసింహస్వామి, అసోసియేషన్ అధ్యక్షులు రమేష్, మోహన్‌తో పాటు తెలంగాణ జిల్లాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తికరం.. జూబ్లీహిల్స్ రాజకీయం

(5వ పేజీ తరువాయి)

గెలుపొంది నగరంపై పట్టు సాధించేందుకు పావులు కదుపుతోంది. ఇందులో భాగంగా ఇటీవల నియోజకవర్గంలో రూ.5 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముగ్గురు మంత్రులు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, నగర మేయర్, ముఖ్యనాయకులు తరలిరావడం కాంగ్రెస్‌లో జోష్‌ను నింపింది. అయితే, ఈ స్థానం నుంచి పోటీ చేసే ఆశావాహుల సంఖ్య భారీగా ఉండడంతో అభ్యర్థి ఎంపిక పార్టీ అధిష్ఠానానికి తలనొప్పిగానే మారిందని చెప్పవచ్చు. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన మాజీ క్రికెటర్ అజారుద్దీన్ మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు ప్రాధాన్యమిస్తున్న తరుణంలో ఆ వర్గం నుంచి నవీన్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ మురళీగౌడ్ టికెట్ కోసం ఇప్పటికే అధిష్ఠానానికి దరఖాస్తు పెట్టుకున్నారు. వీరితో పాటు సీఎం రేవంత్‌రెడ్డికి దగ్గరగా ఉండే ఫయ్యాం ఖాన్ సైతం టికెట్‌ను ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. నియోజవర్గంలో సెటిలర్లు ఎక్కువగా ఉండడంతో కొత్త వారికి అవకాశమిస్తే ఎలా ఉంటుందన్న దానిపై సర్వే చేపడుతున్నారు.

సిట్టింగ్ సీటును కాపాడుకునేందుకు..

2014, 2018, 2023లో వరుస విజయాలు సాధించిన మాగంటి గోపీనాథ్ బీఆర్‌ఎస్‌కు తిరుగులేని బలాన్ని సమకూర్చారు. ప్రస్తుతం ఆయన లేని లోటును భర్తీ చేసి జూబ్లీహిల్స్‌పై తమ పట్టు తగ్గలేదని నిరూపించుకునేందుకు బీఆర్‌ఎస్ అధిష్ఠానం ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఈ మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీ్‌షరావు స్వయంగా సెగ్మెంట్‌లోని పరిస్థితులపై దృష్టి సారించి అందుకు అనుగుణంగా వ్యూహాలు రచిస్తున్నారు. కాగా, మాగంటి మరణంతో ఆయన స్థానంలో పోటీ చేసేందుకు సిద్ధమని ఆయన సతీమణి అనిత ఇప్పటికే అధిష్ఠానానికి స్పష్టం చేశారు. మరోవైపు ఆయన సోదరుడు మాగంటి వజ్రనాథ్ కూడా టికెట్ రేసులో తాను ఉన్నానంటూ ఇటీవల ప్రకటించారు. వీరితో పాటు పార్టీ సీనియర్ నాయకుడు రావుల శ్రీధర్‌రెడ్డితో పాటు మరికొందరు ఆశావాహులు జాబితాలో ఉన్నారు. అయితే, మాగంటి పనితీరు, ఆయన మరణం అనంతరం ఏర్పడిన సానుభూతి విజయతీరాలకు చేరుస్తుందా.. లేదా.. అనే దానిపై పార్టీ నాయకులు విశ్లేషిస్తున్నారు.

కదనరంగంలోకి కమలనాథులు

జూబ్లీహిల్స్‌లో మైనారిటీలు సుమారు 35శాతం ఉన్నారు. ఈ నేపథ్యంలో మిగతా ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు బీజేపీ అధిష్ఠానం ఇప్పటికే రంగంలోకి దిగింది. ఇటీవల గురుపౌర్ణమి సందర్భంగా గురువులను సన్మానించేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు రావడంతో పాటు సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి పలు డివిజన్లలో పర్యటిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. గత పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో గణనీయంగా ఓట్లు పోలైన నేపథ్యంలో.. తాజాగా ఇక్కడ పట్టు సాధించాలనే ఆశ పార్టీ నాయకుల్లో మొదలైంది. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన లంకల దీపక్‌రెడ్డి తాజాగా మరోసారి టికెట్ ఆశిస్తున్నారు. అయితే కొత్తవారికి అవకాశం ఇస్తే ఎలా ఉంటుందనే దానిపై కూడా పార్టీ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో వైద్యురాలు వీరపనేని పద్మ, పారిశ్రామికవేత్త జూటూరి కీర్తిరెడ్డి పేర్లు మరోసారి తెరమీదకి వచ్చాయి. హైదరాబాద్ పార్లమెంట్ స్థానానికి బీజేపీ తరఫున పోటీ చేసిన మాధవీలతను ఇక్కడి నుంచి బరిలో దించితే ఎలా ఉంటుందనే ప్రస్తావన కూడా పార్టీలో చర్చిస్తున్నారు.

పోటీ చేద్దామా... వద్దా!

మైనారిటీ ఓట్లతో పాతబస్తీలో తిరుగులేని ఆధిపత్యం సాధిస్తున్న ఎంఐఎం మిగతా నియోజకవర్గాల్లో కూడా పట్టు సాధించేందుకు ఎప్పటి నుంచో వేచిచూస్తోంది. మైనారిటీలు అధికంగా ఉన్న జూబ్లీహిల్స్‌లో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు 2023 ఎన్నికల్లో షేక్‌పేట కార్పొరేటర్‌ని బరిలోకి దించారు. అయితే, కాంగ్రెస్ తరఫున మైనారిటీ అభ్యర్థి అజారుద్దీన్ బరిలో ఉండడంతో ఆ పార్టీకి ఆశించిన ఫలితం రాలేదు. ప్రస్తుత ఉపఎన్నిక నేపథ్యంలో ఇక్కడ పోటీ చేయాలా.. వద్దా లేకుంటే మరో పార్టీకి మద్దతు ఇవ్వాలా అనే అంశంపై సీనియర్లు ఆలోచనల్లో మునిగినట్లు తెలుస్తోంది.

3న టీటీసీ థియరీ పరీక్షలు

హైదరాబాద్ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ (టీటీసీ) లోయర్ గ్రేడ్ థియరీ పరీక్షలు ఆగస్టు 3న నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి రోహిణి తెలిపారు. ఈ ఏడాది మే, జూన్‌లో 42 రోజుల పాటు టీటీసీ సమ్మర్ ట్రైనింగ్ కోర్సు పూర్తి చేసిన వారితో పాటు గతంలో జరిగిన పరీక్షల్లో ఫెయిలైన అభ్యర్థులకు కూడా థియరీ ఎగ్జామ్ ఉంటుందని చెప్పారు. ఎడ్యుకేషనల్ సైకాలజీ, స్కూల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం పరీక్షను ఆగస్టు 3న ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు, మెథడ్స్ ఆఫ్ టీచింగ్ (జనరల్) బోధన పద్ధతుల పరీక్షను మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు, మెథడ్స్ ఆఫ్ టీచింగ్ (స్పెషల్) బోధన పద్ధతులను మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎంబీఏ ప్రవేశపరీక్ష దరఖాస్తుకు చివరి తేదీ 15

● అంబేడ్కర్ వర్సిటీ విద్యార్థి సేవా విభాగం డైరెక్టర్ వెంకటేశ్వర్లు

హైదరాబాద్ సిటీ, జూలై 12(ఆంధ్రజ్యోతి): డా.బి.ఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఎంబీఏ, హాస్పిటల్ అండ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు జూలై 15 చివరి తేదీ అని ఓపెన్ యూనివర్సిటీ విద్యార్థి సేవా విభాగం డైరెక్టర్ డా.వై.వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డా.బి.ఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో ఎంబీఏ, హాస్పిటల్ అండ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్‌లో చేరాలంటే ఐసెట్‌లో గాని, ఓపెన్ యూనివర్సిటీ నిర్వహించే ప్రవేశ పరీక్షలో గాని తప్పని సరిగా అర్హత సాధించాలన్నారు. డా.బిఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ దరఖాస్తు చేయాలంటే డిగ్రీలో 50 శాతం మార్కులు సాధించి ఉండాలని, ఎస్సీ, ఎస్టీలకు 45 శాతం మార్కులు తప్పనిసరి అని పేర్కొన్నారు. ఈ పరీక్షలో అర్హత సాధించిన వారు అపోలో ఆస్పత్రి, కిమ్స్, డెక్కన్ మెడికల్ కాలేజీలోని హాస్పిటల్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ పొందవచ్చన్నారు. యూనివర్సిటీలోని జనరల్ ఎంబీఏలో చేరాలన్నా ఈ ప్రవేశ పరీక్ష రాయలన్నారు. మరిన్ని వివరాల కోసం www.braouonline.in సంప్రదించ వచ్చని పేర్కొన్నారు.

15న నిమ్స్‌మేలో రుణమేళా

హైదరాబాద్ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న పరిశ్రమలను ప్రారంభించాలనే ఔత్సాహికుల కోసం యూసూఫ్‌గూడలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నిమ్స్‌మేలో ఈ నెల 15న రుణమేళా ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు సాగే ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ నివేదిక తయారీ, రుణ మంజూరుకు అవసరమైన పత్రాల గురించి వివరిస్తారు. ఈ మేళాలో ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల ప్రతినిధులు పాల్గొంటారని ఆసక్తి ఉన్నవారు ఉచిత రిజిస్ట్రేషన్ కోసం ఫోన్ నం.040- 23633244/218/261లను సంప్రదించాలని పేర్కొన్నారు.



జలీల్‌కు నియామక పత్రం అందజేస్తున్న రాంచంద్రయ్య, చిదంబరరెడ్డి

ఆలిండియా పంచాయతీ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడిగా జలీల్

బర్కత్‌పుర, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా పంచాయతీ పరిషత్ తెలంగాణ రాష్ట్ర విభాగం అధ్యక్షుడిగా ఎం.ఎ.జలీల్ నియమితులయ్యారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ సంఘం జాతీయ కార్యదర్శి జెన్ను రాంచంద్రయ్య, ఏపీ పంచాయతీ పరిషత్ అధ్యక్షుడు ఎం.చిదంబరరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై ఎం.ఎ.జలీల్‌కు నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం దక్షిణాది రాష్ట్రాల సమన్వయ కర్త విజయవర్మ, బాలీవుడ్ నటి పూజా గంగూలీ, తదితరులు, పాల్గొన్నారు.

దక్షిణ భారత ఖో-ఖో అధ్యక్షుడిగా రాఘవరెడ్డి



రాఘవరెడ్డి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): దక్షిణ భారత ఖో-ఖో సంఘం అధ్యక్షుడిగా జంగా రాఘవరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఢిల్లీలో జరిగిన జాతీయ ఖో-ఖో సంఘం సర్వ సభ్య సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. సౌత్ జోన్ బాధ్యతలతో పాటు జాతీయ ఖో-ఖో సంఘం ఎథిక్స్ కమిషన్ కన్వీనర్‌గా కూడా రాఘవరెడ్డి నియమితులయ్యారు. రాఘవరెడ్డి ప్రస్తుతం రాష్ట్ర ఖో-ఖో సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ఖో-ఖో సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తిని జాతీయ కార్యవర్గంలో చోటు కల్పించారు.

ఆర్‌సీఐలో చిరుతపులి ఆనవాళ్లు లేవు: అధికారులు

పహాడిషరీఫ్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బాలాపూర్‌లోని రీసెర్చ్ సెంటర్ ఇమారత్(ఆర్‌సీఐ)లో చిరుత పులులు సంచరిస్తున్నాయన్న వదంతులు వ్యాపించడంతో అటవీ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. శనివారం ఆర్‌సీఐ పరిధిలోని అటవీ భూముల్లో పులుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కాగా, ఆర్‌సీఐలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న 60 ఏళ్ల వ్యక్తి మూడు రోజుల క్రితం 300 మీటర్ల దూరంలో చిరుత కనిపించిందని అధికారులకు తెలపడం, ఆ మరుసటి రోజు ఓ కుక్క అదే ఆవరణలో మృతిచెందడంతో అధికారులు చిరుతలు తిరుగుతుండొచ్చని భావించారు. ఈ నేపథ్యంలోనే అటవీశాఖ అధికారులు, బాలాపూర్ పోలీసులు కలిసి ఆర్‌సీఐ పరిసరాలలో చిరుతల ఆనవాళ్ల కోసం అన్వేషించారు. కానీ, ఎలాంటి ఆనవాళ్లు లభించలేదని బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తెలిపారు.

వేళకు రావు.. బస్టాపుల్లో ఆగవు

(5వ పేజీ తరువాయి)

దిల్‌సుఖ్‌నగర్, ఎల్‌బీనగర్, ఉప్పల్ క్రాస్‌రోడ్, యూసుఫ్‌గూడతో పాటు పలు ప్రాంతాల్లో ఉదయం సిటీ బస్సులు రద్దీకి అనుగుణంగా నడపకపోవడంతో ప్రయాణికులు రోజూ ఇబ్బందులు పడుతున్నారు. అలాగే, బస్టాపుల్లో ప్రైవేట్ ఆటోలు, ఇతర వాహనాలు తిష్టవేయడం వల్ల బస్సులను రోడ్డుపై ఆపుతున్నారు. ప్రయాణికులు రోడ్డు మీదే దిగాల్సి వస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

ట్రాఫిక్ వలయంలో..

నగరంలో ఏ రోడ్డు చూసినా కనీసం ఐదు కిలోమీటర్లు దూరం సమాన వెడల్పుతో లేకపోవడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సులు ట్రాఫిక్ వలయంలో చిక్కుకునే పరిస్థితులు నెలకొంటున్నాయని డ్రైవర్లు చెబుతున్నారు. దీంతో ట్రిప్పులు సైతం తగ్గిపోతున్నాయి. నగరంలో పలు ప్రాంతాల నుంచి ఉదయం హైటెక్‌సిటీ, మాదాపూర్, అమీర్‌పేట, ఖైరతాబాద్, బేగంపేట, సికింద్రాబాద్, కోఠి, సోమాజిగూడ తదితర ప్రాంతాల్లోని ఆఫీసులకు వెళ్లేందుకు పెద్ద సంఖ్యలో ఉద్యోగులు వస్తుంటారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు అందుబాటులో లేకపోవడంతో మహిళలు కూడా ఫుట్‌బోర్డు ప్రయాణాలు చేస్తున్నారు. ఇవి ప్రమాదకరంగా మారుతుండడంతో మరికొంతమంది షేర్ ఆటోలను ఆశ్రయిస్తూ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు.

నిజాం నగలను నగరానికి తెప్పించండి

(5వ పేజీ తరువాయి)

నగరంలోనే స్టేట్ ఆఫ్ సెక్యూరిటీ సిస్టంతో పటిష్ఠ మ్యూజియంను నిర్మిస్తే నిజాం నగలు తిరిగి నగరానికి చేరే అవకాశముందన్నారు. తక్షణం కేంద్రంతో సీఎం సంప్రదింపులు జరపాలని విజ్ఞప్తి చేశారు. సీఎం అనుమతిస్తే మ్యూజియం ఏర్పాటుకు అనువైన స్థలాలు, మ్యూజియం నిర్మాణ ప్లాన్ వంటి సమగ్ర వివరాలను అందిస్తామన్నారు. నగరంలో పలు ప్రాంతాల్లో ఉన్న నిజాం ట్రస్ట్ భూములు కబ్జాకు గురవుతున్నాయని, వాటిని కాపాడేందుకు టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేయాలని ఆయన సీఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగివుండాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న వక్తలు

చాంద్రాయణగుట్ట, జూలై 12(ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సిటీ సివిల్‌కోర్టు సీనియర్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి జస్టిస్ కిరణ్మయి అన్నారు. అరోరా లీగల్ సైన్సెస్ అథారిటీ ఆధ్వర్యంలో జంగమ్మెట్‌లోని బేడ బుడగ జంగాల కమ్యూనిటీ హాల్‌లో లా విద్యార్థులు, స్థానికులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ కిరణ్మయి మాట్లాడుతూ, సమాజంలో జరుగుతున్న నేరాలు, వాటికివర్తించే శిక్షల గురించి అవగాహన కలిగివుండాలన్నారు. కోర్టులలో కేసులు దాఖలు చేయకముందే లీగల్ సర్వీస్ అథారిటీ న్యాయం చేస్తుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో అరోరా అకాడమీ ప్రిన్సిపాల్ డాలీ గౌతమ్, ఫలక్‌నుమా పోలీస్ స్టేషన్ అడిషనల్ ఇన్‌స్పెక్టర్ జాకిర్ హుసైన్, జాతీయ మానవ హక్కులు, మహిళా శిశు అభివృద్ధి సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రతాప్ శాలిని, చైతన్య యువజన సంఘం ప్రధాన కార్యదర్శి డి.సుశీల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు విజ్ఞానాన్ని దేశాభివృద్ధికి అంకితం చేయాలి



విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేస్తున్న ప్రొఫెసర్ ఎల్.ఎస్.గణేష్ తదితరులు

బర్కత్‌పుర, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువులు చదివిన విద్యార్థులు నేర్చుకున్న విజ్ఞానాన్ని దేశాభివృద్ధికి అంకితం చేయాలని ఐసీఎఫ్ఏఐ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎల్.ఎస్.గణేష్ పిలుపునిచ్చారు. పట్టుదలతో చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించి కనిపెంచిన తల్లిదండ్రులకు, చదివిన కళాశాలకు, బోధించిన అధ్యాపకులకు మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని సూచించారు. శనివారం విజ్ఞానభారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీబీఐటీ) 18వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు కాచిగూడలో నిర్వహించారు. ఈ సందర్భంగా టాపర్లకు బంగారు పతకాలు, 1055మంది బీటెక్, ఎంటెక్, ఎంబీఏ పూర్తి చేసిన విద్యార్థులకు ఆయన పట్టాలు అందజేసి మాట్లాడారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, దేశభక్తి, విలువలను పెంపొందించుకోవాలని కోరారు. టెక్ మహేంద్ర సంస్థ ఉపాధ్యక్షుడు నాగార్జున్ మల్లాది మాట్లాడుతూ, పోటీతత్వంతో ముందుకు సాగినప్పుడే విద్యార్థులు ఏ రంగంలోనైనా రాణించగలుగుతారని అన్నారు. కార్యక్రమంలో వీబీఐటీ చైర్మన్ డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, కార్యదర్శి డాక్టర్ జి.మనోహర్ రెడ్డి, ప్రిన్సిపాల్ పి.వి.ఎస్.శ్రీనివాస్, పాలకమండలి సభ్యులు డాక్టర్ జయంత్ కులకర్ణి, డాక్టర్ బాబు ప్రసాద్‌వర్మ, డైరెక్టర్ వై.వి.ఎస్.ఎస్.వి.ప్రసాదరావు, రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న నారగోని

బర్కత్‌పుర, జూలై 12(ఆంధ్రజ్యోతి): బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన 42 శాతం రిజర్వేషన్లను మూడు గ్రూపులుగా విభజించి అమలు చేయాలని నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ చైర్మన్ వి.జి.ఆర్.నారగోని, పొలిటిషన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశారు. బీసీలలోని సంచార జాతులను ఒక గ్రూపుగా, ఎంబీసీ కులాలను మరోక గ్రూపుగా అభివృద్ధి చెందిన కులాలను వర్గీకరణ చేసి 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తే కిందిస్థాయి కులాలకు న్యాయం జరుగుతోందన్నారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా పొలిటికల్ జస్టిస్ అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని రాజకీయ పార్టీలు పొలిటికల్ జస్టిస్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ జారీ చేస్తామని మంత్రివర్గం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నామని, ఈసందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్, కె.బి.శ్రీధర్, కె.శంకర్, బాలయ్య, ఆంజనేయులు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గురుకులాల్లో సీట్ల సంఖ్య పెంచాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాథోడ్ రవీందర్ నాయక్

బర్కత్‌పుర, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గిరిజన గురుకుల విద్యా సంస్థల్లో సీట్ల సంఖ్యను పెంచాలని ఆలిండియా ట్రైబల్ జేఏసీ చైర్మన్ రాథోడ్ రవీందర్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల సీట్ల సంఖ్యకు మించి దరఖాస్తులు చేసుకోవడంవల్ల మెరిట్ కలిగిన విద్యార్థులకు సీట్లు రానీ పరిస్థితి ఏర్పడిందన్నారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే స్పందించి గిరిజన గురుకుల పాఠశాలలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లలో సీట్ల సంఖ్యను పెంచి దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి అడ్మిషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు దారవత్ సురేష్‌నాయక్, కో-ఆర్డినేటర్ గోపి నాయక్, ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, సభ్యులు శ్రీనివాసులు, భాస్కర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి

- ఏజెన్సీ వ్యవస్థ రద్దు చేయాలి
- సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి
- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల మహాధర్నాలో ఎంపీలు ఆర్.కృష్ణయ్య, ఈటల


ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల మహాధర్నాలో అభివాదం చేస్తున్న ఎంపీలు ఆర్ కృష్ణయ్య, ఈటల రాజేందర్ తదితరులు

కవాడిగూడ, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి.. దాని స్థానంలో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని పలువురు రాజకీయ పార్టీ నేతలు, వివిధ సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద చేపట్టిన మహాధర్నాకు ఎంపీలు ఆర్.కృష్ణయ్య, ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, పైడి రాకేష్‌రెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు తదితరులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై పార్లమెంట్ వేదికగా తన గొంతు వినిపిస్తానన్నారు. ఈటల మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేయకపోతే ప్రభుత్వాలు స్తంభించిపోయే పరిస్థితులు ఉన్నాయని హెచ్చరించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మంత్రివర్గ ఉపసంఘం వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల్లో మార్పు రావాలన్నారు. రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ స్థానికసంస్థల ఎన్నికలలోపే ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని చెప్పారు.

అధ్వాన రోడ్లు..

- గగన్‌పహాడ్‌లో నేడు బోనాలు
- నడవడానికి కూడా ఇబ్బందిగా మారిన రోడ్లు
- పట్టించుకోని అధికారులు


మధుబన్ కాలనీలో అధ్వానంగా మారిన రోడ్డు




గగన్‌పహడ్‌లో అధ్వానంగా రోడ్లు

రాజేంద్రనగర్, జూలై 12(ఆంధ్రజ్యోతి): మైలార్‌దేవుపల్లి డివిజన్ పరిధిలోని గగన్‌పహడ్, ఉడంగడ్డ, లక్ష్మీగూడ, దుర్గానగర్, వాంబే కాలనీల్లో ఆదివారం బోనాల ఉత్సవాలు ఉన్నాయి. ఈ బస్తీల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. రోడ్డు పనులు ప్రారంభించినా అవి నేటికీ పూర్తి కాలేదు. ఆదివారం బోనాల ఉత్సవాలు ఉండగా నేటికీ పనులు పూర్తికాకపోవడం పట్ల స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం నడవడానికి వీలు లేకుండా రోడ్లపై బోనం ఎత్తుకొని మహిళలు ఎలా నడవాలని ప్రశ్నించారు. నెలల తరబడి రోడ్లు అధ్వానంగా ఉన్నా పట్టించుకోరా అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఒక సారి గగన్‌పహడ్‌లో పర్యటించి రోడ్లను బాగు చేయించాలన్నారు.

నిద్రావస్థలో అధికారులు

మైలార్‌దేవుపల్లి డివిజన్ పరిధిలోని గగన్‌పహడ్‌లో రోడ్లు అధ్వానంగా మారాయి. ఆదివారం బోనాలు ఉండడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మధుబన్‌కాలనీ రోడ్లు కూడా అధ్వానంగా ఉన్నాయి. ఆర్టీసీ బస్సులు ఆపివేస్తామని డిపో అధికారులు చెబుతున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు నిద్రావస్థలో ఉన్నారానిపిస్తోంది. ఇప్పటికైనా పరిస్థితులను గమనించి రోడ్లకు మరమ్మతులైనా చేట్టాలి.

- సూరెడ్డి వినయ్‌రెడ్డి, బీజేపీ మైలార్‌దేవుపల్లి డివిజన్ అధ్యక్షుడు

79 దేవాలయాలకు రూ. 27లక్షలు


డాక్టర్ చిన్నారెడ్డితో కలిసి ఆలయాలకు రూ. 27లక్షల చెక్కును పంపిణీ చేసిన ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

రాజేంద్రనగర్, జూలై 12(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్‌లో ఉన్న అమ్మవారి ఆలయాలకు బోనాల ఉత్సవాలకు రూ.27లక్షలను పంపిణీ చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని చెక్కులను తీసుకున్నారు. చెక్కుల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి.చిన్నారెడ్డి, ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్, అత్తాపూర్ కార్పొరేటర్ మోండ్ర సంగీత గౌరీశంకర్, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి, ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ రమాదేవి, రామశర్మలతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి.చిన్నారెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ, బోనాల ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అన్ని పండుగలకు సమాన ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. బోనాల సందర్భంగా బస్తీలు, కాలనీల్లో ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని 79 ఆలయాలకు చెక్కులను పంపిణీ చేశామన్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఉజ్జయినీ మహాకాళికి అమ్మవారికి పట్టు వస్త్రాలు


అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించేందుకు వెళ్తున్న జగదాంబిక వృత్తిపనివారి సంఘం సభ్యులు

నార్సింగ్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి గోల్కొండ జగదాంబిక మహంకాళి దేవాలయం వృత్తిపనివారి సంఘం ఆధ్వర్యంలో శనివారం పట్టు వస్త్రాలు, ఒడిబియ్యం, పసుపు, కుంకుమ సమర్పించారు. ఈసందర్భంగా సంఘం సలహాదారులు ఆర్.నర్సింగ్‌రావు, బి.సాయిబాబా చారి మాట్లాడుతూ, బోనాల ఉత్సవాలు సందర్భంగా ప్రతీ ఏటా ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి పట్టు వస్త్రాలను అందజేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో వృత్తిపనివారి సంఘం అధ్యక్షులు తుంగడపల్లి శివశంకర్, సుధీర్, డప్పురవి, శ్రవణ్, కొమ్ము శ్రీను, విజయ్, లీలావతి, నవీన్, నరేందర్, కరుణ, శివరాజ్, ధనరాజ్ పాల్గొన్నారు.

నేడు పాతబస్తీలో ఘటోత్సవం


ఊరేగింపు మార్గాన్ని పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్, ఇతర పోలీస్ సిబ్బంది

చాంద్రాయణగుట్ట, జూలై 12(ఆంధ్రజ్యోతి): పాతనగర ఆషాడమాస బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం శాలిబండ కాశీ విశ్వనాథ దేవాలయం నుంచి అమ్మవారి ఘటాలు ఊరేగింపుగా ఆలయాలకు చేరుకుంటాయి. ఈమేరకు శనివారం ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర ప్రసాద్ వర్మ ఎస్‌ఐలతో కలిసి ఊరేగింపు జరిగే మార్గంలో పర్యటించారు. 22 దేవాలయాలకు చెందిన అమ్మవారి ఘటాలు ఊరేగింపులో పాల్గొననున్నాయి. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా డీసీపీ స్నేహా మెహ్రా, ఛత్రినాక ఏసీపీ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఇన్‌స్పెక్టర్ గోపాల్ రావు, ఎస్‌ఐలు త్రిమూర్తులు, ప్రేమ్‌కుమార్, సీతయ్య, స్వప్న, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

బోనాలకు ఆలయాల ముస్తాబు

పహాడిషరీఫ్, జూలై 12(ఆంధ్రజ్యోతి): జల్‌పల్లి మున్సిపాలిటీపరిధిలోని శ్రీరాం కాలనీలో ఆదివారం ఆషాఢ మాసం బోనాలను పురస్కరించుకొని నిర్వాహకులు ఆలయాలను ముస్తాబు చేశారు. ప్రధానమైనదేవాలయాలో పోచమ్మ దేవాలయంతో పాటు దుర్గమాత ఆలయం, కార్గో రోడ్డు సమీపంలోని ముత్యాలమ్మ ఆలయాలకు రంగులద్ది విద్యుద్దీపాలు అలంకరించారు. భారీగా తరలివచ్చే భక్తులకు అసౌకర్యాలు కలగకుండా మున్సిపాలిటీ తరపున ఆలయ పరిసరాలను శుభ్ర పరిచారు. ఆదివారం ఉదయం గ్రామ దేవతలకు బోనాల సమర్పణ, సోమవారం రోజున తొట్టెల ఊరేగింపు కొనసాగనుంది. ఈ బోనాల ఉత్సవాలలో ఆయా రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు కూడా హాజరుకానున్నారు. బోనాల సందర్భంగా పహాడీషరీఫ్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

నేడు నల్లపోచమ్మకు తొలిబోనం

చాంద్రాయణగుట్ట, జూలై 12(ఆంధ్రజ్యోతి): జంగమ్మెట్‌లోని నల్లపోచమ్మ దేవాలయంలో ఈనెల 13న అమ్మవారికి తొలిబోనం సమర్పించనున్నట్టు నిర్వాహకులు, టీపీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి పర్వతాల రాజేందర్ తెలిపారు. అమ్మవారికి తొలిబోనం సమర్పించడం ఆనవాయితీగా వస్తోందన్నారు.


పాతబస్తీ గౌలిపురా సీబీటీ క్వార్టర్స్‌లోని నల్లపోచమ్మ ఆలయ బోనాల పండుగ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావుకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆదర్ల మహేశ్, ప్రతినిధులు దేవేందర్, రాజేశ్, మధు తదితరులు
- చాంద్రాయణగుట్ట, జూలై 12(ఆంధ్రజ్యోతి)

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారులకు అవగాహన

అఫ్జల్‌గంజ్, జూలై 12(ఆంధ్రజ్యోతి): గన్‌ఫౌండ్రీ డివిజన్ ఇసామియా బజార్ ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారులకు గోషామహల్ నియోజకవర్గం డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఫోరం కన్వీనర్ బద్దం సతీష్‌గౌడ్, ఓబీసీ సెల్ కోఆర్డినేటర్ ఎం.నిర్మల్‌కుమార్ యాదవ్ లబ్ధిదారులనుద్దేశించి మాట్లాడుతూ, ప్రభుత్వం మూడు పద్ధతుల్లో ఈ స్కీమ్‌ను అమలు చేస్తోందని, స్థలం ఉండి ఇల్లు కట్టుకోలేనివారికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం, స్థలం లేనివారికి ఇల్లు కట్టివ్వడం జరుగుతోందని, అర్హతను బట్టి ఇల్లు మంజూరు అవుతుందన్నారు. ఫోరం తరఫున మంత్రిని కలిసి నిరుపేదల జాబితాను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇఫ్తెఖార్, అఫుద్దీన్, గౌస్‌భాయ్, కవలుద్దీన్, నరేందర్, అశోక్, నవీన్ గౌడ్, హారిక, సురేశ్, స్వప్న, స్రవంతి, శిష తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైకు సన్మానం

పహాడిషరీఫ్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పోలీసులు క్రమశిక్షణతో విధులు నిర్వహించి మంచి పేరు తెచ్చుకోవాలని బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ అన్నారు. బాలాపూర్ పోలీసుస్టేషన్‌లో మూడు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందిన యూసుఫ్ జానీ పేరు తెచ్చుకోవాలన్నారు. అనంతరం యూసుఫ్ జానీని సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు ఎండీ సోహైల్, ఎం.నవీన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

- అమరుడు శ్రీకాంతచారి తల్లి శంకరమ్మ

రాంనగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని అమరుడు శ్రీకాంతచారి తల్లి శంకరమ్మ డిమాండ్ చేశారు. గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఉద్యమకారుల జేఏసీ చైర్మన్‌గా సుల్తాన్ యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా సోమన్న, క్రిష్టోఫర్, ఉపాధ్యక్షులుగా రషీద్, స్వరూప, యాదయ్య, కార్యదర్శులుగా మోత్కురి మల్లేష్, అంబాల రామారావు, కళాకారుల విభాగం అధ్యక్షుడిగా డోలక్ యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా ఫక్రుద్దీన్, జర్నలిస్టు విభాగం అధ్యక్షుడిగా రాజు, ఆర్టీసీ విభాగం నాయకులుగా జానకి, విద్యార్థి విభాగం నాయకులు శిరీషతోపాటు 50 మంది కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. శంకరమ్మ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జేఏసీ చైర్మన్ సుల్తాన్‌యాదగిరి అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఉద్యమకారుల డిమాండ్ల కోసం పోరాటం చేయడం సంతోషకరమన్నారు. రాష్ట్ర ఉద్యమకారుల జేఏసీ నూతన చైర్మన్ సుల్తాన్ యాదగిరి మాట్లాడుతూ, ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యమకారులకు 250 గజాల స్థలంలో ఇల్లు నిర్మించి ఇవ్వాలని, పెన్షన్ ఇవ్వాలన్నారు. నూతన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు'

రాజేంద్రనగర్, జూలై 12(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడం పట్ల రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. మైలార్‌దేవుపల్లిలోని తన నివాసంలో బీసీ నేతలతో కలిసి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సహకరించిన పీసీసీ అధ్యక్షులు బి.మహేశ్ కుమార్‌గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం పెద్దపీట వేస్తోందన్నారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజవర్గం బీసీ నేతలు టి.ప్రేంగౌడ్, సరికొండ వెంకటేశ్, అడికె అర్జున్, బాస శ్రీనివాస్‌తో పాటు నాయకులు ఎన్.దనుంజయ్, గట్టయ్యతో కలిసి కేక్ కట్ చేశారు.

రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం

గోషామహల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ క్యాబినెట్ ఆమోదం పొంది ఆర్డినెన్స్ జారీ చేసిన సందర్భంగా శనివారం ఉస్మాన్‌గంజ్‌లోని శివాజీ బ్రిడ్జి వద్ద ఏఐసీసీ ఓబీసీ కోఆర్డినేటర్ ఎం.నిర్మల్‌కుమార్ యాదవ్, బద్దం సతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏఐసీసీ నాయకుడు రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్యామ్‌సింగ్, సంజయ్ యాదవ్, బద్రీనాథ్, కిషన్, సుభాష్, శ్రీధర్, సతీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులు కెరీర్‌పై దృష్టి పెట్టాలి'

చాంద్రాయణగుట్ట, జూలై 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ విలువైన కాలాన్ని వృథా చేసుకోకుండా ఉన్నత విద్యాభ్యాసం వైపు దృష్టి సారించాలని దక్షిణ భారత్ కన్య కుబ్జ్ సభ అధ్యక్షుడు రామ్‌కుమార్ తివారి, ఉపాధ్యక్షుడు రాకేశ్ తివారీ అన్నారు. అంబికానగర్‌లోని దక్షిణ భారత్ కన్యకుబ్జ్ సభ ప్రాంగణంలో శనివారం కేజీ టు పీజీ విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్‌లు బ్యాగులు, స్టేషనరీ పంపిణీ చేశారు. కార్యదర్శి విజయ్‌పాల్, పాండే, రాజేంద్రప్రసాద్ తివారి, గోపాల్ ప్రసాద్ శుక్ల, విజయశంకర్ తివారి, శోభ పాండే పాల్గొన్నారు.


● శిక్షణలో భాగంగా నలుగురు ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారులు శనివారం ఆబిడ్స్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌లో 17 వర్టికల్స్ పనితీరు, క్రైం ప్రొఫైల్, స్టేషన్ రికార్డ్స్, పోలీసులు వినియోగించే ఐటీ అప్లికేషన్స్, పోలీసు విధులు పరిశీలించారు.
- గన్‌పార్క్, జూలై 12(ఆంధ్రజ్యోతి)

అంతర్జాతీయ స్థాయిలో చిత్రీకరణకు కృషి


చంద్రశేఖర్‌కు నియామక పత్రం అందజేస్తున్న చైతన్య జంగా తదితరులు

బర్కత్‌పుర, జూలై 12(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని చిత్రీకరణ చేయడానికి ఎఫ్‌టీపీసీ కృషి చేస్తోందని ఫిలిం అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టీపీసీ) అధ్యక్షుడు చైతన్య జంగా అన్నారు. ఇతర రాష్ట్రాలు, దేశాల్లో చిత్రీకరణ చేయడానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. త్వరలో అస్సాం ఈవెంట్‌తో పాటు సూపర్ ఉమెన్ అవార్డులను కూడా ప్రదానం చేయనున్నట్టు పేర్కొన్నారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఎఫ్‌టీపీసీ తెలంగాణ రాష్ట్ర మీడియా డైరెక్టర్‌గా గాజుల చంద్రశేఖర్‌ను నియమించి నియామక పత్రం అందజేసి ఆయన మాట్లాడారు. ఎఫ్‌టీపీసీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. ఎఫ్‌టీపీసీ కార్యదర్శి విజయవర్మ మాట్లాడుతూ, సీఎం రేవంత్‌రెడ్డి ఆశయాలను నెరవేర్చడానికి అంతర్జాతీయ చిత్రపరిశ్రమ హబ్‌గా హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రముఖ సినీ నటి పూజా గంగూలి మాట్లాడుతూ, తెలంగాణలో అద్భుతమైన లోకేషన్స్ ఉన్నాయని, బాలీవుడ్‌లో వాటికి ప్రాచుర్యం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. తెలంగాణ ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు సుభోదయం సుబ్బారావు మాట్లాడుతూ, చలనచిత్ర పరిశ్రమ అభ్యున్నతికి ఎఫ్‌టీపీసీ ఎంతో కృషి చేస్తోందన్నారు. నూతనంగా నియమితులైన మీడియా డైరెక్టర్ గాజుల చంద్రశేఖర్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని కళాకారులు, సాంకేతిక నిపుణులకు జాతీయ స్థాయిలో అవకాశాలు లభించేలా తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మీడియా చైర్మన్ కిరణ్ బేజాడి, శ్రీవేంకటేశ్వర కల్యాణ దేవస్థానం చైర్మన్ నేముల ప్రకాష్, సినీ నటి కవిత తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/h1yCzA7లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు. నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

చదువుకోమని మందలించినందుకు యువకుడి ఆత్మహత్య

రాజేంద్రనగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): చదువుకోమని తల్లి మందలించినందుకు మనస్తాపం చెందిన బాలుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హైదర్‌గూడకు చెందిన సునీల్(19) పదో తరగతి పరీక్షలు తప్పి ఇంటి వద్దే ఉంటున్నాడు. మంచిగా చదివి 10 వతరగతి పూర్తి చేయాలని తల్లి తరచూ చెప్పేంది. ఇదే విషయమై శనివారం ఉదయం కుమారుడిని చదువుకోమని మందలించింది. దాంతో మనస్తాపం చెందిన సునీల్ ఇంట్లోకి వెళ్లి ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందాడని వైద్యులు ధృవీకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై దాడి.. ఇద్దరి అరెస్ట్

రాజేంద్రనగర్, జూలై 12(ఆంధ్రజ్యోతి): పనిచేస్తున్న చోట ఓ యువకుడిపై దాడిచేసిన కేసులో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. అత్తాపూర్ పిల్లర్ నెంబర్ 203 వద్ద ఉన్న జెప్టో స్టోర్‌లో సులేమాన్‌నగర్‌కు చెందిన మహ్మద్ రేహాన్(20) జెప్టో రైడర్. అదే స్టోర్‌లో మహమూద్‌నగర్ హసన్‌నగర్‌కు చెందిన సులేమాన్ అలియాస్ సమీర్ (21) కూడా పనిచేస్తున్నాడు. వీరికి అంతంతమాత్రంగానే ఆర్డర్లు వస్తున్నాయి. ఈనెల 11న సులేమాన్ తన స్నేహితుడు యూనస్‌ను పనిలోకి తీసుకొచ్చాడు. దీంతో మహ్మద్ రేహాన్ అడ్డు చెప్పాడు. మనకే సరిగ్గా ఆర్డర్లు రావడం లేదు. మరొకరిని పనిలోకి ఎందుకు తీసుకొచ్చావని ప్రశ్నించాడు. దానికి ఆగ్రహించిన సులేమాన్, అతడి వెంట వచ్చిన యూనస్ కలిసి మహ్మద్ రేహాన్ తొడపై కత్తితో గాయపరిచాడు. మహ్మద్ రేహాన్ ఫిర్యాదు మేరకు అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని మహ్మద్ యూనస్, మహ్మద్ సులేమాన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) సేల్స్ అసోసియేట్ పి.రామ్‌గోపాల్ అత్యుత్తమ అవార్డును అందుకున్నారు. హైదరాబాద్ ప్రాంతంలో ఎఫ్‌టీటీహెచ్ విభాగంలో వ్యాపారాన్ని మరింత విస్తరించినందుకు గాను బీఎస్ ఎన్ఎల్ హైదరాబాద్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ ఎం.చంద్రశేఖర్ నుంచి రామ్‌గోపాల్ ఈ అవార్డును అందుకున్నారు.

క్రీడల్

- ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో వేధిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుల కొరత
- 22 కళాశాలల్లో ఒకే ఒక్క పీడీ
- ఐదేళ్లుగా ఇదే దుస్థితి
- ఈ విద్యకు విద్యార్థులు దూరం
- వారి కేటగిరిలోకే హైస్కూల్ విద్యార్థులు
- జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా



హైదరాబాద్ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. తమ నైపుణ్యాన్ని మెరుగుపరుచుకునేందుకు అవసరమైన వనరులు సమకూరకపోవడంతో నిరుత్సాహానికి లోనవుతున్నారు. ముఖ్యంగా వారిని తీర్చిదిద్దే వ్యాయామ అధ్యాపకులు లేరు. ఐదేళ్లుగా వారి కొరత నెలకొంది. దీంతో తరగతి గదులకే పరిమితం అవుతున్నారు. మైదానాలు నిరుపయోగంగా మారుతున్నాయి. 22 కాలేజీలు ఉంటే పీడీ ఒక్కరే ఉన్నారంటే అతిశయోక్తి కాదు.

● హైదరాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 22 ప్రభుత్వ జూనియర్ కాలేజీలున్నాయి. ఫస్టియర్, సెకెండియర్ విద్యార్థులు ప్రస్తుతం 11,680 మంది చదువుతున్నారు. సర్కారు కళాశాలల్లో విద్యార్థులకు తగిన సౌకర్యాలు లేవు. కనీసం క్రీడలు నేర్చుకునే అవకాశం లేకపోవడం బాధాకరంగా ఉందని తల్లిదండ్రులు వాపోతున్నారు.

ఒక్కరే ..

జిల్లాలోని 22 జూనియర్ కాలేజీల్లో ఒక చోట మాత్రమే పర్మినెంట్ పీడీ పనిచేస్తున్నారు. మిగతా కళాశాలల్లో అసలు వ్యాయామ విద్య సాగడం లేదు. పీరియడ్లలో స్పోర్ట్స్ క్లాసుకు ప్రత్యేకంగా సమయం కేటాయించాలి. ఆయా చోట్ల అసలు ఫిజికల్ డైరెక్టర్లే లేకపోవడంతో ఇదేమిటో విద్యార్థులకు తెలియని పరిస్థితి. దీంతో పలు కాలేజీల్లో ఆటస్థలాలున్నా అవి నిరుపయోగంగా మారుతున్నాయి. అయితే క్రీడా పోటీల్లో భాగంగా యేటా స్కూల్ లెవల్‌లో అండర్-14, అండర్-17, కాలేజీ లెవల్‌లో అండర్-19 కింద యేటా ఆటలు నిర్వహిస్తూ జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయికి ఎంపిక చేసి ప్రతిభ కలిగిన పిల్లలను క్రీడలపై ప్రోత్సహించాల్సి ఉంటుంది. అయితే పీడీలు కొరతతో అండర్-19 కింద ఎవరూ పోటీల్లో పాల్గొనడం లేదు. ఇదే కేటగిరీ కింద వచ్చే హైస్కూల్ విద్యార్థులు జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై రాణిస్తున్నారు.

పోస్టుల భర్తీలో జాప్యం

జూనియర్ కాలేజీల్లో పీడీ పోస్టులు 5 ఏళ్లుగా భర్తీ చేయడం లేదు. నూతన విద్యా విధానం (ఎన్ఈపీ) భాగంగా పీడీ పోస్టుల ఎంపికలో డబుల్ పీజీలు అడుగుతున్నారని పలువురు అధ్యాపకులు చెబుతున్నారు. డిగ్రీ, పీజీతోపాటు వ్యాయామ విద్యలో కూడా పీజీ మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఎంపీఈడీ) అడుగుతూ భర్తీలో జాప్యం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

• సుదర్శన హోమం



సర్వ జనుల హితం కోసం, భారీ గణపతి పనులు నిర్విఘ్నంగా పూర్తి కావాలని ఖైరతాబాద్ గణపతి వద్ద శనివారం సుదర్శన హోమం నిర్వహించారు. ఖైరతాబాద్ శాసనసభ్యులు దానం నాగేందర్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, బీఆర్ఎస్ నేత మన్నె గోవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు ఎం మహేందర్‌బాబు, మహేష్ యాదవ్, తదితరులు పూజలు చేశారు. ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ చైర్మన్ సింగరి రాజ్‌కుమార్, కన్వీనర్ సందీప్‌రాజ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు. వందలాది మంది స్థానికులు పండితుల ఆశీర్వచనాలు తీసుకున్నారు. **ఖైరతాబాద్, జూలై 12(ఆంధ్రజ్యోతి):**



బింబి ప్రాజెక్టు వరకు కార్ల ర్యాలీ

నార్సింగ్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నార్సింగ్ చౌరస్తా నుంచి బింబి ప్రాజెక్టు వరకు టైమ్‌స్పీడ్ డిస్టెన్స్ కార్ల ర్యాలీ నిర్వహించారు. ముంజా క్యాన్సర్ ఆసుపత్రికి చేయూతనిచ్చేందుకు రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డెక్కన్ వారు శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డెక్కన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఆరోగ్య సమస్య, విద్య, సమాజ అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వచ్చిన ఆదాయం వారికి అందజేస్తున్నామని పేర్కొన్నారు. పలు ఐటీ కంపెనీ ఉద్యోగులు, సామాజిక కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీలో ఉద్రిక్తత

- స్టేజీపైకి కాంగ్రెస్ సికింద్రాబాద్ ఇన్‌చార్జి సంతోష్‌కుమార్
- అభ్యంతరం వ్యక్తం చేసిన కార్పొరేటర్ సునీత
- ఇరు పార్టీ కార్యకర్తల వ్యతిరేక నినాదాలు
- కొద్దిసేపు గందరగోళం
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం



చెక్కును పంపిణీ చేస్తున్న ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ తదితరులు

బౌద్ధనగర్, జూలై 12(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి మల్టీపర్పస్ ఫంక్షన్‌హాలులో శనివారం ఉదయం జరిగిన బోనాల చెక్కుల పంపిణీలో రగడ చోటుచేసుకుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు భారీగా నినాదాల మధ్య కొంతసేపు ఉద్రిక్తత వాతావారణం చోటు చేసుకుంది. విషయానికొస్తే.. దేవాదాయ, ధర్మాదాయశాఖ వారు శనివారం ఉదయం సీతాఫల్‌మండి మల్టీపర్పస్ ఫంక్షన్‌హాలులో ప్రభుత్వసలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్‌లు చిలకలగూడ కట్టమైసమ్మ ఆలయ కార్యనిర్వహణాధికారి మహేందర్‌గౌడ్ చెక్కులను అందజేస్తున్నారు. కాంగ్రెస్ సికింద్రాబాద్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ స్టేజీపైకి వచ్చి కూర్చున్నారు. ప్రొటోకాల్ పాటించాలంటూ మెట్టుగూడ కార్పొరేటర్ సునీత అభ్యంతరం తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు భారీగా నినాదాలు చేశారు. కేవలం ఐదు చెక్కులను ప్రజాప్రతినిధులు అందజేసి, బోనాల చెక్కులను కార్పొరేటర్లు అందజేయలంటూ సూచించి అక్కడ నుంచి వెళ్లిపోయారు. చిలకలగూడ డివిజన్ ఏసీపీ శశాంక్ రెడ్డి సారథ్యంలో ఇన్‌స్పెక్టర్లు అనుదీప్, మధుసూదన్‌రెడ్డిలు నాయకులు, కార్యకర్తలను సముదాయించి అక్కడ నుంచి పంపించేశారు. దీంతో వివాదం సద్దుమణిగింది. కాగా, బోనాల చెక్కుల పంపిణీ చేసే కరెంట్ సరఫరా పోవటంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నారు. కావాలనే కరెంట్‌ను ఆపించారని ఆరోపణలు చేసుకున్నారు. కాని ట్రాన్స్‌ఫార్మర్ పేలిందని అందుకే కరెంట్ పోయిందని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు.

అండర్‌గ్రౌండ్ ఎలక్ట్రి'సిటీ'

(5వ పేజీ తరువాయి)

తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తున్న నేపథ్యంలో దక్షిణ డిస్కం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తోంది. 2018-19లో బెంగళూర్‌లో ప్రారంభించిన ప్రాజెక్టులో 7,400 కిలోమీటర్ల 11 కేవీ ఓవర్‌హెడ్ లైన్లు, వేలాది కిలోమీటర్ల ఎల్‌టీ లైన్లను అండర్‌గ్రౌండ్, ఎయిర్‌బంచుడ్ కేబుల్స్‌గా మారుస్తున్నారు. యూజీ మార్గాల్లో ప్రత్యేక డక్టులు ఏర్పాటు చేస్తూ భవిష్యత్తులో టెలికాం సంస్థలతో లీజ్ ద్వారా ఆదాయం సమకూర్చుకునే దిశగా అక్కడి విద్యుత్ సంస్థలు పని చేస్తున్నాయని దక్షిణడిస్కం చెందిన ఓ ఉన్నతాధికారి తెలిపారు.

25 వేల కి.మీ. విద్యుత్‌లైన్లు

నగరంలో ఎల్‌టీ, 11 కేవీ, 33 కేవీ, 132 కేవీ విద్యుత్ లైన్లు సుమారు 25 వేల కిలోమీటర్ల వరకు ఉన్నాయి. 33 కేవీ ఓవర్ హెడ్ లైన్లు 3,725 కిలోమీటర్లు ఉండగా, 11 కేవీ ఓవర్ హెడ్‌లైన్లు 21,643 కిలో మీటర్లు ఉన్నాయి. ఎల్‌టీ లైన్లు ఉన్న ప్రాంతాల్లో ఏబీ (ఎయిర్ బంచుడ్) కేబుల్స్‌వేసే ప్రతిపాదనలు సైతం విద్యుత్‌శాఖ పరిశీలిస్తోంది. గ్రేటర్‌లో ప్రస్తుతమున్న కేబుల్ వ్యవస్థను దశలవారీగా భూగర్భ కేబుల్ వ్యవస్థగా మార్చేందుకు సుమారు రూ.14-15 వేల ఖర్చు అవుతుందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. మొదట ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లు తొలగించి అండర్‌గ్రౌండ్ విద్యుత్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చే అవకాశాలను దక్షిణ డిస్కం పరిశీలిస్తోంది.

సరికొత్త టెక్నాలజీతో అండర్ గ్రౌండ్ కేబుల్స్

సరికొత్త టెక్నాలజీ హరిజెంటల్ డ్రిల్లింగ్ విధానంతో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్స్‌ను అందుబాటులోకి తీసుకువస్తే ఖర్చులో కొంతమేర తగ్గడంతో పాటు తక్కువ సమయంలో పనులు పూర్తిచేయవచ్చని కొంతమంది సీనియర్ ఇంజనీర్లు భావిస్తున్నారు. అయితే, ఈ విధానంలో ఓ డివిజన్ పరిధిలో ప్రయోగాత్మకంగా పరిశీలించి అక్కడ వచ్చే ఫలితాల ఆధారంగా ముందుకు వెళ్లాలనే యోచిస్తునట్లు తెలుస్తోంది.

సోమాలియా యువకుడికి కత్తిపోట్లు

● బైక్ యూటర్న్ తీసుకుంటుండగా గొడవ

రాయదుర్గం,జూలై 12(ఆంధ్రజ్యోతి): సోమాలియా యువకుడు కత్తిపోట్లకు గురయ్యాడు. ఈ సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆ దేశానికి చెందిన అహ్మద్(25) హిమాయత్‌నగర్‌లోని ఓ కళాశాలలో బీసీఏ రెండవ సంవత్సరం చదువుతూ మాసబ్‌ట్యాంక్‌లో నివాసం ఉంటున్నారు. ఇదే దేశానికి చెందిన యూనిస్ అబ్దికరీంహసన్(22) కొన్ని రోజుల క్రితం అతని వద్దకు వచ్చాడు. ఇద్దరూ కలిసి ఈనెల 8న అర్ధరాత్రి బైక్‌మీద చాయ్ తాగేందుకు ఐటీ కారిడార్‌కు చేరుకున్నారు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో నాలెడ్జ్ సిటీ సమీపంలోని ఐకియా వద్ద యూటర్న్ తీసుకుంటుండగా పక్కనున్న మరో బైక్ మీద వెళ్తున్న ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులతో గొడవ జరిగింది. దీంతో ఈ యువకులు మరో ఇద్దరిని పిలిపించారు. నలుగురు కలిసి సోమాలియా యువకులపై దాడికి పాల్పడ్డారు. అందులో ఓ యువకుడు కత్తితో అహ్మద్‌ను పొడిచి ఇక్కడి నుంచి పారిపోయారు. వెంటనే కరీం.. మాదాపూర్‌లోని మెడికవర్ ఆస్పత్రికి అహ్మద్‌ను తరలించాడు. శస్త్రచికిత్స అనంతరం అతను కోలుకుంటున్నాడు. బాధితుడి స్నేహితుడు యూనిస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

సాధికారతకు పీఎన్‌బీ కృషి

హైదరాబాద్ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజల సాధికారతకు పంజాబ్ నేషనల్ బ్యాంక్ కృషి చేస్తోందని పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం. పరమశివం అన్నారు. నల్లగొండ హాలియాలో శనివారం పీఎన్‌బీ కొత్తశాఖను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ పథకాల ద్వారా సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులు, కిసాన్‌క్రెడిట్, అగ్రిగోల్డ్ లోన్‌లను ఇస్తున్నామన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు రూ. 60 కోట్ల రుణాల మంజూరు చెక్కులను అందించారు. ఈ సందర్భంగా కొత్త కార్యాలయంలో ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమం, ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమంలో హైదరాబాద్ జోన్ సీజీఎం సునీల్ కుమార్ చుగ్, హైదరాబాద్ సర్కిల్ హెడ్ అరవింద్ కార్లాతోపాటు స్థానికులు, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.



పంజాబ్ నేషనల్ బ్యాంక్ ప్రారంభోత్సవంలో బ్యాంకు అధికారులు

కేసును వదిలేయండి

- ఎంతో కొంత సాయం చేస్తామని పోలీసుల ఒత్తిడి
- బాధితులు రాంబాబు, కనకదుర్గ దంపతుల ఆరోపణ
- కుమారుడిపై దాడి చేసిన వాలిపై చర్యలకు డిమాండ్



పంజాగుట్ట, జూలై 12(ఆంధ్రజ్యోతి): పోలీసులు తమ వద్దకు వచ్చి ఈ విషయాన్ని ఇంతటితో వదిలిపెట్టాలని, ఎంతో కొంత సహాయం చేస్తామని ఒత్తిడి చేశారని యూసుఫ్‌గూడ లక్ష్మీనరసింహనగర్‌కు చెందిన డి.రాంబాబు, కనకదుర్గ దంపతులు ఆరోపిస్తున్నారు. తమ కుమారుడిపై దాడి చేసిన వ్యక్తులు, పోలీసులపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని వేడుకున్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు తమ గోడును వెలిబుచ్చారు. గతేడాది డిసెంబరు 15న తమ కుమారుడు రీల్స్ చేస్తుండగా పక్కింట్లో స్నానం చేస్తున్న ఓ వ్యక్తి వీడియో తీశాడని ఆరోపిస్తూ సదరు వ్యక్తితో పాటు మరో ఇద్దరు కొట్టారన్నారు. ఆపై జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు పిలవడంతో తీసుకెళ్లామన్నారు. పోలీసులు సైతం కొట్టారని ఆరోపించారు. దీంతో నడవలేని పరిస్థితి వచ్చిందన్నారు. పలు ఆస్పత్రుల్లో వైద్య చికిత్సలు చేయిస్తున్నా ఆరోగ్య పరిస్థితిలో ఎలాంటి మార్పూ రావడం లేదన్నారు. పోలీసులు ఉన్నతాధికారులు, మానవ హక్కుల కమిషన్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందిని సస్పెండ్ చేయాలని కోరారు.

ఆరోపణలు అవాస్తవం

జూబ్లీహిల్స్ పోలీసులపై ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని జూబ్లీహిల్స్ ఏసీపీ పేరున శనివారం ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు. కుటుంబ సభ్యులు స్నానం చేస్తుండగా బాలుడు సెల్ ఫోన్ వీడియో తీస్తున్నాడని వ్యక్తి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని, విచారణ చేసి పంపించామని, ఆధారాలు న్యాయస్థానానికి సమర్పించామని తెలిపారు. ఆరు నెలల తర్వాత అసత్య ఆరోపణలు చేస్తున్నారని, విచారించి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

రెండు నెలలు.. 60 మంది

(5వ పేజీ తరువాయి)

వంటివి మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. గత రెండు నెలలో 140 సైబర్ క్రైమ్ కేసులను విచారించిన సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు టెక్నికల్ ఎవిడెన్స్‌ల ఆధారంగా ఏపీ సహా ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్, గుజరాత్, హరియాణా, రాజస్థాన్, మహారాష్ట్ర, బిహార్, తెలంగాణకు చెందిన నిందితులున్నట్లు గుర్తించారు. ఆ యా రాష్ట్రాల్లో గుర్తించిన 60 మంది సైబర్ క్రిమినల్స్‌పై తెలంగాణలో 140 కేసులు, దేశవ్యాప్తంగా 22 రాష్ట్రాల్లో 631 సైబర్‌క్రైమ్ కేసులు నమోదై ఉన్నట్లు గుర్తించారు.

● రూ. 15.27 కోట్లు రికవరీ

బాధితుల నుంచి ఫిర్యాదు అందిన వెంటనే కేసులు నమోదు చేస్తున్న పోలీసులు.. సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టిన డబ్బును బ్యాంకుల్లో ఎంత వీలైతే అంత ఫ్రీజ్ చేస్తున్నారు. అలా మే, జూన్ నెలల్లో నమోదైన నేరాల్లో సుమారు రూ.15.27కోట్లు (రూ.15,27,42,917) రికవరీ చేశారు. ఆ డబ్బును న్యాయస్థానాల అనుమతితో బాధితుల ఖాతాల్లో జమ చేశారు. అంతేకాకుండా జూన్-10న జరిగిన మెగా లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించిన పోలీసులు మరో రూ. 3.67కోట్లను రికవరీ చేసి సైబర్ బాధితుల ఖాతాల్లోకి రీఫండ్ చేశారు.

ఐఏఎస్ అధికారులతో కమిటీ వేయాలి

పంజాగుట్ట, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఐఏఎస్ అధికారులతో కమిటీ వేసి న్యాయం చేయాలని గచ్చిబౌలి ఎన్జీఓల ఇళ్ల స్థలాల సాధన సమితి ప్రతినిధులు డిమాండ్ చేశారు. స్థలం లేకుండా ఇళ్ల స్థలాలు కేటాయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, బీటీ ఎన్జీఓ సొసైటీ మేనేజింగ్ కమిటీని రద్దు చేయాలన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సమితి అధ్యక్షుడు ఎస్.పాండురంగారావు, కార్యదర్శి నర్సింగరావు, ప్రసాద్‌రావు, సభ్యులు మాట్లాడారు. తమకు సంబంధం లేకుండా, సంప్రదించ కుండానే కొత్తగా భాగ్యనగర్ తెలంగాణ మాక్ హౌసింగ్ సొసైటీ(బీటీ ఎన్జీఓ)అని పేరు పెట్టుకుని ఒక కమిటీని ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఈ కమిటీ తమ ఇష్టం వచ్చినట్టుగా వ్యవహరిస్తోందని, సమస్యను జటిలం చేస్తోందన్నారు. ఈ కమిటీని వెంటనే రద్దు చేసి, సొసైటీకి సంబంధించిన అన్ని బ్యాంకు ఖాతాలను సీజ్ చేయాలని, మేనేజింగ్ కమిటీ చేస్తున్న అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించి బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు.



మహిళలకు చెక్కును అందిస్తున్న బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నితీష్

కేంద్ర పథకాలపై అవగాహన

హైదరాబాద్ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా స్థిరపడిన వారు సమాజ అభివృద్ధిలో పాలు పంచుకుంటారని యూనియన్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నితీష్ రంజన్ అన్నారు. యూనియన్ బ్యాంక్ హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో ముచ్చింతల్ శాఖలో శనివారం ఏర్పాటు చేసిన మెగా జన సురక్ష అవగాహన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు రూ. 50 కోట్ల రుణ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఆమేరకు కేంద్రం పథకాలపై సెప్టెంబర్ 30 వరకు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఫైనాన్స్ సీజీఎం సుధాకర్ రావు, హైదరాబాద్ డిప్యూటీ జోనల్ హెడ్ సురేష్ రంజన్, 300 మంది లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

29న బ్రిటీష్ కౌన్సిల్ అవగాహన

హైదరాబాద్ సిటీ, జూలై12(ఆంధ్రజ్యోతి): యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)లో స్టడీ యూకే ప్రీ - డిపార్చర్ బ్రీఫింగ్ పేరుతో ఈనెల 29న మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ఆన్‌లైన్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శనివారం సంబంధిత అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యూకే వర్సిటీలలో చేరేందుకు ఆసక్తి చూపుతున్న విద్యార్థులకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. యూకేలో నిపుణుల సలహాలు, సూచనలు ఇస్తారని వివరించారు. ఇందులో యూకే వర్సిటీల ప్రతినిధులు, బీయూఐఎల్‌ఏ అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్యాకింగ్, బడ్జెట్, ప్రయాణ ఏర్పాట్లు, ఆరోగ్య భద్రత, బీమాకు సంబంధించిన విషయాలను చెబుతారని పేర్కొన్నారు. తమ పేరు, వివరాలతో నమోదు చేసుకోవాలని తెలిపారు.

విద్యార్థులకు చేయూత

- ఆనంద్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో షూ, బెల్టు, టైల పంపిణీ
- 600 మందికి అందజేత

ఆనంద్ కుమార్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్... ప్రభుత్వ స్కూళ్లలో చదివే విద్యార్థులకు చేయూతనిస్తోంది. వారి విద్యాప్రమాణాలకు మెరుగుకు అవసరమైన సామగ్రిని అందజేస్తూ ప్రోత్సహిస్తోంది. ఉన్నత స్థాయికి ఎదగాలని కోరుకుంటోంది. ట్రస్ట్ ద్వారా తనకు చేతనైన సాయం చేస్తున్నది. వాటిని సద్వినియోగం చేసుకొని ఉన్నతస్థితికి ఎదగాలని మనస్పూర్తిగా ఆకాంక్షిస్తోంది.



విద్యార్థినికి బెల్టు, టై అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

అడ్డగుట్ట, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ట్రస్ట్ వ్యవస్థాపకులు శ్రీరాంచంద్రారావు, ఎలమంచలి అపర్ణల ఆధ్వర్యంలో శనివారం అడ్డగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న 600 మంది విద్యార్థి విద్యార్థులకు టై బెల్టు, షూలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ముఖ్య ప్రతినిధి రాగిణి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు చేయూత ఇవ్వాలనే సంకల్పంతోనే పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సంస్థ ముఖ్య ప్రతినిధి అభిషేక్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ఏ ఇబ్బందులు లేకుండా ఉండేందుకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. క్రీడల్లో మంచి నైపుణ్యంతో పాటు చదువుపై ప్రత్యేక శ్రద్ధ ఉండాలన్నారు. డిప్యూటీ కలెక్టర్ (ప్రజావాణి ఇన్‌చార్జి) సూర్యప్రకాశ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకొంటున్న విద్యార్థులకు అన్ని విధాలా ప్రభుత్వం నుంచి అండ ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో మారేడుపల్లి మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్ మథన్ మెహన్‌రెడ్డితో పాటు టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మా వంతుగా సాయం చేస్తాం



విద్యార్థులు బాగా చదువుకోవాలి. మా ట్రస్ట్ ద్వారా అన్ని విధాలా అందుకు అవసరమైన సహాయ సహకారాలను అందజేస్తాం. చదువు, క్రీడల్లో నైపుణ్యాన్ని పెంచుకోవాలి. ప్రభుత్వ పాఠశాలలకు కావాల్సిన అన్ని సౌకర్యాలు మా ట్రస్ట్ ఏర్పాటు చేయనుంది. వీటిని సద్వినియోగం చేసుకొంటే ఉన్నతస్థాయికి బాటలు వేసుకోవచ్చు.

రాగిణి, అభిషేక్ రెడ్డి (ట్రస్ట్ ముఖ్య ప్రతినిధులు)

ఆర్ట్‌కు మంచి మార్కెట్



రాజా రవివర్మ చిత్రం 35 కోట్ల రూపాయలు... ఎంఎఫ్ హుస్సేన్ పెయింటింగ్ 3.5 కోట్లు... ఇలా మన దేశంలో లబ్ధ ప్రతిష్టులైన ఆర్టిస్టుల పెయింటింగ్స్‌ను విక్రయిస్తోంది 'ఆర్ట్ గ్యాలరీ జీ'. సోషల్ మీడియా యుగం ప్రారంభమయిన తర్వాత కళాకారులకు మంచి రోజులు వచ్చాయని, పెయింటింగ్‌లు అందరి దగ్గరకు చేరుతున్నాయని అంటారు 'గ్యాలరీ జీ' ఫౌండర్ గీతాంజలి. హైదరాబాద్‌లో జరుగుతున్న 'గ్యాలరీ జీ' ప్రదర్శన నేపథ్యంలో ఆమె 'నవ్య'తో సంభాషించారు.

ప్రస్తుతం మన దేశంలో ఆర్ట్ మార్కెట్ పరిస్థితి ఏమిటి?

ప్రజలకు ఏది కావాలో అది అందించినప్పుడే ఏ కళకైనా మనుగడ ఉంటుంది. ఆర్ట్ మార్కెట్ కూడా అంతే! ఒక ఆర్టిస్టు తన భావనను కేన్వాస్‌పై చిత్రీకరిస్తాడు. దాన్ని కావాలనుకొనేవారు కొందరు ఉంటారు. వారిద్దరికీ మధ్య వారధిగా గ్యాలరీలు ఉంటాయి. మన దేశంలో పెయింటింగ్‌లకు విపరీతమైన డిమాండ్ ఉంది. అనధికార అంచనాల ప్రకారం ప్రస్తుతం ఆర్ట్ మార్కెట్ విలువ ఏడాదికి సుమారు 800 కోట్ల రూపాయలు ఉంటుంది. ఒక విధంగా చూస్తే ఇది చాలా తక్కువనే చెప్పాలి. మనకు అద్భుతమైన ఆర్టిస్టులు ఉన్నారు. మన దగ్గర ఉన్న కొద్దిమంది ఆర్టిస్టులకు మాత్రమే ఇప్పటి దాకా గుర్తింపు వచ్చింది. ఇంకా అనేకమంది ఉన్నారు. వీరందరికీ రావాల్సినంత పేరు వస్తే మార్కెట్ విలువ మరింతగా పెరుగుతుంది.



ఒక ఆర్టిస్టు పెయింటింగ్‌ల విలువను ఎలా బేరీజు వేస్తారు?

దీనికి అనేక కోణాలు ఉంటాయి. ఆర్టిస్టు ప్రతిభతో పాటుగా... ఎలాంటి షోలలో ఆయన ప్రదర్శిస్తున్నాడు, ఏఏ గ్యాలరీలతో ఆయన అనుబంధంగా పనిచేస్తున్నాడు? అనే విషయాలు కూడా పెయింటింగ్‌ల విలువను పెంచుతాయి. ఆర్ట్ మార్కెట్‌లో ప్రవేశించాలంటే కొన్ని పద్ధతులు పాటించాలి. 'నేను మంచి పెయింటింగ్‌లు వేస్తున్నాను. నా దగ్గరకు వచ్చిన వారికి అమ్ముతాను' అనుకుంటే కుదరదు. రీసెర్చ్ చేయాలి. మంచి గ్యాలరీలకు అనుబంధంగా పనిచేయాలి.

ఎవ్వరికీ తెలియని స్థితి నుంచి ప్రపంచం స్థాయి గుర్తింపు వచ్చిన ఆర్టిస్టులు మీ ఎరుకలో ఎవరైనా ఉన్నారా?

నేను 'రాజా రవివర్మ హెరిటేజ్ ఫౌండేషన్'కు మేనేజింగ్ ట్రస్టీని. ఆయన డైరీలను చదివితే ప్రతిభావంతుడైన ఒక ఆర్టిస్టు ఎన్ని కష్టాలు పడాల్సి వస్తుందో అర్థమవుతుంది. ఇప్పుడైతే రాజా రవివర్మ గురించి అందరికీ తెలుసు. ఒక్కప్పుడు ఆయన అతి కొద్దిమందికే తెలుసు. ఆయన చిన్నప్పుడు తన బొమ్మలను అందరూ గుర్తించాలనుకొనేవారు. రకరకాలుగా చిత్రాలను వేయటానికి ప్రయత్నించేవారు. రంగుల విషయంలో ప్రయోగాలు చేసేవారు. అలా కృషి చేయగా చేయగా ఆయనకు పేరు వచ్చింది. ఎంఎఫ్ హుస్సేన్ కూడా అంతే! ఆయన వాల్‌పోస్టర్లు పెయింట్ చేసేవారు. ఇప్పుడు వారి పెయింటింగ్స్ కోట్ల రూపాయలకు అమ్ముడుపోతున్నాయి. వారి పేరు వెనక చాలా కృషి దాగి ఉంది.

ఒక మంచి పెయింటర్ తన పెయింటింగ్‌లను ఎలా మార్కెట్ చేసుకోవాలి?

ఆర్ట్ మార్కెట్‌కు సోషల్ మీడియా ఒక వరంలాంటిది. ఎవరైనా తమ పెయింటింగ్‌ల గురించి ప్రపంచవ్యాప్తంగా తెలియచెప్పాలనుకుంటే ఇన్‌స్టాగ్రామ్ పేజీని ప్రారంభిస్తే చాలు. దాని ద్వారా పెయింటింగ్ ప్రేమికులకు దగ్గర కావచ్చు. అంతేకాదు... గ్యాలరీల నిర్వాహకులు కూడా చూస్తూ ఉంటారు. నేరుగా కొనేవాళ్లు కూడా ఉంటారు. ఒక విధంగా చెప్పాలంటే- సోషల్ మీడియా పెయింటింగ్‌ను అందరి దగ్గరకు తీసుకువచ్చింది. మనకు నచ్చిన పెయింటింగ్‌ను కొనుగోలు చేసే స్వేచ్ఛని కలిగించింది. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. మేము కూడా మా గ్యాలరీని ఇలాగే నడుపుతున్నాం. ఎవరైనా రావచ్చు. పెయింటింగ్‌ను కొనుగోలు చేయవచ్చు.

> రవివర్మ మొదట్లో కొద్దికాలం కేవలం రాజకుటుంబాల వారి కోసమే చిత్రాలు వేసేవారు. ఆ తర్వాత ఆయన ఆలోచనా విధానంలో మార్పు వచ్చింది. తన పెయింటింగ్స్ ప్రపంచంలో అందరి దగ్గరకు చేరాలనుకున్నారు. లిథోగ్రాఫిక్ ప్రెస్‌ను ప్రారంభించి చిత్రాలు ముద్రించారు. ఆయన ఈ ప్రెస్‌ను ప్రారంభించి ఉండకపోతే ఆయన పెయింటింగ్స్ కొందరి దగ్గరే మాత్రమే ఉండేవి. ఇప్పుడు ఆయన పెయింటింగ్ ప్రతి ఇంట్లో ఏదో ఒక రూపంలో కనిపిస్తూ ఉంటుంది.

సండే సెలబ్రిటీ



తెలుగు పరిశ్రమ గర్వించదగిన కళాదర్శకులలో పద్మశ్రీ తోట తరణి ఒకరు. 'అమావాస్య చంద్రుడు', 'నాయకన్', 'సాగరసంగమం', 'చూడాలని ఉంది'... ఇలా వైవిధ్యభరితమైన అనేక కథాంశాలకు ఆయన పనిచేశారు. తాజాగా ఆయన కళాదర్శకత్వం వహించిన 'హరిహర వీరమల్లు' సినిమా అతి త్వరలోనే విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఆయన 'నవ్య'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ విశేషాలలోకి వెళ్తే...

ఒక్కో సినిమా వెనుకా ఒక్కో కథ

'హరిహర వీరమల్లు' సినిమా ఎలాంటి అనుభవాన్ని మిగిల్చింది?

ఇది నేను కల్యాణ్‌గారితో కలిసి చేస్తున్న తొలి సినిమా. చిరంజీవిగారితో అనేక సినిమాలు చేశా. కల్యాణ్‌గారు నాకు చాలాకాలంగా తెలుసు. కానీ తొలిసారి కలిసి పనిచేస్తున్నా. ఆయన షూటింగ్‌లో చిన్న చిన్న విషయాలమీద కూడా చాలా శ్రద్ధ చూపిస్తారు. ఈ సినిమా అనుకున్న సమయం కన్నా ఆలస్యమయింది. కొన్ని ఇబ్బందికరమైన పరిస్థితులు కూడా ఎదుర్కొన్నాం. అయినా మా శక్తియుక్తులన్నీ పెట్టి పనిచేశాం. ఇక్కడ నిర్మాత ఏ.ఎం.రత్నంగారి గురించి కూడా చెప్పాలి. షూటింగ్ ఆలస్యమయినా తట్టుకొని నిలబడ్డారు. అందుకే ఈ సినిమా పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నా.

ఈ సినిమాకు సంబంధించి మీరు ఎదుర్కొన్న సవాళ్లు ఏవైనా ఉన్నాయా?

సాధారణంగా నేను దేన్నీ సవాలుగా భావించను. దీనికి ఒక కారణం ఉంది. చాలా సందర్భాలలో సెట్‌ను పూర్తిచేయకపోవటం అనేది తగినంత సమయం లేకపోవటం వల్ల జరుగుతుంది. అదేమిటో తెలియదు కానీ... నేను పనిచేసే సినిమాలకు ఎక్కువ సమయం ఇచ్చేవారు కాదు. దీంతో తక్కువ సమయంలోనే సినిమా పూర్తి చేయాల్సి వచ్చేది. అది అలవాటు అయిపోయింది. ఈ సినిమా విషయానికి వస్తే - ఒక్క రోజులో మొత్తం సెట్‌ను మార్చేయాల్సి వచ్చింది. రత్నంగారు కూడా ఆ రోజంతా నాతో పాటే ఉన్నారు.

కళాదర్శకుడిగా మీరు సవాల్‌గా భావించిన సినిమా ఏదైనా ఉందా?

లేదు. అలాంటి సినిమా గురించే ఎదురు చూస్తున్నా. 'హరిహర వీరమల్లు' పూర్తయింది కాబట్టి నాలుగు నెలలు ఖాళీగా ఉందామనుకుంటున్నా. ఈ సమయంలో నాకు నచ్చిన పెయింటింగ్స్ నేను వేసుకుంటా. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. నేను ఒక పెయింటింగ్ వేస్తే కొద్దిమందిని మాత్రమే ఆనందపరచగలుగుతాను. కానీ ఆర్ట్ డైరక్టర్‌గా వందలమందికి ఉపాధి కల్పించగలుగుతాను అందుకే నేను చిన్న సినిమాలూ చేస్తాను, పెద్ద సినిమాలూ చేస్తాను. బడ్జెట్ గురించి పట్టించుకోను.

సినీ పరిశ్రమకు వచ్చిన తర్వాత మీరు మరచిపోలేని వ్యక్తులు ఎవరైనా ఉన్నారా?

సింగీతం శ్రీనివాసరావు గారిని మర్చిపోలేను. ఆయన దర్శకత్వం వహించిన ఒక సినిమాకు మా నాన్నగారు తోట వెంకటేశ్వరరావు గారు కళాదర్శకులు. దాని కోసం రెండు సెట్స్ వేసి పాటలు చిత్రీకరించారు. నేను అప్పుడు 'హ్యాండ్‌లూమ్ బోర్డు'లో 'ఏ-గ్రేడ్ డిజైనర్'గా పనిచేసేవాణ్ణి. మంచి ఉద్యోగం. ఒక రోజు నాన్నగారు, తమ్ముడు ఊర్లో లేకపోతే... సెట్ పనులు చూసుకుందామని షూటింగ్‌కు వెళ్లాను. అక్కడ సింగీతం గారు నన్ను చూసి- "నువ్వెందుకు వచ్చావు? నువ్వు పెయింటర్‌వి. వెళ్లి ఉద్యోగం చేసుకో" అన్నారు. నాకు చాలా కోపం వచ్చింది. ఆ సినిమా పూర్తయిన తర్వాత ఒక రోజు ఆయన- "నేను, కమల్ వస్తాం. నీతో మాట్లాడాలి" అని కబురు పెట్టారు. అసలే కోపం మీద ఉన్నా కదా.. "నేను కలవను" అని తిరిగి కబురు పంపించా. ఆ తర్వాత కొందరు నాకు సర్దిచెప్పాక... మేము కలుసుకున్నాం. అప్పుడు వాళ్లిద్దరూ కలిసి చేసిన సినిమాయే... 'అమావాస్య చంద్రుడు. దీనిలో హీరో పెయింటర్. అందుకే ఆయన నన్ను ఎంపిక చేసుకున్నారు. ఈ సినిమా షూటింగ్ రెండేళ్లు సాగింది. ఆ తర్వాత ఏడిద నాగేశ్వరరావుగారు వచ్చి అడిగారు. ముందు చేయనన్నాను. ఆ తర్వాత చేశాను. ఇలా నేను చేసిన ఒకో సినిమాకు ఒకో కథ ఉంది. 'అల్లూరి సీతారామరాజు' సినిమాకు మొత్తం పనిచేసినందుకు నాకు వెయ్యి రూపాయలు ఇచ్చారు. ఇప్పుడు చాలామంది రోజుకు ఐదువేల రూపాయలు తీసుకుంటున్నారు. అప్పటికీ, ఇప్పటికీ చాలా మార్పులు వచ్చాయి.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

వారందరిదీ సూక్ష్మ దృష్టి

పెద్ద నటులందరూ సూక్ష్మమైన విషయాలను వెంటనే పట్టుకుంటారు. వారికి అంత ఏకాగ్రత, నిబద్ధత ఉంటుంది. రజనీకాంత్, చిరంజీవిగారు, కమల్‌హాసన్, దిలీప్‌కుమార్, ఇప్పుడు పవన్‌కల్యాణ్... ఇలా చెప్పుకుంటూ పోతే అగ్రనటులందరికీ సూక్ష్మ దృష్టి ఉంటుంది. 'చూడాలని ఉంది' సినిమా షూటింగ్ సమయంలో ఒక పాట చిత్రీకరిస్తున్నారు. పాట కోసం ఒక స్టేజ్ వేశాం. దానిపై కొన్ని కుర్చీలు ఉండాలి. కానీ అక్కడ ఉన్న కుర్చీలు వాటిపై అమరటం లేదు. దర్శకుడు గుణశేఖర్ వచ్చి "ఈ కుర్చీలను ఏమైనా చేయవచ్చా?" అని అడిగాడు. నేను వెంటనే కార్పెంటర్‌ను పిలిచి జపనీస్ స్టైల్‌లో కుర్చీని చేయించాను. దాన్ని స్టేజ్‌కి అమర్చాం. దానివెనుక అల్యూమినియం రేకుతో కొన్ని అక్షరాలు చెక్కించి పెట్టాం. చిరంజీవిగారు వచ్చారు. ఆయనతో పాటు కల్యాణ్‌గారు కూడా వచ్చారు. అల్యూమినియం అక్షరాలు చిరంజీవిగారి దృష్టిలో పడ్డాయి. కల్యాణ్‌గారితో- "చూడు. ఎంత డిటైల్డ్‌గా వెళ్లాడో చూడు... అక్షరాలు కూడా అల్యూమినియంతోనే చెక్కించాడు" అన్నారు. నేను మర్చిపోలేని సంఘటన అది.

రాజ్‌కపూర్‌తో...

'సాగర సంగమం' విజయోత్సవాలకు రాజ్‌కపూర్ వచ్చారు. ఆ చిత్రానికి నేను కళాదర్శకుడిని. నాన్నగారి స్నేహితుడు ఒకరు నన్ను రాజ్‌కపూర్ దగ్గరకు తీసుకువెళ్లి పరిచయం చేశారు. ఆ సమయంలో అక్కడ పార్టీ జరుగుతోంది. మమ్మల్ని పిలవకపోయినా- నేను, కొద్దిమంది స్నేహితులం ఆ పార్టీలో దూరేసి- రాజ్‌కపూర్‌గారి సమీపంలో కూర్చున్నాం. ఆయన ఆ కబురు, ఈ కబురు చెబుతూ- "కమల్ డ్యాన్స్ చేసిన నుయ్యి నిజమైనదేనా? దాని వెనక మోటర్‌షెడ్ ఎందుకు పెట్టారు?" అని అడిగారు. "14 అడుగుల నుయ్యి తవ్వించాం. పైన రెండు ఎలక్ట్రికల్ పైపులు ఉన్నాయి. అందుకోసం వెనక మోటార్ షెడ్ పెట్టాం" అని చెప్పాను. ఈ తరం వారికి ఇలాంటి వారిని కలిసే అదృష్టం లేదనే చెప్పాలి.

రేవంత్‌రెడ్డీ.. దమ్ముంటే అసెంబ్లీ పెట్టు

» మోటార్లు ఆన్ చేస్తే అన్ని రిజర్వాయర్లు నింపొచ్చు:హరీశ్



సిద్దిపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): 'మోటార్లు ఆన్ చేస్తే వారం రోజుల్లో రంగనాయక సాగర్ నిండిపోతుంది. అలా అన్ని రిజర్వాయర్లు నింపొచ్చు. ఈసారి వర్షాలు పడతలేదు. దీంతో పత్తి చేనులు ఎండిపోయే పరిస్థితి ఉంది. రేవంత్‌రెడ్డి ఏమో మోటర్లు ఆన్ చేయకుండా రాజకీయాలు చేస్తున్నడు' అని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. 'రేవంత్ రెడ్డీ.. దమ్ము, సత్తా ఉంటే అసెంబ్లీ పెట్టు. నువ్వేం చేసావో, మేమేం చేసామో ఎంత సేపైనా మాట్లాడుకుందాం. కానీ అసెంబ్లీ పెట్టే దమ్ముందా నీకు?' అని ధ్వజమెత్తారు. సిద్దిపేటలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను హరీశ్‌రావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'మహారాష్ట్రలో వర్షాలు పడుతుంటే, గోదావరి నుంచి 8 లక్షల క్యూసెక్కుల నీళ్లు పోతున్నయి. అంటే రోజుకు 80 టీఎంసీల నీళ్లు పోతున్నయి. కళ్ల ముందు నీళ్లు పోతున్నా రేవంత్ రెడ్డి రైతులకు మాత్రం నీళ్లు ఇస్తలేడు. కేవలం స్విచ్ ఒత్తితే నీళ్లు వస్తాయి. నువ్వు ఇస్తావా, లేకపోతే మేము రైతులతో కలిసి స్విచ్ వేయాలా' అని ప్రశ్నించారు. కాళేశ్వరం కూలిపోయిందని కాంగ్రెస్ ప్రచారం చేస్తున్నదని, మేడిగడ్డ కూలితే బ్రిడ్జి పైన లారీలు, వాహనాలు ఎలా నడుస్తున్నాయని ప్రశ్నించారు. కేసీఆర్‌పైన, మాపైన కోసం ఉంటే కేసులు పెట్టుకో కానీ, రైతులు ఏంచేశారు? కాళేశ్వరం ఏం చేసిందని? అని ప్రశ్నించారు. నదీ జలాల సద్వినియోగానికి కేసీఆర్ చిత్తశుద్ధితో చేసిన కృషికి సీతారామ ప్రాజెక్టే ఓ సజీవ సాక్ష్యమని హరీశ్ రావు అన్నారు. ఈ ప్రాజెక్ట్‌ను ఆన్ చేసినట్లే, కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి కూడా మోటర్లు ఆన్ చేసి సాగు నీటి కోసం ఎదురుచూస్తున్న రైతాంగాన్ని ఆదుకోవాలని ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రైతు నేస్తం పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

» వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఆదర్శ రైతులు..
వినూత్న ఆవిష్కర్తలకు ప్రదానం

» ఆగస్టు 31లోగా పంపాలని నిర్వాహకుల ప్రకటన

హైదరాబాద్ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : రైతునేస్తం 21వ వార్షికోత్సవం సందర్భంగా ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త దివంగత డాక్టర్ ఐవీ సుబ్బారావు స్మారక పురస్కారాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి దరఖాస్తులు కోరుతూ రైతునేస్తం ఫౌండేషన్ ఛైర్మన్ పద్మశ్రీ అవార్డు గ్రహీత యడ్లపల్లి వెంకటేశ్వరరావు ఓ ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో విశేష సేవలందిస్తున్న శాస్త్రవేత్తలు, ఆదర్శ రైతులు, విస్తరణ అధికారులతో పాటు వినూత్న వ్యవసాయ ఆవిష్కరణల రూపకర్తలు... దరఖాస్తులతో పాటు వారి పరిశోధన వ్యాసాలు, సాగు అనుభవాలను జత చేసి ఆగస్టు 31లోగా 'ఎడిటర్, రైతునేస్తం, 6-2-959, దక్షిణ భారత హిందీ ప్రచార సభ భవనం, ఖైరతాబాద్, హైదరాబాద్-500004 చిరునామాకు పంపించాలి. రైతునేస్తం, డోర్‌నెంబరు 8-198, పుల్లడిగుంట దగ్గర, కొర్నెపాడు పోస్టు, వట్టిచెరుకూరు మండలం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్- 522017 చిరునామాకు కూడా పంపించవచ్చని నిర్వాహకులు తెలిపారు. పురస్కారాలకు ఎంపిక చేసిన వ్యక్తులకు సెప్టెంబరులో నిర్వహించే రైతునేస్తం వార్షికోత్సవ సభలో అవార్డులు ప్రదానం చేస్తామని వెంకటేశ్వరరావు వెల్లడించారు. మిగతా వివరాలకు 9676797777, 9705383666 నెంబర్లలో సంప్రదించవచ్చు. దరఖాస్తులను రైతునేస్తం డాట్ ఇన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి.

విద్యుత్ ఉద్యోగుల కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శిగా సాయిబాబు

విద్యుత్ ఉద్యోగుల కార్మిక సంఘం(1104) ప్రధాన కార్యదర్శిగా జి.సాయిబాబు నాలుగోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన యూనియన్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికల్లో అధ్యక్షుడిగా వేమూరి వెంకటేశ్వర్లు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రాజేందర్ ఎన్నికయ్యారు.

కల్లు కాంపౌండ్లపై ఆకస్మిక దాడులు

» శాంపిళ్ల సేకరణ.. పరీక్ష కోసం ల్యాబ్‌కు..

» శేరిలింగంపల్లిలో అనుమతి లేని కల్లు దుకాణం సీజ్.. కేసు నమోదు

హైదరాబాద్ సిటీ, జూలై 12(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధిలోని పలు కల్లు దుకాణాల్లో ఎక్సైజ్ ఎస్టీఎఫ్ బృందాలు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. శేరిలింగంపల్లి పరిధిలోని సిద్ధిక్ నగర్‌లో అనుమతి లేని కల్లు దుకాణాన్ని మూయించి, దాని నిర్వాహకుడిపై కేసు నమోదు చేశాయి. ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ప్రణవి ఆదేశాతో ఎస్టీఎఫ్ బృందాలు బాలానగర్, మూసాపేట్, కైతలాపూర్, ముషీరాబాద్, కాచిగూడ ప్రాంతాల్లోని కల్లు కాంపౌండ్లలో కూడా తనిఖీలు నిర్వహించి, శాంపిళ్లను సేకరించాయి. వాటిని పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో కల్తీ కల్లు తాగి 9మంది ప్రాణాలు కోల్పోగా.. మరో 50మంది అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. ఈ ఘటన తర్వాత బాలానగర్ ఎక్సైజ్ పోలీసులు హైదర్‌నగర్, దానికి అనుబంధంగా ఉన్న హెచ్ఎంటీ కాలనీ, సర్దార్ పటేల్ నగర్, కేపీహెచ్‌బీలోని భాగ్యనగర్ కల్లు దుకాణాలను మూయించివేశారు. అక్కడ కల్లులో నిషేధిత ఆల్ప్రాజోలం మత్తు మందు కలిపినట్లు పరీక్షల్లో తేలింది. కల్లు కల్తీకి పాల్పడిన నలుగురు నిర్వాహకులు కూన రవితేజ గౌడ్, కూన సాయితేజ గౌడ్, నగేష్ గౌడ్, బట్టి శ్రీనివాస్ గౌడ్‌ను అరెస్టు చేశారు. ఇప్పటి వరకు సీజ్ చేసిన కల్లు కాంపౌండ్ల సంఖ్య 5కు చేరింది. హైదరాబాద్ పరిధిలో 97 కల్లు దుకాణాలు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతుండగా.. పలువురు నిర్వాహకులు అంతకుమించి ఇష్టానుసారం కల్లు కాంపౌండ్లు నడుపుతున్నట్లు సమాచారం.



హైదరాబాద్‌లోని ఓ కల్లు దుకాణంలో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

కోలుకుంటున్న కల్తీ కల్లు బాధితులు

నిమ్స్: నిమ్స్, గాంధీ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న కల్తీ కల్లు బాధితుల ఆరోగ్యం క్రమేణా మెరుగుపడుతోంది. శనివారం నిమ్స్ నుంచి మరో అయిదుగుర్ని డిశ్చార్జి చేసినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం 25 మందికి చికిత్స అందిస్తున్నామని, వారిలో 10 మందికి డయాలసిస్ అవసరమని పేర్కొన్నాయి. గాంధీ ఆస్పత్రిలో మరో 18 మంది చికిత్స పొందుతున్నారు. వారి ఆరోగ్యం నిలకడగా ఉందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

గోదావరి, కృష్ణా ప్రాజెక్టులకు తగ్గుతున్న వరద

» శ్రీశైలం నుంచి ఒక గేటు ద్వారా నీటి విడుదల

» 548.60 అడుగులకు చేరుకున్న సాగర్ నీటి మట్టం

» భద్రాచలం వద్ద 41.20 అడుగులకు చేరిన గోదావరి ప్రవాహం

మహబూబ్‌నగర్/నాగార్జునసాగర్/మహదేవపూర్/ములుగు/పోలవరం/ధవళేశ్వరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మహారాష్ట్ర, కర్ణాటకలో కురుస్తున్న వర్షాలతో కృష్ణా, గోదావరి నదుల్లో మూడు రోజులుగా పెరుగుతూ వచ్చిన వరద శనివారం నాటికి క్రమంగా తగ్గుముఖం పట్టింది. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి శుక్రవారం వరకు మూడు గేట్ల ద్వారా కొనసాగిన నీటి విడుదల వరద తగ్గడంతో అధికారులు శనివారం ఒక గేటుకు కుదించారు. ప్రస్తుతం ఒక గేటు ద్వారా 27,715 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతుండగా విద్యుదుత్పత్తి, పోతిరెడ్డిపాడు, ఎంజీకేఎల్ఐతో కలుపుకుని మొత్తం 1.17 లక్షల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో నమోదవుతోంది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా ప్రస్తుతం 204.35 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ పరివాహకంలో ఉన్న ఆలమట్టి, నారాయణపూర్, తుంగభద్ర ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లోలు పడిపోతుండటంతో అధికారులు క్రమంగా నీటి విడుదలను కూడా తగ్గించారు. దీంతో రానున్న రెండు రోజుల్లో జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులకు కూడా ఇన్‌ఫ్లోలు తగ్గనున్నాయి. మరోవైపు భద్రచలం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. శనివారం సాయంత్రం నాటికి భద్రాచలం వద్ద 41.20 అడుగులకు నీటి మట్టం చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువవుతోంది. పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి నిండుకుండను తలపిస్తోంది. ఇప్పటికే రెండు రోజులుగా పోలవరం ప్రాజెక్టు ఎగువన ముంపు మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో సుమారు 25 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వేలేరుపాడు మండలం ఎద్దువాగులోకి వరదనీరు చేరడంతో ఎగువన ఉన్న గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. కుక్కునూరు మండలం గొమ్ముగూడెం చుట్టూ వరదనీరు చేరడంతో ఆ గ్రామంలోని 250కి పైగా కుటుంబాలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఎగువ నుంచి వచ్చి చేరుతున్న వరద నీటితో తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. శుక్రవారం సాయంత్రానికి ధవళేశ్వరం వద్ద 3.5 లక్షల క్యూసెక్కులు సముద్రంలో కలవగా శనివారం సాయంత్రానికి 5,29,209 క్యూసెక్కులు కాటన్ బ్యారేజ్ గేట్ల ద్వారా సముద్రంలోకి వెళుతోంది. సెంట్రల్ వాటర్ కమిషన్ అంచనా ప్రకారం గోదావరి వరద ఆదివారం నుంచి క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు.



పీవీ విగ్రహావిష్కరణలో సీఎస్ రామకృష్ణారావు, శ్రీనివాసరాజు, సురభి వాణీదేవి

సాంకేతికతను మంచికి వాడండి

» క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలు

» గురుకులాలకు ఆద్యుడు పీవీ: సీఎస్ రామకృష్ణారావు

» ఏపీలోని కొడిగెనహళ్లి ఏపీఆర్ఎస్‌లో పీవీ విగ్రహావిష్కరణ

హిందూపురం, జూలై 12(ఆంధ్రజ్యోతి): 'మేము చదువుకునే రోజులతో పోలిస్తే సాంకేతికత ఇప్పుడు చాలా అభివృద్ధి చెందింది. దీన్ని మంచికి ఉపయోగించాల'ని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు విద్యార్థులకు సూచించారు. ఏపీలోని శ్రీసత్యసాయి జిల్లా కొడిగెనహళ్లిలోని గురుకుల పాఠశాల ఆవరణలో శనివారం మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగింది. పూర్వ విద్యార్థుల సహకారంతో ఏర్పాటుచేసిన పీవీ విగ్రహాన్ని కొడిగెనహళ్లి ఏపీఆర్ఎస్ పూర్వ విద్యార్థి అయిన రామకృష్ణారావు ఆవిష్కరించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, పీవీ కుమార్తె, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు. రామకృష్ణారావు మాట్లాడుతూ క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలకు చేరడం సాధ్యమని విద్యార్థులకు సూచించారు. '1975లో కొడిగెనహళ్లి పాఠశాలలో 6వ తరగతిలో చేరాను. అప్పట్లో భారీ వర్షాలు కురిశాయి. మా తాత వచ్చి.. ఇబ్బందిగా ఉంటే వెనక్కు రమ్మన్నారు. కానీ ఇక్కడ విద్యార్థులతో పరిచయం ఏర్పడటంతో ఇక్కడే చదువుకున్నాను. గురుకులాల్లో చదువుకుంటే క్రమశిక్షణ అలవడుతుంది. అందరితో కలిసిపోతాం. తారతమ్యాలు ఉండవ'ని అన్నారు. గురుకులాలకు ఆద్యుడు పీవీ అని కొనియాడారు. తాను ఈ స్థాయిలో ఉండటానికి గురుకులాల్లో చదువుకోవడమే కారణమని శ్రీనివాసరాజు చెప్పారు.

అదంతా ప్రైవేట్ కాలేజీల

తప్పుడు ప్రచారం

తనిఖీల సమయంలో లావాదేవీలేమీ జరగలేదు

హైదరాబాద్‌లో ఉన్నది రెండు వాహనాలు మాత్రమే

క్యాంపు ఆఫీసు కార్యకలాపాల కోసమే వాడుతున్నాం

'ప్రైవేటుగా వసూళ్లు'పై హెల్త్ యూనివర్సిటీ వివరణ

"ఆంధ్రజ్యోతి" కథనంపై సీఎం కార్యాలయం ఆరా

నివేదిక ఇవ్వాలని ఆరోగ్య శాఖ కార్యదర్శికి ఆదేశం


హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు వైద్య కళాశాలల్లో తనిఖీలకు ముందు గానీ, తర్వాత గానీ ఎలాంటి ఆర్థిక లావాదేవీలు జరగలేదని కాళోజీ ఆరోగ్య విశ్వ విద్యాలయం పేర్కొంది. కొన్ని ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు వర్సిటీపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆరోపించింది. "ఆంధ్రజ్యోతి"లో శనివారం "ప్రైవేటుగా వసూళ్లు" శీర్షికన ప్రచురితమైన కథనంపై హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వివరణ ఇచ్చారు. వర్సిటీ మూడు ప్రభుత్వ వాహనాలను వినియోగించడం లేదని, రెండింటినే వాడుతోందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో క్యాంపు కార్యాలయాన్ని ఏర్పాటు చేశామని, అక్కడే రెండు ప్రభుత్వ వాహనాలను వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒకటి క్యాంపు కార్యాలయ పనులు నిమిత్తం, మరొకటి హైదరాబాద్, వరంగల్‌లో పలు సమావేశాలకు హాజరయ్యేందుకు వీసీ వినియోగిస్తున్నట్లు తెలిపారు. స్టైపెండ్ విషయంలో పలు కాలేజీల విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయని, వాటి ఆధారంగా తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఆయా తనిఖీల్లో చాలా కాలేజీలు స్టైపెండ్ చెల్లించడం లేదని గుర్తించామని, కొన్నింటిలో నిబంధనల మేరకు రోగులు, పడకలు లేవని, సర్జరీలు కూడా జరగడం లేదని తెలిపారు. తనిఖీల సందర్భంగా డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణల్లో నిజం లేదని స్పష్టం చేశారు. కాగా, "ఆంధ్రజ్యోతి" కథనంపై ముఖ్యమంత్రి కార్యాలయం ఆరా తీసింది. ఆయా అంశాలపై తక్షణమే విచారణ జరిపి, ప్రాథమిక నివేదిక ఇవ్వాలని ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తును సీఎంవో ఆదేశించింది. సీఎంవో ఆదేశాల మేరకు అందుబాటులో ఉన్న ఉన్నతాధికారులను హెల్త్ సెక్రటరీ రంగంలోకి దించారు. "ఆంధ్రజ్యోతి" కథనంలో పేర్కొన్న ఒక్కో అంశంపై సమాచారాన్ని సేకరించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ప్రైవేటు వైద్య కళాశాలలకు తనిఖీలకు వెళ్లిన అధ్యాపకుల వివరాలను తెప్పించుకున్నట్లు సమాచారం.

జగన్‌మోహన్ కస్టడీ, బెయిల్ పిటిషన్లపై వాదనలు

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ)లో నిధుల దుర్వినియోగం, అక్రమాలు, ఫోర్జరీ కేసులో అరెస్టయిన హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్ మోహన్‌రావుతో పాటు ఐదుగురిని పది రోజుల కస్టడీ కోరుతూ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌పై మల్కాజిగిరి కోర్టులో శనివారం వాదనలు జరిగాయి. అదే సమయంలో నిందితులు బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. ఇరువర్గాల వాదనలు విన్న జడ్జి విచారణను సోమవారానికి వాయిదా వేశారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

పవర్‌ఫుల్ పాత్రలో



రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమా 'పెద్ది'. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థల సమర్పణలో వృద్ధి సినిమాస్ బేనర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా ఫస్ట్ షాట్ గ్లింప్స్‌తో దేశవ్యాప్తంగా అంచనాలను పెంచేసింది. కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ ఈ చిత్రంలో 'గౌర్నాయుడు' అనే పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో కనిపించబోతున్నారు. శనివారం ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా శివరాజ్‌కుమార్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ని మేకర్స్ రిలీజ్ చేశారు. కాగా, ఈ సినిమాలో రామ్‌చరణ్ సరసన కథానాయికగా జాన్వీకపూర్ నటిస్తున్నారు. జగపతి బాబు, దివ్యేంద్రు శర్మ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 27న రామ్‌చరణ్ పుట్టిన రోజు సందర్భంగా సినిమా విడుదల కానుంది.

కథ విని ఉద్వేగానికి లోనయ్యా

- సెంథిల్ కుమార్



'ఒక సినిమా అంగీకరించే ముందు కథలో ప్రేక్షకులను కదిలించే బలమైన భావోద్వేగాలు ఉన్నాయా, లేవా? అని చూస్తాను. 'జూనియర్' సినిమా స్క్రిప్ట్ నాకు బాగా నచ్చింది. కథ విని ఉద్వేగానికి లోనయ్యా. బలమైన భావోద్వేగాలతో పాటు ప్రేమ, కుటుంబ విలువలతో సినిమా ఆద్యంతం హృద్యంగా ఉంటుంది' అని సినిమాటోగ్రాఫర్ సెంథిల్ కుమార్ అన్నారు. గాలి జనార్ధన్‌రెడ్డి తనయుడు కిరీటి రెడ్డి కథానాయకుడిగా నటించిన చిత్రమిది. రాధాకృష్ణ దర్శకత్వంలో రజనీ కొర్రపాటి నిర్మించారు. ఈ నెల 18న 'జూనియర్' విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ అందించిన సెంథిల్ కుమార్ మీడియాతో మాట్లాడారు. 'దర్శకుడు రాధాకృష్ణ చెప్పిన కథ నాకు బాగా నచ్చింది. కొత్త హీరోకు ఇలాంటి సినిమా చేయడం కొంచెం కష్టమే. కానీ కిరీటి ఒక సవాల్‌గా తీసుకొని ఈ సినిమా కోసం కష్టపడిన తీరు నాకు నచ్చింది. ఈ సినిమాలో పాటలతో పాటు కిరీటీ, శ్రీలీల జంట చేసిన డాన్స్‌లను ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారు. కిరీటి మంచి నటుడు, అద్భుతమైన డాన్సర్. సెట్స్‌లో చాలా కష్టపడ్డాడు. తొలి చిత్రం 'జూనియర్'తోనే ఆయన ప్రేక్షకులను ఆకట్టుకుంటాడనే గట్టి నమ్మకం ఉంది. ఒక మంచి సినిమా అందించాలనే తపనతో నిర్మాతలు ఈ సినిమా తీశారు' అని చెప్పారు.

బ్యూటిఫుల్ మెలోడీ



రష్మిక మందన్న, దీక్షిత్ శెట్టి ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న చిత్రం 'ద గర్ల్‌ఫ్రెండ్'. 'చి ల సౌ'తో జాతీయ అవార్డు అందుకున్న రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. గీతా ఆర్ట్స్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను పెంచేసింది. ఈ నెల 16న సినిమా నుంచి 'నదివే' అంటూ సాగే పాటను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. ఈ బ్యూటిఫుల్ మెలోడీకి హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందించారు. త్వరలోనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కృష్ణన్ వసంత్.

యాక్టర్స్‌ని తిట్టాను.. కొట్టాను..

ప్రవీణ పరుచూరి



'మా 'కొత్తపల్లిలో ఒకప్పుడు' సినిమాలో రెండు పాత్రల మధ్య నడిచే సన్నివేశాలు కీలకంగా నిలుస్తాయి. వారి మధ్య వచ్చే సన్నివేశాలు అద్భుతంగా రాకపోతే సినిమా సాదాసీదాగా ఉంటుంది. అందుకే వారి నుంచి మంచి నటన రాబట్టాలనుకున్నాను. సెట్‌లో వారిని తిట్టాను, కొట్టాను, వారిపై రాళ్లు విసిరాను. మనం చేసే పాత్రలో జీవించడమే నటన అని నమ్ముతాను. అందుకే సినిమా కోసం ఏదైనా సరే తప్పదు. అందుకే వారిపట్ల అలా ప్రవర్తించినందుకు క్షమాపణలు చెప్పలేదు' అని దర్శకురాలు ప్రవీణ పరుచూరి చెప్పారు. రానా సమర్పణలో మనోజ్ చంద్ర, మోనికా జంటగా ప్రవీణ తెరకెక్కించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మనోజ్ చంద్ర మాట్లాడుతూ 'ప్రవీణ చేసే సినిమాల్లో నటిస్తే సరిపోదు, పాత్రల్లో జీవించాలి. అలా రామకృష్ణ పాత్రకు నేను ప్రాణం పోశానని నమ్ముతున్నాను' అని చెప్పారు.

స్నేహితులే రాజకీయ ప్రత్యర్థులు



ఆది పినిశెట్టి, చైతన్య రావు ప్రధాన పాత్రల్లో 'ప్రస్థానం' ఫేమ్ దేవా కట్టా, జయకిరణ్‌కుమార్ సంయుక్తంగా తెరకెక్కించిన వెబ్ సిరీస్ 'మయసభ'. 'రైజ్ ఆఫ్ ద టైటాన్స్' ట్యాగ్‌లైన్. విజయ్‌కృష్ణ లింగమనేని, శ్రీహర్ష నిర్మించారు. ఆగస్టు 7న ఓటీటీ వేదిక సోనీ లైవ్ ద్వారా అందుబాటులోకి రానుంది. తాజాగా, టీజర్‌ను విడుదల చేశారు. సంభాషణలు, ప్రధాన పాత్రధారుల మధ్య ఉన్న సంఘర్షణ, భావోద్వేగాలు ఆకట్టుకున్నాయి. ఇద్దరు స్నేహితులు కొన్ని పరిస్థితుల వల్ల రాజకీయ ప్రత్యర్థులుగా మారితే ఎలా ఉంటుందనేది కథాంశం. అయితే వీరిద్దరి పాత్రలు ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, మాజీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.యస్. రాజశేఖర్ రెడ్డిని పోలి ఉంటాయని సమాచారం.

చెన్నైలో తెలుగు అబ్బాయి కథ



సంతోష్ శోభన్ హీరోగా నటిస్తోన్న చిత్రం 'కపుల్ ఫ్రెండ్లీ'. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ తెలుగు, తమిళ భాషల్లో నిర్మిస్తోంది. మ్యూజికల్ రొమాంటిక్ లవ్‌స్టోరీగా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. శనివారం సంతోష్ శోభన్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు చెబుతూ చిత్రబృందం స్పెషల్ పోస్టర్‌ని రిలీజ్ చేసింది. పోస్టర్‌లో చెన్నైలో జీవనం కొనసాగిస్తున్న మధ్యతరగతి తెలుగు అబ్బాయిగా సంతోష్ శోభన్ కనిపిస్తున్నారు. చెన్నై నగరం బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ ప్రేమ కథా చిత్రం ప్రేక్షకులకు మంచి అనుభూతిని కలిగిస్తుందని చిత్రబృందం పేర్కొంది.

20 ఏళ్ల కుర్రోడికి.. 60 లక్షల ప్యాకేజీ!

జేఎన్‌టీయూలో బీటెక్ (ఏఐఎంఎల్) ఫైనల్ చదువుతున్న షేక్ సోహెల్‌కు బంపర్ ఆఫర్



షేక్ సోహెల్

హైదరాబాద్ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆ అబ్బాయికి నెలకు రూ.2 లక్షల ఉపకారవేతనం, అదనంగా రూ.60 లక్షల వేతన ప్యాకేజీ కూడా! ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ (ఏఐఎంఎల్)తో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న 20 ఏళ్ల విద్యార్థికి ఓ సాఫ్ట్‌వేర్ సంస్థ ఇచ్చిన ఆఫర్ ఇది! నగరంలోని జేఎన్‌టీయూలో చదువుతున్న షేక్ సోహెల్ అనే విద్యార్థిదీ అదృష్టం. ప్రఖ్యాత సాఫ్ట్‌వేర్ అండ్ ఫైనాన్షియల్ ట్రేడింగ్ కంపెనీ 'డీఈ షా' ఆఫర్ చేసిన ఒకే ఒక్క ఉద్యోగానికి కంప్యూటర్ సైన్స్, ఏఐఎంఎల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగాల నుంచి మొత్తంగా 200 మంది విద్యార్థులు పోటీపడ్డారు. వివిధ దశల్లో వడపోతల అనంతరం ఫైనల్ ఇంటర్వ్యూలో సోహెల్ టాపర్‌గా నిలిచారు. ఎంత పరిజ్ఞానం ఉందనే విషయం కన్నా.. ఇచ్చిన సమస్యను తాను పరిష్కరించిన తీరు డీఈ షా కంపెనీ ప్రతినిధులను ఆకట్టుకుందని సోహెల్ చెప్పారు. ఇచ్చిన 30 నిమిషాల గడువులోనే అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి అందరికన్నా ఎక్కువ మార్కులు తెచ్చుకున్నానని వివరించారు. ఉన్నత చదువుతో చక్కని ఉద్యోగం సాధించాలనే తన కల దిశగా రెక్కలు ఇచ్చి.. ఎగిరేలా స్ఫూర్తినిచ్చింది హైదరాబాదేనని సోహెల్ చెప్పారు. తమ స్వస్థలం ఖమ్మం జిల్లా అని, తాను తీవ్ర ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న కుటుంబం నుంచి వచ్చానని చెప్పారు. తండ్రి బడేమియా ఆరేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందడంతో తల్లి చాన్‌బాను అన్నీతానై చూసుకుందని.. తన ఈ విజయంలో ఆమె మద్దతు ఎంతో ఉందని వివరించారు.

బీమా చేయించి.. వాహనంతో ఢీ కొట్టించి..

- అత్తను హత్య చేయించిన అల్లుడు..
- దర్యాప్తులో తేలిన పన్నాగం

సిద్దిపేట క్రైం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బీమా డబ్బుల కోసం ఓ అల్లుడు దివ్యాంగురాలైన తన సొంత అత్తను హత్య చేయించాడు. అనంతరం దాన్ని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి అందరినీ నమ్మించేందుకు ప్రయత్నించాడు. పోలీసుల దర్యాప్తులో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. సిద్దిపేట జిల్లా తొగుట మండలం పెద్ద మాసాన్‌పల్లిలో ఈ నెల 7న జరిగిన ఈ ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. తొగుట మండలం పెద్ద మాసాన్‌పల్లికి చెందిన తాళ్ల వెంకటేశ్‌కు తాటికొండ రామమ్మ కుమార్తెతో వివాహం జరిగింది. పౌల్ట్రీఫాం వ్యాపారంతో పాటు వ్యవసాయంలో సుమారు రూ.22 లక్షల వరకు వెంకటేశ్ నష్టపోయాడు. అప్పులు పెరగడం, వ్యాపారంలో నష్టం రావడంతో దివ్యాంగురాలైన తన అత్త పేరిట బీమా చేయించి, చంపేసి ప్రమాదంగా చిత్రీకరిస్తే డబ్బులు వస్తాయని భావించాడు. పథకం ప్రకారం అత్త తాటికొండ రామమ్మ పేరిట పోస్టాఫీసులో సంవత్సరానికి రూ.755 కట్టి రూ.15 లక్షల బీమా, ఎస్‌బీఐలో సంవత్సరానికి రూ.2000 కట్టి నలభై లక్షల యాక్సిడెంట్ బీమా చేయించాడు. రైతు బీమాకు సంబంధించి రూ.5 లక్షలు వస్తాయని తన స్నేహితుడు కరుణాకర్ తండ్రి పేరిట ఉన్న 28 గుంటల భూమిని తన అత్త రామమ్మ పేరు మీద రాయించాడు. అనంతరం ఆమెను చంపేందుకు తన స్నేహితుడు తాళ్ల కరుణాకర్ సాయం తీసుకున్నాడు. కరుణాకర్ అప్పటికే వెంకటేశ్ నుంచి రూ. 1లక్ష 30 వేలు అప్పు తీసుకొని ఉన్నాడు. తన అత్తను చంపేందుకు సహకరిస్తే తనకు ఇవ్వాల్సిన నగదును ఇచ్చే అవసరం లేదని కరుణాకర్‌కు వెంకటేశ్ చెప్పడంతో ఈ పనికి అతడు అంగీకరించాడు. బీమా డబ్బు చేతికి అందిన తర్వాత వారిద్దరూ సమానంగా పంచుకునేందుకు ఒప్పందం చేసుకున్నారు. పథకంలో భాగంగా ఈ నెల 7న వెంకటేశ్, కరుణాకర్‌కు ఫోన్ చేసి తన అత్తను పెద్దమాసాన్‌పల్లికి తీసుకువస్తున్నట్లు చెప్పాడు. వెంటనే కరుణాకర్ సిద్దిపేటలో రూ.2,500లు చెల్లించి కారు అద్దెకు తీసుకున్నాడు. కారు నంబర్ కనిపించకుండా దానికి టీఆర్ నంబర్ స్టిక్కర్ అతికించాడు. అనంతరం తుక్కాపూర్ వచ్చి వెంకటేశ్ కోసం వేచి చూశాడు. వెంకటేశ్ తన అత్త రామవ్వను వారి వ్యవసాయ భూమి వద్ద రోడ్డు పక్కన కూర్చోబెట్టి.. పొలంలోకి వెళ్లగా కరుణాకర్ కారుతో ఢీ కొట్టి ఆమెను చంపేశాడు. అనంతరం టీఆర్ స్టిక్కర్ తీసేసి సిద్దిపేటకు వెళ్లి కారు అప్పగించాడు. గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో తన అత్త రామమ్మ మృతి చెందిందని వెంకటేశ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారి దర్యాప్తులో అసలు విషయం వెలుగులోకి వచ్చింది.



కృష్ణా నదిలో బండ పైకి చేరిన తాతప్ప

సెల్ఫీ దిగుదామని చెప్పి.. భర్తను కృష్ణా నదిలోకి తోసిన భార్య

కృష్ణ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆ దంపతులకు రెండు నెలల క్రితమే వివాహమైంది. కొత్త జంట అత్తారింటి నుంచి భర్త గ్రామానికి బైక్‌పై బయలుదేరింది. దారిలో పరవళ్లు తొక్కుతున్న కృష్ణా నది చూడముచ్చటగా కనిపించింది. దీంతో అక్కడ సెల్ఫీ దిగుదామని భర్తను భార్య కోరింది. కాదనలేక బ్రిడ్జిపై బైక్ నిలిపిన భర్త.. ఫొటో దిగేందుకు భార్య పక్కన చేరాడు. సెల్ఫీ క్లిక్‌మని అన్నదో లేదో.. అనూహ్యంగా బ్రిడ్జిపై నుంచి భర్తను నదిలో తోసేసింది భార్య. సెల్ఫీ పేర భార్య చేసిన ఈ అఘాయిత్యం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కర్ణాటక లోని దేవసూగూరు గ్రామానికి చెందిన తాతప్ప తన భార్య సుమంగళతో కలిసి ద్విచక్ర వాహనంపై భార్య స్వగ్రామం లింగసూగూరు నుంచి బయలుదేరాడు. నారాయణపేట జిల్లా సరిహద్దు కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా కడలూరు గ్రామ శివారులోని కృష్ణానదిపై ఉన్న గుర్జాపూర్ రోడ్ కం బ్యారేజ్ వద్దకు రాగానే సెల్ఫీ దిగుదామని భర్తను భార్య కోరింది. దీంతో బైక్‌ను పక్కన నిలిపి వచ్చాడు తాతప్ప. ఈ క్రమంలో సెల్ఫీ దిగుతుండగా భర్తను నదిలోకి తోసింది సుమంగళ. నీటిలో కొట్టుకుపోయిన తాతప్ప.. ఈదుకుంటూ మధ్యలో ఉన్న బండరాళ్లపైకి వెళ్లాడు. అక్కడ నిలబడి సహాయం కోసం కేకలు వేశాడు. దీంతో బ్రిడ్జిపై వెళుతున్న యువకులు అతడిని గమనించారు. అతడిని లాగేందుకు తాడు తెచ్చారు. సుమారు 100 మీటర్ల దూరంలో నది మధ్యలో రాళ్లపై ఉన్న తాతప్పకు అందేలా బ్రిడ్జిపై నుంచి తాడును వేశారు. ఆ తాడును అతడు నడుముకు కట్టుకోగా.. యువకులు బ్రిడ్జి పైకి లాగి రక్షించారు. సెల్ఫీ దిగుదామని అనడంతో.. భార్య తనను చంపడానికి సిద్ధంగా ఉందని అప్పటికే అనుమానం వచ్చిందని తాతప్ప ఆవేదన వ్యక్తంచేశాడు. అతడి భార్య మాత్రం ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడని చెబుతోంది. అనంతరం భార్యాభర్తలిద్దరూ కలిసి బైక్‌పై దేవసూగూరుకు వెళ్లారు.

స్పోర్ట్స్

హైదరాబాద్ ● ఆదివారం 13 జూలై 2025

యువ భారత్ 450/7

ఇంగ్లండ్ అండర్-19తో యూత్ టెస్టు

బెకెన్‌హామ్: ఆయుష్ మాత్రే (102) శతకంతో పాటు మిగతా బ్యాటర్లు రాణించడంతో.. ఇంగ్లండ్ అండర్-19తో తొలి అనధికార యూత్ టెస్టులో భారత యువ జట్టు భారీ స్కోరు చేసింది. శనివారం మొదలైన టెస్టులో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న భారత అండర్-19 జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్లకు 450 పరుగులు చేసింది. ఆట చివరకు అంబ్రిష్ (31), హనీల్ పటేల్ (6) క్రీజులో ఉన్నారు. అభిజ్ఞాన్ కుందు (90), రాహుల్ కుమార్ (85), విహాన్ మల్హోత్రా (67) హాఫ్ సెంచరీలు సాధించారు. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (14) స్వల్ప స్కోరుకే అవుటయ్యాడు.

హంపి, హారికకు డ్రా

బటూమి (జార్జియా): ఫిడే మహిళల చెస్ వరల్డ్‌కప్‌లో తెలుగు గ్రాండ్ మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారికకు డ్రాలే ఎదురయ్యాయి. శనివారం జరిగిన మూడో రౌండ్ తొలి గేమ్‌లో కులోన్ క్లాడియా (పోలెండ్)తో హంపి, స్త్రవోలా (గ్రీస్)తో హారిక పాయింట్ పంచుకొన్నారు. ఇంజాక్ (సెర్బియా)పై దివ్య దేశ్‌ముఖ్, కేటరీనాపై వంతిక అగర్వాల్ నెగ్గగా.. యప్ కరీసా (అమెరికా)తో గేమ్‌ను వైశాలి డ్రాగా ముగించింది. ఆదివారం మూడో రౌండ్ రెండో గేమ్ జరగనుంది.


సెలీసియా డైమండ్ లీగ్‌లో

నీరజ్, అర్షద్ అమీతుమీ

సెలీసియా (పోలెండ్): క్రికెట్‌లో భారత్, పాకిస్థాన్ మధ్య పోటీ ఎప్పుడూ ఆసక్తికరమే. అది ఇప్పుడు జావెలిన్ త్రో క్రీడకు కూడా పాకింది. వచ్చే నెల 16న పోలెండ్‌లోని సెలీసియాలో జరిగే డైమండ్ లీగ్‌లో వరల్డ్ చాంపియన్ నీరజ్ చోప్రా, ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత అర్షద్ నదీమ్ (పాకిస్థాన్) తలపడనున్నారు. పారిస్ విశ్వక్రీడల తర్వాత వీరిద్దరూ పోటీపడడం ఇదే తొలిసారి కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ ఏడాది గాయంతో అర్షద్ కొన్నాళ్లు టోర్నీలకు దూరం కాగా.. నీరజ్ వరుస టైటిళ్లతో ఫుల్‌ఫామ్‌లో ఉన్నాడు. నిరుడు పారిస్ విశ్వక్రీడల్లో అర్షద్ స్వర్ణం గెలిస్తే, నీరజ్ రజతంతో సరిపెట్టుకున్న సంగతి తెలిసిందే.

హాకీ జట్టు హ్యాట్రిక్ గెలుపు

ఐంథోవెన్ (నెదర్లాండ్స్): యూరప్ పర్యటనలో భారత 'ఎ' హాకీ జట్టు హ్యాట్రిక్ విజయం నమోదు చేసింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో 3-2తో ఫ్రాన్స్‌ను ఓడించింది. ఫార్వర్డ్ ఆదిత్య అర్జున్ రెండు గోల్స్ చేయగా, మరో గోల్‌ను బాబీ సింగ్ సాధించాడు. ఈ పర్యటనలో భాగంగా.. ఇప్పటికే ఐర్లాండ్‌తో రెండు మ్యాచుల్లో భారత్ గెలిచింది.



పంత్ (74)

జడేజా (72)

రాహుల్ (100)



1 ఇంగ్లండ్‌పై టెస్టుల్లో ఎక్కువ సిక్సర్లు (35) బాదిన ప్లేయర్‌గా వివ్ రిచర్డ్స్ (34)ను అధిగమించిన రిషభ్ పంత్. అలాగే ఇంగ్లండ్‌లో ఎక్కువ (8) 50+ స్కోర్లు సాధించిన పర్యాటక జట్టు వికెట్ కీపర్‌గా ధోనీతో సమంగా నిలిచిన పంత్.

విదేశాల్లో జరిగిన టెస్టు సిరీస్‌లో ఎక్కువ సిక్సర్లు (36) బాదిన జట్టుగా భారత్.

2 లార్డ్స్‌లో ఎక్కువ శతకాలు (2) బాదిన రెండో భారత ఆటగాడిగా రాహుల్. దిలీప్ వెంగ్‌సర్కార్ (3) ముందున్నాడు.

సమంగా నిలిచారు

- భారత్ తొలి ఇన్నింగ్స్ 387
- రాహుల్ శతకం
- రాణించిన పంత్, జడేజా
- ఇంగ్లండ్‌తో మూడో టెస్టు

లండన్: ఐదు టెస్టుల సిరీస్‌లో లార్డ్స్ మ్యాచ్ అత్యంత రసవత్తరంగా సాగుతోంది. మూడో టెస్టులో శనివారం కేఎల్ రాహుల్ (100) శతకంతో సత్తా చాటగా.. రిషభ్ పంత్ (74), జడేజా (72) అర్ధసెంచరీలతో ఆకట్టుకున్నారు. అయితే ఆఖర్లో ఇంగ్లండ్ పేసర్లు దెబ్బతీయడంతో గిల్ సేన పైచేయి సాధించే అవకాశాన్ని కోల్పోయింది. దీంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 387 పరుగులే చేయగలిగింది. ఇంగ్లండ్ కూడా తమ ఇన్నింగ్స్‌లో ఇంతే స్కోరు చేసిన విషయం తెలిసిందే. దీంతో ఇరు జట్లలో ఎవరికీ ఆధిక్యం లభించలేదు. పేసర్లు వోక్స్‌కు మూడు.. స్టోక్స్, ఆర్చర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఇక రెండో సెషన్‌లో కేవలం ఒకే ఓవర్ ఆడిన ఇంగ్లండ్ మూడో రోజును వికెట్ నష్టపోకుండా 2 పరుగులతో ముగించింది. అయితే మరో ఓవర్‌కు వెళ్లకూడదనే ఉద్దేశంతో ఓపెనర్లు క్రాలే (2 బ్యాటింగ్), డకెట్ (0 బ్యాటింగ్) సమయాన్ని వృఽథా చేయడంతో భారత్ ఆటగాళ్లు వారిని గేలి చేయడం కనిపించింది.

నొప్పిని భరిస్తూనే..: 145/3 ఓవర్‌నైట్ స్కోరుతో మూడో రోజు భారత్ తొలి ఇన్నింగ్స్ ఆరంభించగా, రాహుల్-పంత్ జోడీ ఇంగ్లండ్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంది. సెషన్ తొలి ఓవర్‌లోనే పంత్ రెండు ఫోర్లు సాధించాడు. కానీ ఆ తర్వాత అర్ధగంట సేపు ఇద్దరూ ఆచితూచి ఆడడంతో మరో బౌండరీ రాలేదు. ఓ దశలో వరుసగా ఐదు ఓవర్లలో సింగిల్ రన్ కూడా తీయలేదు. చివరకు పేసర్ కార్స్ ఓవర్‌లో రాహుల్ హ్యాట్రిక్ ఫోర్లతో ఆకట్టుకున్నాడు. ఇక డ్రింక్స్ తర్వాత స్టోక్స్ వేసిన ఓవర్‌లో బంతి పంత్ చేతివేలికి తాకడంతో ఫిజియోతో చికిత్స తీసుకున్నాడు. నొప్పిని భరిస్తూనే అదే ఓవర్‌లో పంత్ సిక్సర్‌తో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. స్టోక్స్ తర్వాతి ఓవర్‌లోనూ పంత్ గ్లోవ్స్‌కు బంతి తాకడంతో మరోసారి ఫిజియో రావాల్సి వచ్చింది. అయినా బషీర్ ఓవర్‌లోనూ తను సిక్సర్ బాదాడు. ఇక

ఎవరికీ దక్కని ఆధిక్యం

సెషన్ ఆఖరి ఓవర్‌లో పంత్ అనవసర రన్ కోసం వెళ్లగా, షార్ట్ కవర్స్ నుంచి స్టోక్స్ సూపర్ త్రో కారణంగా రనౌటయ్యాడు. దీంతో నాలుగో వికెట్‌కు 141 పరుగుల భాగస్వామ్యం ముగిసింది.

నిదానంగా..: టీ బ్రేక్ సమయానికి 98 రన్స్‌తో ఉన్న రాహుల్ ఈ సెషన్ రెండో ఓవర్‌లోనే టెస్టు కెరీర్‌లో పదో శతకం పూర్తి చేశాడు. కానీ తర్వాతి ఓవర్‌లోనే స్లిప్‌లో బ్రూక్‌కు క్యాచ్ ఇవ్వడంతో తన నిలకడైన ఇన్నింగ్స్ ముగిసింది. స్పిన్నర్ బషీర్ ఈ వికెట్ తీశాడు. ఆ తర్వాత జడేజా-నితీశ్ (30) వికెట్ కాపాడుకునేందుకే ప్రాధాన్యం ఇవ్వడంలో పరుగులు నెమ్మదించాయి. దీనికి తోడు ఇద్దరి మధ్య సమన్వయలోపం కారణంగా మూడుసార్లు నితీశ్ రనౌటయ్యే ప్రమాదం నుంచి బయటపడడం గమనార్హం. ఆర్చర్ బౌన్స్‌తో ఈ జోడీని ఇబ్బందిపెట్టాడు. కొత్త బంతిని తీసుకున్నా బౌలర్లు వికెట్‌ను తీయలేకపోయారు. అయితే స్టోక్స్ ఓవర్‌లో బౌన్సర్ నితీశ్ హెల్మెట్‌కు బలంగా తాకడంతో ఫిజియో వచ్చి పరిశీలించాడు. ఈ సెషన్‌లో 68 పరుగులే సమకూరాయి.

వికెట్లు టపటపా: ఆఖరి సెషన్‌లో భారత్ 71 పరుగులు సాధించినా మిగిలిన ఐదు వికెట్లను కోల్పోయింది. దీంతో సరిగ్గా ప్రత్యర్థి స్కోరు దగ్గరే ఆగిపోవాల్సి వచ్చింది. నితీశ్‌ను ఆరంభంలోనే స్టోక్స్ అవుట్ చేయగా ఆరో వికెట్‌కు 72 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత జడ్డూకు సుందర్ (23) జత కలవడంతో స్కోరులో కాస్త కదలిక వచ్చింది. కార్స్ ఓవర్‌లో జడేజా రెండు ఫోర్లు బాదగా, రూట్ ఓవర్‌లో సుందర్ 4,6తో ఆకట్టుకున్నాడు. అయితే సెంచరీ వైపు సాగుతున్న జడేజాను వోక్స్ అవుట్ చేయడంతో ఏడో వికెట్‌కు 50 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అయితే అదే ఓవర్‌లో ఆకాశ్ (7)ను ఎల్బీగా అంపైర్ రెండుసార్లు ప్రకటించినా రివ్యూ ద్వారా బతికిపోయాడు. కానీ, రెండు పరుగుల వ్యవధిలోనే ఆకాశ్, బుమ్రా (0), సుందర్ పెవిలియన్ చేరడంతో భారత్ ఇన్నింగ్స్ ముగిసింది.

స్కోరుబోర్డు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 387

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) బ్రూక్ (బి) ఆర్చర్ 13; రాహుల్ (సి) బ్రూక్ (బి) బషీర్ 100; కరుణ్ (సి) రూట్ (బి) స్టోక్స్ 40; గిల్ (సి) స్మిత్ (బి) వోక్స్ 16; పంత్ (రనౌట్/స్టోక్స్) 74; జడేజా (సి) స్మిత్ (బి) వోక్స్ 72; నితీశ్ (సి) స్మిత్ (బి) స్టోక్స్ 30; సుందర్ (సి) బ్రూక్ (బి) ఆర్చర్ 23; ఆకాశ్ (సి) బ్రూక్ (బి) కార్స్ 7; బుమ్రా (సి) స్మిత్ (బి) వోక్స్ 0; సిరాజ్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 119.2 ఓవర్లలో 387 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-13, 2-74, 3-107, 4-248, 5-254, 6-326, 7-376, 8-385, 9-387, 10-387. **బౌలింగ్:** వోక్స్ 27-5-84-3; ఆర్చర్ 23.2-6-52-2; కార్స్ 24-5-88-1; స్టోక్స్ 20-4-63-2; బషీర్ 14.5-2-59-1; రూట్ 10.1-0-35-0.


ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: క్రాలే (బ్యాటింగ్) 2; డకెట్ (బ్యాటింగ్) 0; **మొత్తం: ఒక ఓవర్‌లో 2/0. బౌలింగ్:** బుమ్రా 1-0-2-0.

సురేఖ 'ట్రిపుల్'

- రెండు రజతాలు, ఓ కాంస్యం కైవసం
- ఆర్చరీ ప్రపంచ కప్ స్టేజ్-4



మాడ్రిడ్: కీలక తరుణంలో ఒత్తిడికి చిత్తయిన భారత స్టార్ ఆర్చర్ జ్యోతి సురేఖ త్రుటిలో రెండు స్వర్ణాలను చేజార్చుకొంది. ఆర్చరీ ప్రపంచ కప్ స్టేజ్-4 పోటీల్లో కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో రజతం సొంతం చేసుకొన్న విజయవాడ ఆర్చర్ జ్యోతి.. టీమ్ ఈవెంట్‌లో మరో రజతం సాధించింది. అయితే, మిక్స్‌డ్ కాంస్య పోరులో జ్యోతి ద్వయం విజయం సాధించింది. మొత్తంగా జ్యోతి సురేఖ ఒక్కరోజే రెండు రజతాలు, ఓ కాంస్యంతో కలిపి మూడు పతకాలు కొల్లగొట్టింది. ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్-4లో శనివారం జరిగిన కాంపౌండ్ మహిళల వ్యక్తిగత విభాగం ఫైనల్లో సురేఖ 147-148తో ఎల్లా గిబ్సన్ (బ్రిటన్) చేతిలో పరాజయం పాలై రజతంతో సరిపెట్టుకుంది. ఇక, మహిళల టీమ్ ఈవెంట్ టైటిల్‌పోరులో జ్యోతి, పర్ణీత్ కౌర్, ప్రీతిక ప్రదీప్‌ల త్రయం 225-227తో చైనీస్ తైపీ జట్టు చేతిలో ఓటమిపాలై రజతానికి పరిమితమైంది. మిక్స్‌డ్ కాంస్య పతక పోరులో జ్యోతి-రిషభ్ జంట 156-153తో ఎల్ సాల్వడార్‌కు చెందిన పౌలా-వ్లాదిమిర్ జోడీపై గెలిచింది.



సినర్ X అల్కారజ్

వింబుల్డన్ పురుషుల ఫైనల్ నేడు

రాత్రి 8.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో..



స్వియాటెక్ సూపర్

- తొలిసారి వింబుల్డన్ టైటిల్ కైవసం
- ఏకపక్ష ఫైనల్ విజయంతో చరిత్ర
- తేలిపోయిన అనిసిమోవా

వావ్.. స్వియటెక్‌ది ఏం ఆట! క్లే, హార్డ్ కోర్టులపై తప్ప పచ్చిక కోర్టులపై రాణించలేదన్న అపప్రథను పటాపంచలు చేసేలా ఆడింది.. ప్రత్యర్థికి ఒక్కటంటే ఒక్క గేమ్ ఇవ్వకుండా చెలరేగింది..ప్రతిష్ఠాత్మక వింబుల్డన్‌లో చరిత్ర తిరగ రాసింది.. ఫైనల్ మ్యాచ్‌ను పూర్తిగా ఏకపక్షం చేసేసి గంటలోపే ముగించింది.. తద్వారా కెరీర్‌లో తొలి ఆల్ ఇంగ్లండ్ టైటిల్‌ను ముద్దాడింది..సెమీఫైనల్లో టాప్ ర్యాంకర్ సబలెంకాపై సంచలన విజయం సాధించిన అమండా అనిసిమోవా తుదిపోరులో పూర్తిగా తేలిపోయింది.



లండన్: వింబుల్డన్ మహిళల సింగిల్స్ ట్రోఫీని ఎనిమిదో సీడ్ ఇగా స్వియటెక్ సొంతం చేసుకుంది. శనివారంనాటి ఫైనల్లో పోలెండ్ భామ 6-0, 6-0తో 13వ సీడ్ అమెరికన్ అమందా అనిసిమోవాను చిత్తు చేసింది. ఓపెన్ ఎరాలో వింబుల్డన్ ఫైనల్లో డబుల్ బాగెల్ (ఒక్క గేమ్ కూడా కోల్పోకుండా మ్యాచ్ గెలవడం) అందుకున్న తొలి క్రీడాకారిణిగా స్వియటెక్ చరిత్ర సృష్టించింది. అలాగే 1911 తర్వాత ఆల్ ఇంగ్లండ్ క్లబ్ తుదిపోరులో ఈ ఘనత సాధించిన మొదటి క్రీడాకారిణిగా నిలిచింది. ఇక..స్వియటెక్ ఓవరాల్‌గా కెరీర్‌లో ఆరో గ్రాండ్‌స్లామ్ ఖాతాలో వేసుకుంది. ఇంతకుముందు ఆమె నాలుగుసార్లు ఫ్రెంచ్ ఓపెన్ (2020, 2022, 2023, 2024), ఒకసారి యూఎస్ ఓపెన్ (2022) విజేతగా నిలిచింది. కేవలం 57 నిమిషాల్లో పూర్తయిన మ్యాచ్‌లో 24 ఏళ్ల స్వియటెక్ ధాటికి అనిసిమోవా ఎదురు నిలవలేకపోయింది. తొలి గ్రాండ్‌స్లామ్ ఫైనల్ ఆడిన 23 ఏళ్ల అనిసిమోవా పూర్తిగా తడబాటుకు లోనైంది. ఏకంగా 28 తప్పిదాలతో మూల్యం చెల్లించుకుంది.

1 వింబుల్డన్ విజేతగా నిలిచిన తొలి పోలెండ్ ప్లేయర్ (మహిళలు, పురుషులు) స్వియటెక్. మోనికా సెలెస్ (1992 లో) తర్వాత ఫైనల్ చేరిన ఆరు గ్రాండ్‌స్లామ్స్‌లోనూ గెలిచిన తొలి క్రీడాకారిణి స్వియటెక్. అలాగే మూడు కోర్టుల (హార్డ్, క్లే, పచ్చిక)పై టైటిళ్లు నెగ్గిన తొలి ప్లేయర్ కూడా.

2 1988 ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో నటాషా జ్వెరేవాపై 6-0, 6-0తో స్టెఫీ గ్రాఫ్ గెలిచాక..ఇదే స్కోరుతో మళ్లీ గ్రాండ్‌స్లామ్ తుదిపోరు నెగ్గిన రెండో ప్లేయర్ స్వియటెక్.

100 స్వియటెక్ కెరీర్‌లో 100వ గ్రాండ్‌స్లామ్ గెలుపు ఇది.సెరెనా విలియమ్స్ (116 మ్యాచ్‌లు) తర్వాత అత్యంత వేగంగా (120 మ్యాచ్‌లు) 100 గ్రాండ్‌స్లామ్ విజయాలు సాధించిన ప్లేయర్ స్వియటెక్.

జీఎస్‌టీలో నిరంతర సరఫరా (కంటిన్యుయస్ సప్లయ్) అనే కాన్సెప్ట్ ఉంది. ఏదేనీ ఒక వ్యక్తి లేదా సంస్థ నుంచి ఒక్కసారి కాకుండా నిరంతరంగా కొంతకాలం పాటు ఏదేనీ వస్తువులు లేదా సేవలను పొందితే దానిని నిరంతర సరఫరా అంటారు. ఒక సరఫరా నిరంతర సరఫరా కిందకు రావాలంటే కొన్ని నియమ నిబంధనలు ఉన్నాయి.

నిరంతర సరఫరా అంటే ?

ఇదీ GST



రాంబాబు గొండాల

ఇందులో మొదటిది కొనుగోలుదారునికి, అమ్మకందారునికి మధ్య ఆ సరఫరాకు సంబంధించి ఒక కాంట్రాక్ట్ ఉండాలి. ఉదాహరణకు ఒక పరిశ్రమకు సంబంధించి ముడి పదార్థాలు సరఫరా చేయటం, ఒక కంపెనీకి కారు లేదా సెక్యూరిటీ సేవలు ఇవ్వటంతో పాటు పైప్ ద్వారా చేసే గ్యాస్ సరఫరా ఈ కోవలోకి వస్తాయి. అలాగే ఆ సరఫరా అనేది సేవలకు సంబంధించినది అయితే సరఫరా అనేది మూడు నెలలకు మించి ఉండాలి.

మరి కంటిన్యుయస్ సప్లయ్, సాధారణ సరఫరాలో జీఎస్‌టీకి సంబంధించి ఏమైనా తేడాలు ఉన్నాయా అంటే.. అమ్మకపు విలువలోనూ, కట్టే పన్నులోనూ ఎలాంటి తేడా ఉండదు. కానీ ఇన్వాయిస్ ఇవ్వాల్సిన సమయం మారుతుంది. దీనివల్ల పన్ను కట్టాల్సిన సమయం మారుతుంది. అంటే 'టైమ్ ఆఫ్ సప్లయ్' మారుతుంది. దీన్ని వివరంగా తెలుసుకుందాం.

ఒక సరఫరాకు సంబంధించి పన్ను ఎప్పుడు కట్టాలనే విషయం టైమ్ ఆఫ్ సప్లయ్ తెలుపుతుంది. అంటే, ఒక వ్యక్తి తాను చేసిన సరఫరాకు పన్ను కట్టే ముందు ఆ సరఫరాకు సంబంధించి టైమ్ ఆఫ్ సప్లయ్ ఎప్పుడు వస్తుందో తెలుసుకోవాలి. ఉదాహరణకు సర్వీసుల విషయానికి వస్తే టైమ్ ఆఫ్ సప్లయ్ అనేది ఇన్వాయిస్ సకాలంలో ఇచ్చారా లేదా అనే దానిని బట్టి ఉంటుంది. ఇన్వాయిస్ నియమ నిబంధనల ప్రకారం ఒక సర్వీస్ పూర్తయిన తర్వాత గరిష్ఠంగా 30 రోజులలోపు ఇన్వాయిస్ ఇవ్వాలి. అలా ఇచ్చిన పక్షంలో ఇన్వాయిస్ తేదీ లేదా సరఫరాకు సబంధించిన సొమ్ము వచ్చిన తేదీ.. ఈ రెండింటిలో ఏది ముందైతే అది టైమ్ ఆఫ్ సప్లయ్ కింద పరిగణించాలి. ఒకవేళ ఇన్వాయిస్ సకాలంలో అంటే నెలలోపు ఇవ్వకుంటే అప్పుడు సర్వీస్ పూర్తయిన తేదీ లేదా పైకం వచ్చిన తేదీ.. ఈ రెండింటిలో ఏది ముందైతే అది టైమ్ ఆఫ్ సప్లయ్ అవుతుంది.

ఉదాహరణకు ఒక సర్వీస్ మార్చి 30న పూర్తయింది. దానికి సంబంధించిన అమౌంట్ జూన్ 10న వచ్చిందనుకుందాం. అలాగే ఇన్వాయిస్ ఏప్రిల్ 25న జారీ చేశాడనుకుందాం. అప్పుడు ఇన్వాయిస్ సకాలంలో అంటే 30 రోజుల లోపు ఇచ్చాడు కాబట్టి ఏప్రిల్ 25 (ఇన్వాయిస్ తేదీ), జూన్ 10 (సొమ్ము పొందిన తేదీ).. ఈ రెండింటిలో ఏది ముందయితే అది. అంటే ఏప్రిల్ 25 టైమ్ ఆఫ్ సప్లయ్ అవుతుంది. కాబట్టి ఏప్రిల్ నెల రిటర్నులో కట్టాల్సిన పన్నును చెల్లించాల్సి ఉంటుంది. అలాకాకుండా ఇన్వాయిస్ 30 రోజుల తర్వాత అంటే ఏ మే నెలలోనో ఇచ్చి ఉంటే అప్పుడు అమౌంట్ వచ్చిన తేదీ లేదా సర్వీస్ పూర్తయిన తేదీ.. ఈ రెండింటిలో ఏది ముందయితే అది టైమ్ ఆఫ్ సప్లయ్ అవుతుంది. ఈ విధంగా చూసినప్పుడు మార్చి 30 అనేది టైమ్ ఆఫ్ సప్లయ్ అవుతుంది. కాబట్టి మార్చి నెలకు సంబంధించిన రిటర్నులో చెల్లించాల్సిన మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. ఇది సాధారణ సరఫరాకు సంబంధించిన నియమం.

కంటిన్యుయస్ సప్లయ్‌లో కూడా ఇవే నిబంధనలు ఉన్నప్పటికీ ఇన్వాయిస్ జారీ చేయాల్సిన సమయంలో తేడా ఉంది. ఇక్కడ 30 రోజుల నిబంధన అమలు కాదు.

సర్వీసులకు సంబంధించి కంటిన్యుయస్ సప్లయ్‌లో ఇన్వాయిస్ జారీ చేయటానికి కొన్ని పద్ధతులు ఉన్నాయి. ఇందులో కాంట్రాక్ట్ అనేది కచ్చితంగా ఉండాలని చెప్పుకున్నాం. ఒకవేళ ఇన్వాయిస్‌లో నిర్ధారిత తేదీలలో డబ్బులు చెల్లించాలనే ఒప్పందం ఉంటే ఆ తేదీల నాడు ఇన్వాయిస్‌లు జారీ చేయాలి (డబ్బు అందినా, లేకున్నా). అలా నిర్ధారిత తేదీ లేకుంటే డబ్బులు ఎప్పుడైతే వస్తాయో ఆ తేదీ నాటికి ఇన్వాయిస్ జారీ చేసి ఉండాలి. పైన చెప్పిన ఉదాహరణ కంటిన్యుయస్ సప్లయ్ అనుకుంటే.. కాంట్రాక్ట్‌లో డబ్బులకు సంబంధించి నిర్ధారిత తేదీ లేకుంటే అప్పుడు జూన్ 10 వరకు ఇన్వాయిస్ జారీ చేయవచ్చు. ఎందుకంటే, జూన్ 10న తనకు డబ్బులు అందాయి కాబట్టి. అంటే సర్వీస్ పూర్తయిన 30 రోజుల లోపు ఇన్వాయిస్ ఇవ్వకున్నా అది సకాలంలో ఇచ్చినట్లే భావించాలి. అప్పుడు టైమ్ ఆఫ్ సప్లయ్ జూన్ నెల అవుతుంది. అదే సాధారణ సరఫరా అయితే పైన చెప్పినట్లు మార్చి నెలలోనే టైమ్ ఆఫ్ సప్లయ్ అవుతుంది.

ఇక సర్వీసులకు సంబంధించిన కంటిన్యుయస్ సప్లయ్ ఇన్వాయిస్ జారీ చేయటానికి మూడో పద్ధతి కూడా ఉంది. కొన్ని కాంట్రాక్టుల్లో నిర్ధారిత పని పూర్తయినప్పుడే డబ్బు చెల్లించేటట్లు ఒప్పందం చేసుకుంటారు. ఉదాహరణకు బిల్డింగ్ కాంట్రాక్టర్లు ఏయే పనులు పూర్తయినప్పుడు ఎంతెంత చెల్లించాలో అని కాంట్రాక్ట్‌లో పొందుపరుస్తారు. అంటే ఇక్కడ చెల్లింపు అనేది సమయాన్ని బట్టి కాకుండా పనిని బట్టి ఉంటుంది. దీన్ని ఈవెంట్‌ను బట్టి చెల్లింపు చేయటం అంటారు. ఇలాంటి సందర్భంలో ఆ ఈవెంట్ పూర్తయిన తేదీ నాటికి ఆ ఈవెంట్ వరకు ఎంత మొత్తం అవుతుందో అంత మేర ఇన్వాయిస్ ఇవ్వాల్సి ఉంటుంది (డబ్బు అందినా, లేకున్నా). అంటే సర్వీసులకు సంబంధించిన కంటిన్యుయస్ సప్లయ్‌లో ఈ మూడు సందర్భాల్లో ఇచ్చిన ఇన్వాయిస్‌లు 30 రోజులలోపు ఇవ్వనప్పటికీ సకాలంలో ఇచ్చినట్లే గుర్తించాలి. కాబట్టి టైమ్ ఆఫ్ సప్లయ్ అనేది దీని ప్రకారం మారుతుంది.

అలాగే కంటిన్యుయస్ సప్లయ్ అనేది వస్తు సరఫరాకు సంబంధించినదైతే ఇన్వాయిస్‌ల నియమ నిబంధనలు వేరే విధంగా ఉంటాయి. తదనుగుణంగా టైమ్ ఆఫ్ సప్లయ్ కూడా మారుతుంది. కాబట్టి కంటిన్యుయస్ సప్లయ్‌లో ఉండే కాంట్రాక్టర్లు ఈ విషయాలు గమనించాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

బిజినెస్ ప్లస్



అయినా.. పన్ను ప్రయోజనాలున్నాయ్

ఏ వ్యక్తికైనా ఆరోగ్య బీమా తప్పనిసరి. దేశంలో హెల్త్‌కేర్ వ్యయాలు ఏటా 14% వంతున పెరుగుతున్నాయని అంచనా. అయితే వయోవృద్ధులు లేదా సీనియర్ సిటిజన్లు పెరుగుతున్న వయసు, ముందు నుంచి ఉన్న వ్యాధుల కారణంగా అందుబాటు ప్రీమియంలలో ఆరోగ్య బీమా పొందలేక పోతున్నారు. ఈ కారణంగా ఆస్పత్రి, వైద్య పరీక్షలు, డాక్టర్ కన్సల్టేషన్ వ్యయాలన్నీ తాము పొదుపు చేసుకున్న సొమ్ము నుంచే చెల్లించాల్సి వస్తోంది. ఇలాంటి అంశాలన్నీ దృష్టిలో ఉంచుకునే ఆదాయపు పన్ను చట్టం 80డి సెక్షన్.. 60 సంవత్సరాల వయసు పైబడిన వారందరికీ ఆరోగ్య సంబంధిత వ్యయాలపై కొన్ని రాయితీలు అందిస్తోంది. పాత ఆదాయపు పన్ను విధానాన్ని ఎంపిక చేసుకున్న వారికి మాత్రమే ఈ ప్రయోజనాలు పరిమితం. దీని కింద ఆరోగ్య బీమా పాలసీ లేకపోయినా సీనియర్ సిటిజన్లు ఆరోగ్య సంబంధిత వ్యయాలపై పన్ను మినహాయింపులు కోరవచ్చు.

బీమా కవరేజీ లేని వారి మాటేమిటి?

ఆరోగ్య బీమా కవరేజీ లేని సీనియర్ సిటిజన్లకు కూడా ఈ సెక్షన్ రాయితీలు కల్పిస్తోంది. అలాంటి వారు వైద్య వ్యయాలపై ఏడాదికి గరిష్ఠంగా రూ.50,000 వరకు మినహాయింపులు క్లెయిమ్ చేసుకోవచ్చు. ఈ వ్యయాలను మీ పిల్లలు భరించినట్టయితే వారు కూడా పన్ను మినహాయింపులు పొందేందుకు అర్హులవుతారు. కేవలం 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు మాత్రమే ఈ ప్రయోజనాలు పరిమితం అన్న విషయం గుర్తుంచుకోవాలి. అంతే కాదు...నూతన, సరళీకృత ఆదాయపు పన్ను విధానం ఎంచుకున్న వారికి ఇది వర్తించదు.

80డి సెక్షన్ ఏమిటి?

పన్ను చెల్లింపుదారుల్లో అత్యంత ప్రాచుర్యం పొందిన ఈ సెక్షన్ ఆరోగ్య బీమా లేదా ఆరోగ్య సంబంధిత వ్యయాలపై రాయితీలు, మినహాయింపులు అందిస్తుంది. తద్వారా పన్ను చెల్లింపు మొత్తం ఆదా చేస్తుంది.

- ఈ సెక్షన్ కింద పన్ను చెల్లింపుదారు తనతో పాటుగా కుటుంబ సభ్యుల (భార్య లేదా భర్త, తనపై ఆధారపడిన సంతానం) ఆరోగ్య సంరక్షణకు చేసిన వ్యయాలపై లేదా ఆరోగ్య బీమా ప్రీమియంపై ఒక ఆర్థిక సంవత్సరంలో గరిష్ఠంగా రూ.25,000 వరకు పన్ను మినహాయింపు పొందవచ్చు.
- దీనికి తోడు వయోవృద్ధులైన తల్లిదండ్రుల కోసం చేసిన ఆరోగ్య సంబంధిత వ్యయాలు, ఆరోగ్య బీమా ప్రీమియంపై మరో రూ.25,000 పన్ను మినహాయింపు క్లెయిమ్ చేయవచ్చు.
- అలాగే ప్రీమియం చెల్లిస్తున్న వ్యక్తి (స్వయంగా లేదా కుటుంబ సభ్యుల కోసం) సీనియర్ సిటిజన్ అయినట్టయితే ఈ మినహాయింపు పరిమితి గరిష్ఠంగా రూ.50,000 వరకు ఉంటుంది. అంటే మీరు సీనియర్ సిటిజన్ అయి ఉండి మీ కోసం, మీ తల్లిదండ్రుల కోసం కూడా ప్రీమియం చెల్లిస్తున్నట్టయితే రూ.1 లక్ష వరకు ఆదాయపు పన్ను మినహాయింపునకు క్లెయిమ్ చేసుకోవచ్చు.
- ప్రివెంటివ్ హెల్త్ చెకప్ చెల్లింపుల (గరిష్ఠంగా రూ.5,000) కోసం చేసే వ్యయాలైతే నగదు రూపంలో చెల్లించవచ్చు. మిగతా వ్యయాలేవైనా నగదేతర రూపంలోనే చెల్లించాల్సి ఉంటుంది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	88	విజయవాడ	97
వరంగల్	88	గుంటూరు	102
కరీంనగర్	88	ఒంగోలు	105
మహబూబ్‌నగర్	88	చిత్తూరు	100
కర్నూలు	88	నెల్లూరు	105
విశాఖపట్నం	81	అనంతపురం	105
గోదావరి	97		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	99,710 ▲	91,400 ▲	1,25,000 ▲
విజయవాడ	1,01,000 ▲	95,000 ▲	1,15,000 ▲
విశాఖపట్నం	99,710 ▲	91,400 ▲	1,25,000 ▲
రాజమండ్రి	99,710 ▲	91,400 ▲	1,15,600 ▲
ప్రొద్దుటూరు	98,000 ▲	90,160 ▲	1,12,800 ▲
ముంబై	97,511 ▲	89,320 ▲	1,10,290 ▲

ఇక ఏఐ సహాయంతో తెలుగులోనే ట్యాక్స్ ఫైలింగ్

పన్ను చెల్లింపుదారులు కృత్రిమ మేధ (ఏఐ) సహాయంతో తమ మాతృభాషలోనే పన్ను రిటర్నులు దాఖలు చేసే సదుపాయాన్ని ఫిన్‌టెక్ సంస్థ క్లియర్ టాక్స్ అందుబాటులోకి తెచ్చింది. దేశంలో ఇలాంటి సదుపాయం అందుబాటులోకి తేవడం ఇదే ప్రథమం. ఇందుకుగాను ఇంగ్లీష్, తెలుగు, హిందీ, మరాఠీ, తమిళ, కర్ణాటక, బెంగాలీ భాషల్లో ఏఐ శక్తితో పని చేసే ట్యాక్స్ అసిస్టెంట్‌ను క్లియర్ టాక్స్ డిజైన్ చేసింది. పన్ను చెల్లింపుదారులు తమ మాతృభాషలో వాట్సప్, స్లాక్, మైక్రోసాఫ్ట్ టీమ్స్ లేదా క్లియర్ టాక్స్ వెబ్‌సైట్ ద్వారా చాట్ చేస్తూ రిటర్న్ దాఖలు చేయవచ్చు.

వేతన జీవులు, సాధారణ ఉద్యోగులు, ఫ్రీలాన్సర్లు, తొలిసారి పన్ను రిటర్న్ దాఖలు చేస్తున్న వారు అందరూ ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోవచ్చు. పన్ను చెల్లింపుదారులు తమ పాన్ నంబర్ ఇచ్చి ఫారం-16 జత చేస్తే చాలు.. మిగతా తతంగం అంతా ఏఐ చూసుకుంటుంది. వారికి సంబంధించిన 95% డేటాను ఐటీ శాఖ నుంచి సేకరించి ఆ వ్యక్తికి చెందిన అన్ని రకాల రాయితీలు, కోతలు వర్తింప చేసి రిటర్న్ దాఖలు చేస్తుంది.

ఐసీఐసీఐ ప్రు యాక్టివ్ మూమెంటమ్ ఫండ్

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్.. యాక్టివ్ మూమెంటమ్ ఫండ్‌ను తీసుకువచ్చింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. మార్కెట్ ధర, ట్రెండ్స్, లాభాలు తదితర అంశాల ఆధారంగా పెట్టుబడుల అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా ఈ ఫండ్‌ను రూపొందించింది. నిఫ్టీ 500 టీఆర్ఐ ఈ ఫండ్‌కు బెంచ్‌మార్క్ ఇండెక్స్‌గా ఉండనుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.5,000. ముగింపు తేదీ ఈ నెల 22.

- **బంధన్ మల్టీ ఫ్యాక్టర్ ఫండ్**

బంధన్ మ్యూచువల్ ఫండ్.. బంధన్ మల్టీ ఫ్యాక్టర్ ఫండ్‌ను ప్రారంభించింది. 250 లార్జ్, మిడ్ క్యాప్ స్టాక్స్‌ల్లో ఈ ఫండ్ పెట్టుబడులు పెడుతుంది. బీఎస్ఈ 200 టీఆర్ఐ బెంచ్‌మార్క్ ఇండెక్స్‌గా ఉండనుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 24. కనీస పెట్టుబడి రూ.1,000.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

13వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	515
వరంగల్	512	గోదావరి	490
చిత్తూరు	583	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ. 72	

కిల్లర్ స్విచ్



(మొదటి పేజీ తరువాయి)

తెలిసిందే. విమానంలోని మొత్తం 242మందిలో 11ఏ సీట్లో కూర్చున్న ఒక్కరు తప్ప మిగతా వారంతా మృతిచెందిన ఈ దుర్ఘటన భారత విమానయాన చరిత్రలోనే అతి పెద్ద విషాదాల్లో ఒకటి. ఏఏఐబీ ఈ ప్రమాదంపై సుమారు నెల రోజులపాటు యూకే విమాన ప్రమాదాల దర్యాప్తు విభాగం, అమెరికా జాతీయ రవాణా భద్రత బోర్డుల సహకారంతో క్షుణ్నంగా పరిశీలన జరిపింది. తాజాగా 15పేజీలతో ప్రాథమిక నివేదికను విడుదల చేసింది. విమానం బ్లాక్‌బాక్స్‌లో నమోదైన సాంకేతిక అంశాలు, పైలట్ల వాయిస్ రికార్డుల వివరాలనూ అందులో వెల్లడించింది.

అంతా 32 సెకన్లలోనే..

● జూన్ 12 మధ్యాహ్నం 13.38 గంటల 39 సెకన్ల సమయంలో (24 గంటల విధానం) విమానం రన్‌వే పైనుంచి గాల్లోకి ఎగిరింది. సుమారు గంటకు 333 కిలోమీటర్ల (180 నాట్స్) వేగాన్ని అందుకుంది. ఆ సమయంలో 54,200 కిలో ల ఇంధనం ఉంది. విమానం మొత్తం బరువు కూడా అనుమతించిన పరిమితిలోపు 2,13,401 కిలోలు ఉంది. వాతావరణం అనుకూలంగా ఉంది. పక్షులేవీ ఢీకొన్న ఆనవాళ్లు లేవు. విమానం రెక్కలకు ఉండే ఫ్లాప్స్ (టేకాఫ్‌కు తోడ్పడే భాగాలు), ల్యాండింగ్ గేర్ సరిగానే ఉన్నాయి.

● 13.38 గంటల 42 సెకన్ల సమయంలో విమానంలోని మొదటి ఇంజన్‌కు ఇంధనం సరఫరా చేసే స్విచ్ 'రన్' మోడ్ నుంచి 'కటాఫ్' మోడ్‌లోకి మారింది. తర్వాత ఒక్క సెకన్‌లోనే రెండో ఇంజన్ ఇంధన సరఫరా స్విచ్ కూడా 'కటాఫ్' మోడ్‌లోకి మారింది. ఇంధన సరఫరా నిలిచిపోవడంతో దాదాపు 10సెకన్ల పాటు రెండు ఇంజన్లు ఆగిపోయి.. విమానం కిందికి పడిపోవడం మొదలైంది. దీంతో పైలట్లు అప్రమత్తం అయ్యారు. ఒక పైలట్ 'ఇంధన స్విచ్ ఎందుకు ఆఫ్ చేశావు' అని ప్రశ్నించగా.. 'నేనేమీ ఆఫ్ చేయలేదు' అని మరో పైలట్ సమాధానం ఇచ్చారు.

● 13.38గంటల 52సెకన్ల సమయంలో మొదటి ఇంధన స్విచ్, 56 సెకన్ల సమయంలో రెండో స్విచ్ 'రన్' మోడ్‌లోకి మారాయి. రెండు ఇంజన్లకు ఇంధన సరఫరా మొదలైంది. మొదటి ఇంజన్ ఆన్ అయి వేగం అందుకోవడం మొదలైంది. రెండో ఇంజన్ ఆన్ అయినా వేగం పుంజుకోలేదు.

● 13.39గంటల 5సెకన్ల సమయంలో పైలట్లలో ఒకరు 'మేడే.. మేడే..' అంటూ ఏటీసీ (ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్)కి అత్యవసర సందేశం పంపారు. ఏటీసీ తిరిగి పైలట్లతో మాట్లాడటానికి ప్రయత్నించినా.. అప్పటికే సిగ్నల్స్ నిలిచిపోయాయి. తర్వాత ఆరు సెకన్లకే విమానం కూలిపోయింది. మొత్తంగా 32 సెకన్లలోనే అంతా ముగిసిపోయింది.

● విమానం వెనుకభాగంలో 'రామ్ ఎయిర్ టర్బైన్ (ర్యాట్)'గా పిలిచే చిన్నపాటి ఇంజన్ ఉంటుంది. విమానం రెండు ఇంజన్లు ఆగిపోయిన పరిస్థితి ఎదురైతే.. అది ఆటోమేటిగ్గా ఆన్ అయి కీలక భాగాలు, కమ్యూనికేషన్ పరికరాలకు విద్యుత్ అందిస్తుంది. ఎయిరిండియా విమానం కూలే ముందు ఈ ర్యాట్ ఆన్ అయింది. దీనితో రెండు ఇంజన్లు ఒక్కసారిగా ఆగిపోయినట్టు నిర్ధారణ అయింది.

● ప్రమాదానికి గురైన విమానం పైలట్లలో సుమిత్ సభర్వాల్ (56) కు 15,638 గంటలు విమానం నడిపిన అనుభవం ఉంది. రెండో పైలట్ క్లైవ్ కుందర్ (32)కు 3,403 గంటల అనుభవం ఉంది. ఆరోగ్యంగా ఫిట్‌గా ఉన్నారు. విమానంలోకి వెళ్లే ముందు వారికి బ్రీత్ అనలైజర్, ఇతర పరీక్షలు కూడా చేశారు.

● కూలిపోవడానికి ముందు విమానంలో ఇంధనం నింపిన ట్యాంకులు, పైపుల నుంచి శాంపిళ్లను సేకరించి పరీక్షించారు. ఇంధనం నాణ్యంగానే ఉందని, లోపమేమీ లేదని తేల్చారు.

● ఇప్పటివరకు లభించిన ఆధారాల మేరకు ప్రమాదం వెనుక కుట్ర కోణమేదీలేదని భావిస్తున్నట్టు ఏఏఐబీ నివేదికలో పేర్కొంది. మరిన్ని ఆధారాలను, రికార్డులను పరిశీలించాక స్పష్టత వస్తుందని తెలిపింది.

ఆ స్విచ్‌లు అంత సులువుగా కదలవు!

విమానంలోని బ్లాక్‌బాక్స్‌లో 'ఎన్‌హాన్స్‌డ్ ఎయిర్‌బార్న్ ఫ్లైట్ రికార్డర్ (ఈఏఎఫ్‌ఆర్)', 'కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ (సీవీఆర్)' పరికరాలు ఉంటాయి. విమానానికి సంబంధించిన ప్రతి అంశాన్ని ఈఏఎఫ్‌ఆర్ ఎప్పటికప్పుడు నమోదు చేస్తే పైలట్ల మధ్య సంభాషణలను సీవీఆర్ నమోదు చేస్తుంది. విమానం టేకాఫ్ తీసుకోగానే రెండు ఇంజన్ల ఇంధన స్విచ్‌లు 'రన్' మోడ్ నుంచి 'కటాఫ్' కు మారినట్టు 'ఈఏఎఫ్‌ఆర్' డేటా ఆధారంగా గుర్తించారు. 'స్విచ్‌లు ఎందుకు ఆఫ్ చేశావని ఒక పైలట్ అంటే.. నేనేమీ చేయలేదంటూ' పైలట్లు గందరగోళానికి లోనవడం 'సీవీఆర్‌లో నమోదైంది. పైలట్ల సంభాషణను బట్టి.. వారు ఆఫ్ చేసినట్టు కనిపించడం లేదు. పొరపాటున చేయిగానీ, ఏదైనా వస్తువుగానీ తగిలి ఇంధన స్విచ్‌లు కదిలే అవకాశమూ లేదు. పైకి కిందికి కదిలే మోడల్‌లోని ఈ స్విచ్‌లలో స్టాప్‌లాక్ ఏర్పాటు ఉంటుంది. నేరుగా వేలితో నొక్కినంత మాత్రన కదలవు. స్విచ్‌ను పట్టుకుని, లాగి.. పైకిగానీ, కిందకుగానీ జరిపాక వదిలేయాల్సి ఉంటుంది. ఇక ల్యాండింగ్ తర్వాత విమానం ఇంజన్లను ఆఫ్ చేయడానికి, గాల్లో ఎగురుతున్నప్పుడు ఇంజన్‌లో మంటలురావడం లేదా ఏదైనా సమస్య తలెత్తడం వంటివి జరిగితే ఇంజన్లను ఆపడానికి, తిరిగి ప్రారంభించడానికి ఇంధన స్విచ్‌లను వినియోగిస్తారు. ఈ స్విచ్‌లు స్వతంత్ర విద్యుత్ వ్యవస్థతో అనుసంధానమై ఉంటాయని.. ఇంజన్లకు విద్యుత్ సరఫరాను, ఇంధన వాల్వ్‌లను నియంత్రిస్తాయని అమెరికా విమానయాన నిపుణుడు జాన్ కాక్స్ తెలిపారు. ఈ స్విచ్‌లు ఎలా కటాఫ్ మోడ్‌కు మారాయో ఏఏఐబీ నివేదికలో పేర్కొనలేదు.

జవాబులు లేని ప్రశ్నలెన్నో..

ఇంధన స్విచ్‌లు ఎలా కటాఫ్ అయ్యాయి? మొదటి పైలట్ అలా ఎందుకు అడిగారు? వారి నియంత్రణలో లేని పరిస్థితి ఏదైనా నెలకొందా? ఇంధన స్విచ్‌లలో సాంకేతిక, నిర్మాణపరమైన లోపాలున్నాయా? వంటి ప్రశ్నలెన్నో వెల్లువెత్తుతున్నాయి.

● విమాన 2 ఇంజన్లు ఒక్కసారిగా ఆగిపోవడానికి, ఒక ఇంజన్ ఆన్ అయినా, మరొకటి మొరాయించడానికి కారణా లు ఏఏఐబీ నివేదికలో పేర్కొనలేదు.

● ప్రమాదానికి గురయ్యే ముందు ఏఐ423 సర్వీసు కింద ఈ విమానం నడిచింది. అప్పటి విమాన సిబ్బంది స్టెబిలైజర్ సెన్సర్‌లో సమస్యని గుర్తించి రిపోర్టు చేశారు. ఎయిరిండియా ఇంజనీర్లు దాన్ని పరిష్కరించి ప్రయాణానికి సిద్ధం చేశారు. అదే సమస్య మళ్లీ ఉత్పన్నమైందా? అన్న ప్రస్తావన నివేదికలో లేదు.

● మానవ తప్పిదాన్ని కూడా నివేదిక ధ్రువీకరించలేదు. కాక్‌పిట్‌లో ఏం జరిగిందన్న దానిపై ఇంకా పరిశీలన కొనసాగుతోందని ఏఏఐబీ తెలిపింది.

● కాక్‌పిట్‌లోని పైలట్లలో ఇంధన స్విచ్ గురించి ఎవరు ఎవరిని అడిగారనేది వెల్లడించలేదు. 32 సెకన్ల పాటు విమానం గాలిలో ఉంటే.. కేవలం ఒక్కే వాక్యాన్నే బహిర్గతం చేసింది. మిగతా వివరాలు ఏమయ్యాయి?

అమెరికా ముందే హెచ్చరించిందా?

బోయింగ్ విమానాల్లోని ఇంధన స్విచ్‌ల వ్యవస్థలో లోపాలున్నాయని అమెరికా పౌర విమానయాన సంస్థ (ఎఫ్ఏఏ) 2018లోనే హెచ్చరించింది. ఈ అంశాన్ని ఎయిరిండియా దృష్టికీ తెచ్చింది. బోయింగ్ 737, 787 విమానాల్లోని ఇంధన స్విచ్‌ల లాకింగ్ వ్యవస్థలో లోపం ఉందని, ఆ లాక్ సులువుగా వదులయ్యే అవకాశం ఉందని పేర్కొంటూ ఎఫ్ఏఏ 2018 డిసెంబర్‌లో ప్రత్యేక వైమానిక సమాచార బులెటిన్ (ఎస్ఏఐబీ)లో పేర్కొంది. అయితే అది సమాచారం మాత్రమే. తప్పనిసరిగా పాటించాల్సిన సూచనగానీ, ప్రమాదకరమనే హెచ్చరికగానీ కాదు. దీనితో ఎయిరిండియా తమ విమానాల్లో ఈ ఇంధన స్విచ్‌ల వ్యవస్థకు సంబంధించిన తనిఖీలు నిర్వహించలేదని తెలిపింది. ఇంధన స్విచ్‌లలో ఇప్పటివరకు ఎలాంటి లోపాలు బయటపడలేదని, పైలట్లు ఎవరూ ఫిర్యాదు చేయలేదని పేర్కొంది.

దర్యాప్తుకు సహకరిస్తాం: బోయింగ్

అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై దర్యాప్తునకు పూర్తి సహకారం కొనసాగిస్తామని విమాన తయారీ సంస్థ బోయింగ్ ప్రకటించింది. ప్రమాదంపై ఏఏఐబీ ప్రాథమిక నివేదికను విడుదల చేసిన నేపథ్యంలో బోయింగ్ శనివారం ఒక ప్రకటనను విడుదల చేసింది. ప్రమాదానికి సంబంధించిన సమాచారాన్ని ఏఏఐబీకి అందజేసేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపింది. 'దర్యాప్తునకు, మా కస్టమర్లకు మా మద్దతును కొనసాగిస్తాం. ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ ప్రోటోకాల్‌కు అనుగుణంగా ఏఐ171 విమానానికి సంబంధించిన సమాచారాన్ని ఏఏఐబీకి అందజేసేందుకు కట్టుబడి ఉన్నాం' అని పేర్కొంది.

పైలట్ కావాలనే కూల్చేశాడా?

ఇది కావాలని చేసిన మానవ చర్యే

ప్రముఖ నిపుణుడు కెప్టెన్ మోహన్ రంగనాథన్

న్యూఢిల్లీ, జూలై 12: విమానంలో ఒక్కసారిగా ఇంధన కంట్రోల్ స్విచ్‌లు ఆగిపోవడం.. దీనిపై కాక్‌పిట్‌లోని పైలట్ల మధ్య సాగిన సంవాదం గమనిస్తే, విమానాన్ని పైలట్ కావాలనే కూల్చివేసినట్టు అనిపిస్తోందని ప్రముఖ విమానయాన నిపుణుడు, కెప్టెన్ మోహన్ రంగనాథన్ అభిప్రాయపడ్డారు. ఏఏఐబీ ప్రాథమిక నివేదికపై ఓ ఆంగ్ల చానల్ ప్రతినిధితో ఆయన మాట్లాడారు. 'కచ్చితంగా మానవ చర్యే విమాన ప్రమాదానికి కారణం. దాని అంతట అది ఆటోమేటిక్‌గానో లేక పవర్ ఫెయిల్యూర్ అయిన కారణంగానో ఈ ప్రమాదం జరిగే చాన్స్ లేదు. దీని ఇంధన స్విచ్‌లు స్లైడింగ్ తరహావి. ఇంధన సెలక్టర్లను కిందకు, మీదకు కదిలించాలంటే వాటిని బలంగా పట్టుకుని లాగాలి. అనుకోకుండా వాటంతటవే 'ఆఫ్' అయ్యే అవకాశమే లేదు. ఇంధన సెలక్టర్లను కావాలనే ఆఫ్' మోడ్‌లోకి తెచ్చారు" అని పేర్కొన్నారు. ఇక ఏఏఐబీ నివేదికలో పస లేదని, మరింత లోతుగా విచారణ సాగాల్సిన అవసరం ఉందని నేవీ మాజీ చీఫ్ అడ్మిరల్ అరుణ్ ప్రకాశ్ అన్నారు.

అప్పుడే ఒక నిర్ణయానికి రావొద్దు

ఇది ప్రాథమిక నివేదికే: రామ్మోహన్ నాయుడు

న్యూఢిల్లీ, జూలై 12: ఎయిరిండియా విమాన ప్రమాదంపై ప్రస్తుతం వచ్చింది ప్రాథమిక నివేదిక మాత్రమేనని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. తుది నివేదిక వెలువడే వరకు ఒక నిర్ణయానికి రావొద్దని కోరారు. ఈ దుర్ఘటనపై దర్యాప్తును సవాలుతో కూడుకున్నదన్నారు. ఇందులో ఎన్నో సాంకేతిక అంశాలు ఇమిడి ఉన్నాయని, అందువల్ల ఈ నివేదికపై ఇప్పుడే మాట్లాడటం తొందరపాటే అవుతుందన్నారు. "ఈ నివేదికను పౌర విమానయాన శాఖ క్షుణ్నంగా విశ్లేషిస్తోంది. ఇప్పుడే ఎలాంటి నిర్ణయాలకు రాకూడదు. తుది నివేదిక వెలువడిన తర్వాత మాత్రమే ఒక నిర్ణయానికి రాగలం' అని మంత్రి తెలిపారు. కాగా, చాలా తక్కువ సమయం మాత్రమే జరిగిన పైలట్ల సంభాషణ ఆధారంగా విమాన ప్రమాదంపై ఒక నిర్ణయానికి రాలేమని పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మొహోల్ అభిప్రాయపడ్డారు.

లోకం తీరు



పైలట్లపైకి తప్పు నెట్టే యత్నం!

» పైలట్ల అసోసియేషన్ మండిపాటు

న్యూఢిల్లీ, జూలై 12: అహ్మదాబాద్ దుర్ఘటనపై ఏఏఐబీ విడుదల చేసిన ప్రాథమిక నివేదికను ఎయిర్‌లైన్ పైలట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఆల్పా) ఖండించింది. ప్రమాదానికి సంబంధించి పైలట్లపైకి తప్పు నెట్టేసే ప్రయత్నంలా ఉందని మండిపడింది. ఈమేరకు ఆల్పా అధ్యక్షుడు శామ్ థామస్ ఓ ప్రకటన విడుదల చేశారు. "విమాన ఇంధన నియంత్రణ స్విచ్‌ల అంశం ప్రమాదానికి కారణమని అమెరికాలోని వాల్‌స్ట్రీట్ జర్నల్ పత్రిక జూలై 10నే కథనం ప్రచురించింది. ఏఏఐబీ దర్యాప్తులోని రహస్య అంశం ముందే ఎలా బయటికి వెళ్లింది? నివేదికపై సంబంధిత అధికారుల సంతకాలు కూడా లేకపోవడం ఆశ్చర్యకరంగా ఉంది. దర్యాప్తు బృందంలో సరైన నిపుణులు కూడా లేరు. ఇవన్నీ దర్యాప్తు విశ్వసనీయతపై సందేహాలు కలిగిస్తున్నాయి"అని పేర్కొన్నారు. విమాన ప్రమాద దర్యాప్తులో పైలట్లనూ భాగస్వామ్యం చేయాలని డిమాండ్ చేశారు. దర్యాప్తులో కనీసం పరిశీలకులుగానైనా పైలట్లకు అవకాశమిస్తే దర్యాప్తులో పారదర్శకత ఉంటుందన్నారు. ఈ డిమాండ్‌పై ఎయిరిండియా స్పందించింది. ఏఏఐబీ నివేదికపై సమీక్షించేందుకు పైలట్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తామని సంస్థ ఫ్లైట్ ఆపరేషన్స్ విభాగం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మనీశ్‌ఉప్పల్ ప్రకటించారు.

పాశ్చాత్య మీడియా తీరు దారుణం: బీజేపీ

బోయింగ్ 787 విమానంలో లోపమేమీ లేదని, పైలట్ ఇంజన్‌కు ఇంధన సరఫరా ఆపేయడంతోనే ప్రమాదం జరిగిందని పాశ్చాత్య మీడియా ప్రచా రం చేయడం దారుణమని బీజేపీ మండిపడింది. దీనిపై ఆ పార్టీ నేత అమిత్ మాలవీయ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. "ఏఏఐబీ నివేదికలోని ఒక అంశాన్ని పట్టుకుని పాశ్చాత్య మీడియా వార్తలు ప్రచురిస్తున్న తీరు అగౌరవకరం. మరణించిన పైలట్లపై అపనిందలు వేస్తున్న తీరు దారుణం" అని పేర్కొన్నారు.

ఉపాధి కల్పనకు కట్టుబడి ఉన్నాం: మోదీ

» రోజ్‌గార్ మేళాలో 51వేల మందికి ఉద్యోగ పత్రాలు

న్యూఢిల్లీ, జూలై 12: ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉపాధి కల్పనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, గత 11ఏళ్లలో దేశం అన్నిరంగాల్లో పురోగతి సాధించిందని ప్రధాని మోదీ అన్నారు. రోజ్‌గార్ మేళాలో భాగంగా.. ప్రభుత్వంలోని వివిధ విభాగాల్లో ఎంపికైన 51వేల మందికి శనివారం ప్రధాని వర్చువల్‌గా ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. అనంతరం ప్రసంగించిన మోదీ.. ప్రైవేట్ రంగంలో మొదటిసారి ఉద్యోగం పొందినవారికి మొదటి నెల జీతానికి తోడ్పాటుగా.. రూ.15 వేలు ప్రోత్సాహకంగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మోదీ చెప్పారు. ఇందుకోసం ఉద్యోగుల ప్రోత్సాహక పథకం కింద బడ్జెట్‌లో లక్ష కోట్లు కేటాయించామన్నారు. రోజ్‌గార్ మేళా ద్వారా ఇప్పటివరకు 10 లక్షల నియామక పత్రాలు పంపిణీ చేశామని ప్రధాని తెలిపారు.

నిమిష ప్రియను కాపాడండి: కేసీ వేణుగోపాల్

న్యూఢిల్లీ, జూలై 12: యెమెన్‌లో ఉరిశిక్ష ఎదుర్కొంటున్న కేరళకు చెందిన నర్సు నిమిష ప్రియను కాపాడాలని కేంద్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ విజ్ఞప్తి చేసింది. ఆమెను ఈనెల 16న ఉరితీయనున్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రధాని మోదీకి లేఖ రాశారు. ఇదే విషయంపై సీపీఐ ఎంపీ సంతోష్ కుమార్ విదేశాంగ మంత్రి జైశంకర్‌కు లేఖ రాశారు. నిమిషకు క్షమాభిక్ష లభించేలా కేంద్రం కృషి చేయాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏపాల్ డిమాండ్ చేశారు.

భూమికి తిరిగొచ్చాక వారం పాటు.. వైద్యుల పర్యవేక్షణలోనే శుభాంశు

న్యూఢిల్లీ, జూలై 12: యాక్సియం-4 మిషన్‌లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రా(ఐఎస్ఎస్)నికి వెళ్లిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా ఈ నెల 15న(భారత కాలమానం ప్రకారం) తిరిగి భూమిపై కాలు మోపనున్నారు. ఆ తర్వాత ఆయన ఏడు రోజులపాటు వ్యోమగాముల పునరావాస కేంద్రంలో వైద్యుల పర్యవేక్షణలో గడుపుతారు. ఆయనతో పాటు.. ఇతర వ్యోమగాములు పెగ్గీ విట్సన్, స్లావోస్జ్ ఉజ్నాన్స్‌కీ-విస్నియెస్కీ, టిబర్ కపులపైనా వైద్యుల పర్యవేక్షణ ఉంటుంది. శుభాంశు, ఇతర వ్యోమగాములు గత నెల 25న నింగిలోకి దూసుకెళ్లిన విషయం తెలిసిందే..! దాదాపు రెండు వారాల పాటు ఐఎస్ఎస్‌లో ఉన్నారు.

గగన్‌యాన్ ప్రొపల్షన్ వ్యవస్థ పరీక్ష సక్సెస్

బెంగళూరు, జూలై 12: భారత్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గగన్‌యాన్ మిషన్‌లో మరో కీలక ముందడుగు పడింది. ఈ ప్రయోగంలో కీలకమైన సర్వీస్ మాడ్యూల్ ప్రొపల్షన్ సిస్టమ్ (ఎస్ఎంపీఎస్) విజయవంతంగా అభివృద్ధి చేసినట్లు ఇస్రో శనివారం వెల్లడించింది. దీనికి సంబంధించిన హాట్ టెస్టును శుక్రవారం 350 సెకన్ల పాటు విజయవంతంగా నిర్వహించామని పేర్కొంది. ఎస్ఎంపీఎస్ సమగ్ర పనితీరును ధ్రువీకరించుకొనేందుకు తమిళనాడులోని మహేంద్రగిరిలోని ఉన్న ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో ఈ పరీక్షలు చేసినట్లు తెలిపింది. గగన్‌యాన్‌కు చెందిన సర్వీస్ మాడ్యూల్ అనేది బై-ప్రొపలెంట్ ఆధారిత చోదక వ్యవస్థ. ఇది వ్యోమనౌక అంతరిక్షంలోకి వెళ్లే క్రమంలో ఆర్బిట్ సర్క్యులరైజేషన్, ఆన్-ఆర్బిట్ కంట్రోల్, డీబూస్ట్ మాన్యువరింగ్ వంటి ప్రక్రియల కోసం ఆర్బిటల్ మాడ్యూల్ అవసరాలను తీరుస్తుంది.

కుర్చీ దక్కించుకోవడం సులభం కాదు: డీకే

బెంగళూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): సీఎం పదవి విషయంలో రెండు రోజులుగా ముభావంగా ఉన్న కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్.. శుక్రవారం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బెంగళూరు న్యాయవాదుల సంఘం నిర్వహించిన కెంపే గౌడ జయంతి సభలో ఆయన ప్రసంగించారు. ముందు భాగంలో ఉన్న కుర్చీల్లోకి రావాలని న్యాయవాదులకు సూచించారు. 'కుర్చీ దక్కించుకోవడం అంత సులభం కాదు. అవకాశం ఎప్పుడు వచ్చినా ఉపయోగించుకోవాలి' అని నవ్వుతూనే సీఎం కుర్చీ గురించి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. 'మీ అందరికీ సహజంగానే త్యాగ గుణం అబ్బినట్టుంది. అందుకే ముందున్న కుర్చీలు ఖాళీగా ఉన్నా కూర్చోకుండా వదిలేశారు. మంచి భవంతిలో మంచి కుర్చీ దొరికినప్పుడు అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి. వెంటనే కూర్చోవాలి' అని అన్నారు.

ప్రపంచంలో పెరుగుతున్న ముస్లిం జనాభా

న్యూ ఢిల్లీ, జూలై 12: ప్రపంచ వ్యాప్తంగా ముస్లింల జనాభా అత్యంత వేగంగా పెరుగుతోందని 'ప్యూ రిసెర్చ్ సెంటర్' నిర్వహించిన అధ్యయనం వెల్లడించింది. అదే సమయంలో ఏ మతాన్ని పాటించని వారి సంఖ్య పెరుగుతోందని, క్రైస్తవులు, హిందువుల సంఖ్య తగ్గుతోందని తెలిపింది. ఈ సంస్థ 2010-20 మధ్య కాలంలో నిర్వహించిన అధ్యయనం ప్రకారం.. ప్రపంచంలోనే అతిపెద్ద మతంగా ఉన్న క్రైస్తవంలో జనాభా ఈ పదేళ్లలో 1.8% మేర తగ్గి.. ప్రపంచ జనాభాలో 28.8శాతానికి పడిపోయింది. అయినా.. అతిపెద్ద మత సముదాయంగా క్రైస్తవం కొనసాగుతోంది. అదే సమయంలో ముస్లింల జనాభా 23.9% నుంచి 25.6శాతానికి పెరిగింది. ఇంచుమించుగా క్రైస్తవ జనాభాకు సమానంగా ఎదుగుతోంది. ఇక ఏ మతంతో సంబంధం లేదని చెప్పుకొనే వారి సంఖ్య కూడా పెరిగినట్లు తాజా అధ్యయనం వెల్లడించింది. హిందువులు 15% నుంచి 14.9శాతానికి తగ్గిపోయారని.. అయితే.. వారి సంఖ్య పెరిగిందని వివరించింది. 2010లో ప్రపంచంలో 110 కోట్ల మంది హిందువులు ఉండగా.. 2020లో ఆ సంఖ్య 120 కోట్లకు పెరిగింది. బౌద్ధులు, యూదులు, ఇతర మతస్థుల జనాభా కూడా తగ్గుతోందని పేర్కొంది. కాగా.. మతమార్పిడి అనేది హిందువులు, ముస్లింలలోనే అతి తక్కువగా ఉన్నట్లు వెల్లడించింది. ప్రపంచంలోని హిందువుల్లో 95%మంది భారత్‌లోనే ఉంటున్నారు. 2010లో భారత్‌లో హిందువుల జనాభా 80% కాగా.. 2020కి ఇది 79 శాతానికి పడిపోయింది. అదే సమయంలో భారత్‌లో ముస్లింల జనాభా14.3% నుంచి 15.2 శాతానికి పెరిగినట్లు అధ్యయనం పేర్కొంది

భారత్‌పై 20% లోపే సుంకాలు!



ట్రంప్ సర్కారు నిర్ణయం

తాత్కాలిక వాణిజ్య ఒప్పందానికి సన్నాహాలు

వాషింగ్టన్, జూలై 12: అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికయ్యాక ట్రంప్ సుంకాల బాదుడుకు పలు దేశాలు విలవిల్లాడుతున్నాయి. ప్రపంచ షేర్ మార్కెట్లు 'బేర్'మంటున్నాయి. చైనా లాంటి దేశాలపై పదుల్లో కాకుండా.. వందల శాతాల మేర సుంకాల బాదుడుతో ట్రంప్ దూసుకుపోతున్నారు. ఇటీవల బ్రిక్స్ దేశాలకు 50శాతానికి పైగా సుంకాలు తప్పవని, భారత్ కూడా మినహాయింపు కాదని హెచ్చరించిన సంగతి తెలిసిందే..! అయితే.. త్వరలో భారత్‌తో కుదరనున్న తాత్కాలిక వాణిజ్య ఒప్పందం ప్రకారం అమెరికా దిగుమతి చేసుకునే భారతీయ ఉత్పత్తులపై సుంకాలను 26%(ముందుగా ప్రకటించినది) కాకుండా.. 20% కంటే తక్కువగా ప్రకటించే అవకాశాలున్నాయని విశ్వసనీయ వర్గాలు తెలిపినట్లు పలు వార్తాసంస్థలు కథనాలను ప్రచురించాయి. ఈ ఒప్పందంతో ట్రంప్ పాలనలో వాణిజ్య ఒప్పందం చేసుకున్న అరుదైన దేశాల జాబితాలో భారత్ చేరనుంది. ఇప్పటికే బ్రిటన్ ఈ జాబితాలో ఉంది. ఇక ఆసియా దేశాలైన మయన్మార్‌పై 40%, వియత్నాం, ఫిలిప్పీన్స్‌లపై 20% మేర అమెరికా సుంకాలు కొనసాగుతున్నాయి. భారత్ మాత్రం అధిక సుంకాల జాబితాలో చేరకపోవచ్చని బ్లూమ్‌బెర్గ్ కూడా ఓ నివేదికలో పేర్కొంది. మరోవైపు అమెరికాతో వాణిజ్య చర్చలకు భారత్ వడివడిగా అడుగులు వేస్తోంది. ఓ ప్రతినిధి బృందం అమెరికాకు చేరుకుని, అక్కడి అధికారులతో చర్చలు జరపనుంది. ఇప్పటికే భారత్ తన తుది ప్రతిపాదనను అమెరికాకు అందజేసింది. జన్యు మార్పిడి(జీఎ) పంటలకు భారత్ వ్యతిరేకంగా ఉన్న విషయం తెలిసిందే..! అయితే.. అమెరికా తన తాత్కాలిక వాణిజ్య ఒప్పందంలో భాగంగా భారత్‌పై జీఎ పంటల విషయంలో ఒత్తిడి చేసే సూచనలు కనిపిస్తున్నాయి. దీనికి భారత్ అంగీకరించకపోవచ్చని తెలుస్తోంది. ఇటు ఔషధ రంగ నియంత్రణ సమస్యలు కూడా ఇంకా పరిష్కారం కావాల్సి ఉంది. ప్రస్తుత చర్చల తర్వాత తాత్కాలిక ఒప్పందం కుదురుతుందని, ఈ ఏడాది చివరికి తుది ఒప్పందంపై ప్రకటన ఉంటుందని సమాచారం.

నిబంధనలు పాటించకుంటే వీసా రద్దు

న్యూఢిల్లీ, జూలై 12: అమెరికా చట్టాలు, ఇమ్మిగ్రేషన్ నిబంధనలను వీసాదారులు ఉల్లంఘిస్తే వారిని అగ్రరాజ్యం నుంచి పంపించివేయనున్నట్టు శనివారం భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం పేర్కొంది. వీసా జారీ చేసినా యూఎస్ వీసా స్క్రీనింగ్ ముగిసిపోదని, అన్ని అమెరికా చట్టాలు, ఇమ్మిగ్రేషన్ నిబంధనలను వీసాదారులు పాటిస్తున్నదీ లేనిదీ ఒక కంట కనిపెడుతూనే ఉంటామని 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. అగ్రరాజ్యం చట్టాలు, నిబంధనలను పాటించకుంటే వారి వీసాలను రద్దు చేయడమేకాకుండా దేశం నుంచి వారిని పంపించివేయనున్నట్టు స్పష్టం చేసింది. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి బాధ్యతలు చేపట్టాక ఇమ్మిగ్రేషన్ విధానాలను కఠినతరం చేస్తున్న సంగతి తెలిసిందే.

కౌన్సెలింగ్ అని పిలిచి.. డ్రగ్స్ ఇచ్చి అత్యాచారం

» ఐఐఎం కోల్‌కతా విద్యార్థినిపై సహచర విద్యార్థి అఘాయిత్యం.. నిందితుడికి రిమాండ్

» రేప్ జరగలేదన్న బాధితురాలి తండ్రి

కోల్‌కతా, జూలై 12: పశ్చిమ బెంగాల్‌లో న్యాయ కళాశాల విద్యార్థినిపై సామూహిక అత్యాచార ఘటన మరవకముందే.. తాజాగా మరో విద్యార్థిని అఘాయిత్యానికి గురైంది. కోల్‌కతాలోని ప్రతిష్ఠాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లో రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థినిపై.. సహచర విద్యార్థే అత్యాచారానికి పాల్పడ్డాడు. కౌన్సెలింగ్ ఇస్తానని ఆమెను క్యాంపస్ బాయ్స్ హాస్టల్‌కు రప్పించుకున్న అతడు.. డ్రగ్స్ కలిపిన శీతల పానీయం ఇచ్చి దారుణానికి ఒడిగట్టాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడితో ఆమెకు ముందు నుంచే పరిచయముంది. కౌన్సెలింగ్ సెషన్ అని చెప్పి శుక్రవారం ఆమెను క్యాంపస్ బాయ్స్ హాస్టల్‌కు ఆహ్వానించడంతో నమ్మి అక్కడికి వెళ్లింది. ఈ నేపథ్యంలోనే డ్రగ్స్ కలిపిన శీతల పానీయం, పిజ్జా ఇవ్వడంతో అవి తీసుకున్న కాసేపటికే ఆమె స్పృహ కోల్పోతున్నట్లు అనిపించి.. తనను రెస్ట్ రూమ్‌కు తీసుకెళ్లాలని కోరింది. అయితే అతడు తనపై దాడి చేసి.. అఘాయిత్యానికి ఒడిగట్టినట్లు ఫిర్యాదులో పేర్కొంది. మత్తు నుంచి కోలుకునేందుకు సాయంత్రమైందని.. హాస్టల్ గది నుంచి బయటకు వచ్చి మరో విద్యార్థి సాయంతో పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నట్లు వెల్లడించింది. దీంతో పోలీసులు నిందితుడిని మహవీర్ తొప్పన్నవార్‌గా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. శనివారం అతడిని అలీపోర్ కోర్టులో ప్రవేశపెట్టగా.. న్యాయమూర్తి ఈనెల 19 వరకు రిమాండ్ విధించారు. అయితే తన కూతురిపై అత్యాచారం జరగలేదని బాధితురాలి తం డ్రి చెప్పారు. 'నా కూతురు ఆటో నుంచి కింద పడటంతో స్పృహ కోల్పోయినట్లు ఫోన్ వచ్చింది. పోలీసులు ఆమెను రక్షించి ఆస్పత్రికి తరలించారన్నారు. ఆమెను నేరుగా వెళ్లి కలిశాను. ఎలాంటి లైంగికదాడి జరగలేదని చెప్పింది' అని వెల్లడించారు.

గోకర్ణ అడవి గుహలో రష్యా మహిళ

» ఇద్దరు పిల్లలతో నివసిస్తున్నట్టు గుర్తింపు

బెంగళూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఉత్తర కన్నడ జిల్లా గోకర్ణ అటవీ ప్రాంతంలోని రామతీర్థకొండ గుహ వద్ద రష్యాకు చెందిన ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో ఆవాసాన్ని ఏర్పరచుకున్నారు. పర్యాటకుల రక్షణ కోసం ఏర్పాటైన పోలీసు పెట్రోలింగ్ టీం వీరిని గుర్తించింది. అటవీ ప్రాంతంలో ఒక చోట దుస్తులు కనిపించడంతో ఎవరో ఉన్నట్టు అనుమానించి, వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. గుహ సమీపంలోని ఓ కుటీరంలో రష్యాకు చెందిన నీనా కుటీనా(40), ఆమె పిల్లలు ప్రేమ(6), అమా(4) ఉన్నట్టు గుర్తించారు. దేవుడి పూజ, ధ్యానం పట్ల ఆసక్తితో తాను ఇక్కడ ఉంటున్నానని నీనా పోలీసులకు వివరించారు. ఆధ్యాత్మిక చింతన కోసం గోవా నుంచి పిల్లలతో కలిసి గోకర్ణకు వచ్చానని తెలిపారు. వారు ఉంటున్న గుహ ప్రాంతం అత్యంత ప్రమాదకరమైనది. అక్కడ పాములతోపాటు వన్యప్రాణులు ఉంటాయి. తరచూ మట్టి చరియలు విరిగి పడుతుంటాయి. దీంతో పోలీసులు ఆమెకు నచ్చజెప్పి కుమట తాలూకా బంకికొడ్ల గ్రామంలో ఉన్న శంకర ప్రసాద్ ఫౌండేషన్‌కు చెందిన సరస్వతి స్వామిజీ ఆశ్రమానికి తరలించారు. కాగా.. ఆమె పాస్‌పోర్ట్ గడువు 2017 ఏప్రిల్ 17న ముగిసినట్టు గుర్తించారు. తాత్కాలికంగా ఆశ్రమంలో ఉంచిన పోలీసులు, ఈ నెల 14న బెంగళూరు శాంతినగర్‌లోని ఎఫ్ఆర్ఆర్ఓ కార్యాలయంలో హాజరుపరిచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



కమలాలు పూసే.. కాశ్మీరం మురిసె!

బండిపోరా, జూలై 12: ఉత్తర కశ్మీర్‌లోని వులర్ మంచినీటి సరస్సు తామర పువ్వులతో కళకళలాడుతోంది! ముప్పై ఏళ్ల తర్వాత మళ్లీ ఆ సరస్సులో కమలాలు విరబూశాయి. బండిపోరా జిల్లా హరముఖ్ పర్వత శ్రేణి నుంచి బారాముల్లా జిల్లా సోపోర్ పట్టణం దాకా దాదాపు 24 కి.మీ మేర పొడవుతో, 200 చ.కి.మీ మేర విస్తరించి ఉన్న వులార్ సరస్సు 1992 దాకా తామరలతో తళుకులీనిన సరస్సే. అయితే ఆ ఏడాది వచ్చిన వరదల కారణంగా బురద పేరుకుపోయి.. సరస్సు సోయగమే దెబ్బతింది. ఆ తర్వాత అక్కడ పద్మాలు కనిపించలేదు. స్థానికులు తామర విత్తనాలు చల్లినా ఫలితం లేకపోయింది. ఇప్పుడు అక్కడ నీళ్ల మీద పచ్చని పాన్పు పరిచినట్లుగా తామర తీగలు.. వాటి మధ్యలో గులాబీ రంగులో పూసిన తామరలు వీక్షకులను కనువిందు చేస్తున్నాయి.

సెంజి కోటకు యునెస్కో గుర్తింపు

చెన్నై, జూలై 12(ఆంధ్రజ్యోతి): తమిళనాడు విల్లుపురం జిల్లాలోని చారిత్రక ప్రాంతం సెంజి కోటను ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తించింది. దేశంలో మహారాష్ట్రీయులు నిర్మించిన 12 కోటలకు ఈ మేరకు గుర్తింపునిస్తూ శుక్రవారం ప్రకటన వెలువరించింది. గతంలో తంజావూరు బృహదీశ్వరాలయం, కుంభకోణం ఐరావతేశ్వర ఆలయం, జయంకొండం గంగ కొండ చోళపురం ఆలయం, మహాబలిపురంలోని శిల్ప కళాఖండాలు, నీలగిరి కొండ రైలును ఆ సంస్థ ప్రపంచ వారసత్వ సంపదలుగా ప్రకటించింది. దీంతో తమిళనాట యునెస్కో గుర్తింపు పొందిన ప్రాంతాల సంఖ్య ఆరుకు పెరిగింది. యునెస్కో ప్రతినిధి హవాజుంగ్ జగామస్ నేతృత్వంలోని బృందం సెంజి కోటను గతేడాది సెప్టెంబర్‌లో క్షుణ్ణంగా పరిశీలించింది.

ఫాస్ట్ ట్రాక్‌లో భూసేకరణ: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి అవసరమైన భూ సేకరణను ఫాస్ట్ ట్రాక్ విధానంలో చేపట్టాలని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భూసేకరణతో పాటు నిర్వాసితుల పునరావాసం, పునర్‌నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఆయన నిర్దేశించారు. నీటిపారుదలశాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్ తదితరులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. భూసేకరణ ప్రక్రియను జిల్లా యూనిట్‌గా చేసుకొని చేపట్టాలని, జిల్లా కలెక్టర్లతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకొని, చట్టపరమైన, పాలనాపరమైన అంశాలను తక్షణం పరిష్కరించాలని సూచించారు. రైతులు స్వచ్ఛందంగా భూములు ప్రాజెక్టులకు ఇచ్చేలా చూడాలన్నారు. పాలమూరు-రంగారెడ్డి, సీతారామ ఎత్తిపోతల పథకం పనుల పూర్తికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మాజీ ఈఎన్‌సీ హర్పాల్‌సింగ్ గౌరవ సలహాదారుగా, అంతర్జాతీయ టన్నెల్ ఇంజనీరింగ్ నిపుణుడు కల్నల్ పరిక్షిత్ మెహ్రాలను నీటిపారుదల శాఖలోకి తీసుకుంటామని, ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌తో పాటు ఇతర టన్నెల్ పనులను నిరంతరం సమీక్షించే బాధ్యతలను వారు తీసుకుంటారని చెప్పారు.

రవాణాశాఖలో విప్లవాత్మక మార్పులు

» స్క్రాప్ పాలసీతో కాలుష్య నివారణ: పొన్నం

» బీసీ రిజర్వేషన్ల కోసం పొన్నం పోరాడారు: కోమటిరెడ్డి

నల్లగొండ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రవాణాశాఖలో విప్లవాత్మక మార్పులు తెచ్చామని, ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్లు, స్క్రాప్ పాలసీ, ఈవీ పాలసీలను అమలు చేస్తూ రవాణాశాఖను ముందంజలో ఉంచుతున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. నల్లగొండ ఆర్టీసీ బస్ డిపోకు నూతనంగా కేటాయించిన 10 ఎలక్ట్రికల్ బస్సులను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో కలిసి ఆయన శనివారం ప్రారంభించారు. అలాగే, రూ.8కోట్లతో నిర్మించతలపెట్టిన ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ స్క్రాప్ పాలసీని పక్కాగా అమలు చేస్తున్నామని, తద్వారా కాలుష్య నివారణ జరుగుతోందని వెల్లడించారు. తెలంగాణలో 17 ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని, అందులో భాగంగానే నల్లగొండలో రెండో స్టేషన్‌కు శంకుస్థాపన చేశామన్నారు.. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కోసం క్యాబినెట్‌లో పొన్నం ప్రభాకర్ కొట్లాడారని వివరించారు. రాష్ట్రంలో ఆర్టీసీని బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

గవాయ్ సీజేఐ అవడం దేశానికే గర్వకారణం

» ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం పట్ల లోతైన అవగాహన ఉన్న మేధావి, రాజ్యాంగం పట్ల విశ్వాసం కలిగిన బీఆర్ గవాయ్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కావడం దేశానికే గర్వకారణమని ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ కొనియాడారు. జస్టిస్ గవాయ్‌ని ఆయన శనివారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. "గవాయ్ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అంశం మీద నిర్దిష్టమైన, న్యాయమైన అభిప్రాయం కలిగిన సమానత్వవాది. ఎన్నో చారిత్రక తీర్పులు వెలువరించి న్యాయవ్యవస్థ మీద ప్రజలకున్న నమ్మకాన్ని పెంచిన న్యాయ కోవిదుడు"అని కొనియాడారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవిని అలంకరించిన రెండో దళిత ముద్దుబిడ్డ అని ఆనందం వ్యక్తం చేశారు.

తెలంగాణ సంస్కృతి పట్ల గౌరవం ఉంది

» ఏపీ బీజేపీ అధ్యక్షుడు మాధవ్

"నేను జాతీయవాదిని. తెలంగాణ పట్ల, ఇక్కడి గొప్ప సంస్కృతి పట్ల నాకు ఉన్న గౌరవం రాజకీయ విమర్శలకు అతీతం. తెలంగాణ పట్ల నాకున్న గౌరవాన్ని ఎవరూ తగ్గించలేరు.. మార్చలేరు." అని ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు. రజాకార్లను పొగిడే నిజాం వారసుల ముందు తలవంచిన వారికి తెలంగాణ ప్రజల హృదయాల్లో ప్రతిఫలించే సంస్కృతి, జాతీయత, సమానత్వం అనే విలువలు ఎప్పటికీ అర్థం కావని అన్నారు. ఏపీ మంత్రి లోకేశ్‌కు బహూకరించిన అఖండ భారత్ చిత్రపటంపై విమర్శలు వచ్చిన నేపథ్యంలో ఆయన స్పందించారు. శనివారం హైదరాబాద్ వచ్చిన మాధవ్ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్‌రావును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

సీఎస్‌సీకి మీ'సేవలా'?

» ఒప్పందం రద్దు చేసుకోవాలి: మీసేవ ఆపరేటర్లు

» లేకుంటే ఈ నెల 15 నుంచి సమ్మె చేస్తామని ప్రకటన

మీసేవ కేంద్రాల్లో అందే పలు ఈ-గవర్నెన్స్ సేవలను సీఎస్‌సీ (కామన్ సర్వీసెస్ సెంటర్స్)కు అప్పగించడం సరికాదని మీసేవ ఆపరేటర్ల సంక్షేమ సంఘం పేర్కొంది. ఐటీ శాఖ పరిధిలోని ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (ఈఎస్‌డీ-మీసేవ) అధికారులు సీఎస్‌సీ ఎస్పీవీ సంస్థతో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైర శంకర్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ మోయిద్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఒప్పందం రద్దు చేసుకోకుంటే ఈ నెల 15 నుంచి సమ్మె చేస్తామని పేర్కొన్నారు. కాగా, పలు సేవలను సీఎస్‌సీలకు అప్పగించినా, మీసేవ కేంద్రాలకు నష్టం లేకుండా చూస్తామని ఈఎస్‌డీ కమిషనర్ రవికిరణ్ తెలిపారు. మీసేవ కేంద్రాల్లో లభించని కొన్ని సేవలు అందించేందుకే సీఎస్‌సీతో ఒప్పందం కుదుర్చుకున్నామని పేర్కొన్నారు.

పోక్సో కేసుల్లో రాచకొండ టాప్

» ఐదేళ్లలో రాష్ట్రంలో మొత్తం కేసులు 16,994

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : పోక్సో కేసుల్లో అరెస్టులు అనుకున్న స్థాయిలో ఉండటం లేదని పోలీసు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. గత ఐదేళ్ల పోక్సో కేసుల వివరాలను పరిశీలిస్తే నేర నిరూపణ, పూర్తి స్థాయి అరెస్టులపై పోలీసుశాఖ మరింత దృష్టి పెట్టాల్సిన పరిస్థితులు కన్పిస్తున్నాయి. 2020 నుంచి ఈ ఏడాది ఏప్రిల్ 17 వరకు తెలంగాణలో మొత్తం 16,994 పోక్సో కేసులు నమోదయ్యాయి. ఇందులో 2,619 కేసులు రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఉండగా, అత్యల్పంగా ఆసిఫాబాద్ జిల్లాలో 125 కేసులు ఉన్నాయి. మొత్తం నిందితులు 24,613 మంది కాగా, ఇందులో కేవలం 15,634 మందిని మాత్రమే పోలీసులు అరెస్టు చేశారు. ఇక, పోక్సో కేసుల్లో విచారణ పూర్తయి శిక్షలు పడిన కేసులు 188 మాత్రమే. 12,771 కేసులు ట్రయల్‌లోనే ఉన్నాయి. మిగతా కేసుల్లో చార్జిషీట్లు దాఖలు కాలేదు. తప్పు చేసిన వారికి సత్వర శిక్ష పడితేనే బాలికలు, మహిళల జోలికి వెళ్లాలంటే భయపడతారని ఈ వివరాలను ఆర్‌టీఐ ద్వారా సేకరించిన యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఫౌండర్ రాజేంద్ర పేర్కొన్నారు.

పని ఉంది.. పది రోజుల్లో వస్తా..

» సిట్ విచారణకు విజయ సాయిరెడ్డి డుమ్మా

» శరత్‌చంద్రారెడ్డి, రోహిత్‌రెడ్డి కూడా గైర్హాజరు

అమరావతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఏపీ మద్యం కుంభకోణంలో కీలక వ్యక్తి, వైసీపీ మాజీ నేత విజయసాయి రెడ్డి సిట్ విచారణకు డుమ్మా కొట్టారు. రూ.3,500కోట్ల లిక్కర్ స్కామ్‌లో కీలక నిందితుడు(ఏ-5) సాయిరెడ్డిని శనివారం విచారణకు హాజరుకావాలంటూ దర్యాప్తు బృందం ఇటీవల నోటీసులు ఇచ్చింది. అయితే వ్యక్తిగత పని ఉందని, ఢిల్లీ నుంచి వచ్చేందుకు పది రోజులు పడుతుందని సాయిరెడ్డి సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. సాయిరెడ్డితోపాటు విచారణకు రావాల్సిన ఆయన అల్లుడు రోహిత్‌రెడ్డి, అల్లుడి అన్న శరత్‌చంద్రారెడ్డి సైతం గైర్హాజరయ్యారు. ఆదాన్ డిస్టిలరీస్ అనధికారిక యజమాని రాజ్‌కసిరెడ్డి(ఏ-1)కి అరబిందో గ్రూపు నుంచి రూ.100కోట్లు అప్పుగా ఇప్పించినట్లు గతంలో విజయసాయిరెడ్డి వెల్లడించారు. అరబిందో గ్రూపు డైరెక్టర్లయిన శరత్‌చంద్రారెడ్డి, రోహిత్ రెడ్డిని కూడా విజయసాయిరెడ్డితో కలిపి విచారించేందుకు సిట్ సిద్ధమైంది. అయితే మామ, అల్లుళ్లు ఎవ్వరూ రాకపోవడంతో మరోమారు నోటీసు ఇవ్వనున్నట్లు తెలిసింది.

(మొదటిపేజీ తరువాయి)

రిజర్వేషన్లపై ఢిల్లీకి..

తెలిసింది. ఈ నెల 16, 17వ తేదీల్లో సీఎం ఢిల్లీలోనే ఉండనున్నట్టు సమాచారం. ఈసారి పూర్తిగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపైనే అక్కడ చర్చలు, సమావేశాలు నిర్వహించనున్నారు. అంతేకాకుండా.. కేంద్రానికి పంపిన బిల్లులను ఆమోదించడంతోపాటు షెడ్యూల్ 9లో చేర్చాలనే అంశంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీని స్వయంగా కలిసే అవకాశం ఉందని విశ్వసనీయంగా తెలిసింది. ఈ సందర్భంగా బీసీలకు రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాల్సిన అవసరం, సామాజిక వర్గాలవారీ వివరాలను వారికి తెలపనున్నారు. వీటితోపాటు రాష్ట్రంలో నిర్వహించిన కులగణన వివరాలను వారికి తెలియజేసి రిజర్వేషన్ల పెంపునకు అవకాశం కల్పించాలని కోరనున్నారు. ఈ నెల 21న ప్రారంభమయ్యే పార్లమెంటు సమావేశాల్లో ఈ అంశంపై నిర్ణయం తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేయనున్నారు. మరోవైపు రిజర్వేషన్ల పెంపునకు దేశవ్యాప్త మద్దతు కూడగట్టాలని సీఎం రేవంత్ భావిస్తున్నారు. ఇందుకోసం రాష్ట్ర కాంగ్రెస్ ఎంపీలు సహా ఇండియా కూటమిలోని ఎంపీలతో ఆయన సమావేశమై రిజర్వేషన్ల పెంపు ఆవశ్యకతను వారికి వివరించనున్నారు. ఇందుకోసం ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ప్రత్యేక సదస్సు నిర్వహించాలని నిర్ణయించారు.



ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్..

ఈ నెల 21న పార్లమెంటు ఉభయ సభల సమావేశాలు ప్రారంభం కానుండడంతో ఎంపీలంతా ఢిల్లీకి చేరుకోనున్నారు. దీంతో అవకాశం ఉంటే పార్లమెంటు ప్రారంభమైన రోజు, లేదా ఆ తరువాత ఒకటి, రెండు రోజుల్లో ఎంపీలకు రిజర్వేషన్ల వ్యవహారంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని సీఎం రేవంత్ నిర్ణయించారు. ఆ తరువాత సభలో ఈ అంశాన్ని లేవనెత్తడంతో పాటు ప్రముఖంగా దీనిపై మాట్లాడాల్సిందిగా ఎంపీలను కోరనున్నారు. 16న ఢిల్లీకి వెళ్లిన సందర్భంగా ఈ అంశాలన్నింటిపైనా కాంగ్రెస్ అధిష్ఠానానికి వివరించనున్నారు. ఇందుకోసం ఏఐసీసీ కీలక నేతలతో రేవంత్ భేటీ కానున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. రిజర్వేషన్ల నేపథ్యంలోనే రాష్ట్రంలో స్థానిక ఎన్నికలకు ఆలస్యమవుతుండడంతో.. గవర్నర్ ఆమోదంతో ఆర్డినెన్స్ తెచ్చుకుని, ప్రత్యేక జీవో ద్వారా రిజర్వేషన్లను పెంచుకోవాలని క్యాబినెట్ భేటీలో నిర్ణయించిన విషయం తెలిసిందే. అయితే ఓవైపు రాష్ట్ర పరిధిలో చేయాల్సిన పనిని చేసుకుంటూనే.. మరోవైపు రాజ్యాంగంలోని షెడ్యూల్ 9లో రిజర్వేషన్ల పెంపు బిల్లులను చేర్చేలా సీఎం అడుగులు వేస్తున్నారు.

2029లో బీసీ రిజర్వేషన్లే ప్రధాన ఎజెండా

స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై నా నిబద్ధతను ప్రశ్నించలేరు

» ఇంకా ఏం చేసేందుకుకైనా నేను సిద్ధం

» బీసీ నేతలతో భేటీలో సీఎం రేవంత్



సీఎం రేవంత్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జాజుల. చిత్రంలో ఆది శ్రీనివాస్, మహేశ్‌గౌడ్, కొండా సురేఖ

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో తన నిబద్ధతను ప్రశ్నించలేరని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రతిపక్షాలకు ఆ నైతిక హక్కు లేదన్నారు. రిజర్వేషన్ల విషయంలో ఇంకా ఏం చేసేందుకైనా సిద్ధంగా ఉన్నానని, అవసరమైతే అర్ధరాత్రైనా మంత్రివర్గ సమావేశం నిర్వహించి నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో 50 శాతానికి మించి రిజర్వేషన్లు పెంచొద్దంటూ గత కేసీఆర్ ప్రభుత్వం చట్టం చేసిందని, అప్పుడు గంగుల కమలాకర్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్ మంత్రులుగా ఉన్నారని గుర్తుచేశారు. కానీ, కేసీఆర్ ఇప్పుడు వారినే తమపైకి ఉసిగొల్పుతున్నారని చెప్పారు. ఆ చట్టంలో పేర్కొన్న 50 శాతం నిబంధనను సవరిస్తూ తాము ఇప్పుడు ఆర్డినెన్స్ తీసుకువస్తున్నామన్నారు. ఈ విషయంలో ఎవరైనా కోర్టుకు వెళితే వాదించడానికి ఢిల్లీ నుంచి ఉద్దండులైనన్యాయవాదులను నియమిస్తామన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంపై కాంగ్రెస్ ఎంపీలతోపాటు ఇండియా కూటమి ఎంపీలకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తామని, అన్ని రాష్ట్రాల్లోనూ రిజర్వేషన్లు అమలైతేనే నిజమైన విజయమని పేర్కొన్నారు. 2029 ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లే ప్రధాన ఎజెండా కావాలన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నందుకు సీఎం రేవంత్‌రెడ్డిని శనివారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ బీసీ నేతలు కలిసి ధన్యవాదాలు తెలిపారు. అలాగే బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు మరికొంత మంది బీసీ నేతలు కూడా సీఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వీరందరితో జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సీఎం రేవంత్ సమావేశమై మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదంటూ కొంతమంది విమర్శిస్తున్నారని, చిత్తశుద్ధి లేనిది బీజేపీకేనని అన్నారు. బీసీ రిజర్వేషన్లను షెడ్యూల్ 9లో చేర్చి చట్టబద్ధత కల్పించాల్సింది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమేనన్నారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, సంజయ్‌తోపాటు ఎంపీలు లక్ష్మణ్, ఆర్.కృష్ణయ్య దీనిని సాధించాలన్నారు. ప్రధానిగా మోదీ స్థానంలో రాహుల్‌గాంధీ ఉండి ఉంటే తాను 48గంటల్లోనే రిజర్వేషన్లను సాధించుకొచ్చేవాడినని తెలిపారు. ఈ విషయంపై ప్రధానిని తెలంగాణ బీజేపీ ఎంపీలు ప్రశ్నించాలని, రిజర్వేషన్లపై వారి నిబద్ధతను నిరూపించుకోవాలని సూచించారు. నెల రోజుల్లో స్థానిక ఎన్నికల రిజర్వేషన్లను ఖరారు చేయాల్సిందిగా హైకోర్టు ప్రభుత్వానికి డెడ్‌లైన్ విధించిందని, బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కల్పించడం కోసమే ఇంత కాలం స్థానిక ఎన్నికలను వాయిదా వేశామని చెప్పారు. తనకు తోడుగా ఉండడంతోపాటు రిజర్వేషన్లకు రక్షణ కవచంలా ఉండి కాపాడుకోవాలని సమావేశంలో పాల్గొన్న వారినుద్దేశించి వ్యాఖ్యానించారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పిటిషన్ వేసే వారిని, వేయించే వారందరినీ సామాజిక బహిష్కరణ చేస్తామని ప్రకటించాలన్నారు. తెలంగాణ నిర్ణయమే దేశాన్ని ప్రభావితం చేసిందని, ఈ ఒత్తిడికి లొంగిన కేంద్రం 2026లో చేసే జనగణనలో కులగణన చేయాలని నిర్ణయించిందని గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్లను షెడ్యూల్ 9లో చేర్చాలంటూ ఢిల్లీలో నిర్వహించిన ధర్నాకు 16పార్టీలు మద్దతిచ్చాయని చెప్పారు.


ఆ బాధ్యత మాపై ఉంది..

అధికారంలోకి రాగానే కులగణన చేస్తామంటూ రాహుల్‌గాంధీ ఇచ్చిన మాటను నెరవేర్చాల్సిన బాధ్యత తనతోపాటు పీసీసీ అధ్యక్షుడిపై ఉందన్నారు. అందుకే ఎన్ని అవాంతరాలు వచ్చినా అధిగమించి ఏడాదిలో కులగణనను పారదర్శకంగా నిర్వహించామని తెలిపారు. కులగణనకు వ్యతిరేకంగా బీజేపీ గతంలో సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిందని గుర్తుచేశారు. రాహుల్, ఖర్గే.. తెలంగాణ తరహాకులగణనను దేశమంతా చేయాలంటూ కోరుతున్నారని అన్నారు. కులగణన వివరాలను వంద శాతం డిజిటలైజేషన్ చేశామని, ఎవరూ చాలెంజ్ చేయడానికి వీల్లేకుండా డేటాను భద్రపరిచామని చెప్పారు. ఇది కాంగ్రెస్ పార్టీ విజయమని, బీజేపీ పాలిత రాష్ట్రాలలో ఎక్కడా బీసీలకు రిజర్వేషన్లు కల్పించలేదన్నారు. సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, జూపల్లి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై మేధావులతో బీసీ కమిషన్ భేటీ

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని స్థానికసంస్థల ఎన్నికల్లో బీసీలకు కల్పించిన 42 శాతం రిజర్వేషన్ల అమలుకు తీసుకోవాల్సిన చర్యలపై తెలంగాణ బీసీ కమిషన్ శనివారం పలువురు మేధావులతో సమావేశమై చర్చించింది. ఖైరతాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో చైర్మన్ జి. నిరంజన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన సమావేశంలో కమిషన్ సభ్యులు, అధికారులతోపాటు పలువురు బీసీ వర్గాల మేధావులు పాల్గొన్నారు. ఆర్డినెన్స్‌తో బీసీలకు 42% రిజర్వేషన్లు అమలుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, అందుకు ఎదురయ్యే అవాంతరాలు, న్యాయపరమైన చిక్కులను అధిగమించేందుకు అనుసరించాల్సిన విధానాలు, ప్రభుత్వం వ్యవహరించాల్సిన తీరుపై చర్చించినట్లు కమిషన్ అధికారులు పేర్కొన్నారు.

బీసీ బిల్లు రాష్ట్రపతి వద్ద ఉండగా.. ఆర్డినెన్స్ ఎలా తెస్తారు?: లక్ష్మణ్



న్యూఢిల్లీ, జూలై 12(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లు రాష్ట్రపతి వద్ద ఉన్న సమయంలో దాన్ని ఉపసంహరించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తేవడంలో ఆంతర్యమేంటని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ప్రశ్నించారు. రాష్ట్రపతి వద్ద బిల్లు పెండింగ్‌లో ఉండగా గవర్నర్ ఆర్డినెన్స్‌కు ఆమోద ముద్ర వేసే అవకాశం ఉందా..? అని ప్రశ్నించారు. ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోద ముద్ర వేసినా.. ఎవరైనా కోర్టును ఆశ్రయిస్తే పరిస్థితి ఏంటని నిలదీశారు. బీసీ రిజర్వేషన్లపై అధ్యయనం కోసం ఏర్పాటు చేసిన బుర్రా వెంకటేశం డెడికేటెడ్ కమిషన్ సిఫారసులను ప్రభుత్వం ఎందుకు బయట పెట్టడం లేదని నిలదీశారు. బీసీల పట్ల కాంగ్రెస్ మాటలు కోటలు దాటేలా ఉన్నాయని, లోపల మాత్రం వంచన కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. న్యాయస్థానాల్లో నిలబడేలా రిజర్వేషన్ల పెంపుపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు.



గాంధీవిగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ తదితరులు

బీసీలకు అత్యధిక రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే

» బీఆర్‌ఎస్ స్పందించకపోవడం దౌర్భాగ్యం

» దయ్యాల పీడ వదిలిందా? లేదా? కవిత చెప్పట్లేదు?

» బీసీలపై బీజేపీ చిత్తశుద్ధి తేలిపోయింది

» టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): దేశ చరిత్రలోనే బీసీలకు అత్యధికంగా రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దేనని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కాంగ్రెస్ మార్క్‌గా చరిత్రలో నిలిచిపోతుందని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చే ఆర్డినెన్సు చరిత్రాత్మకమని.. ఈ సందర్భంలో తాను టీపీసీసీ అధ్యక్షుడిగా ఉండటం జీవితంలో చేసుకున్న అదృష్టమని వ్యాఖ్యానించారు. రిజర్వేషన్ల పెంపుపై బీసీ సమాజమంతా హర్షిస్తూ సంబరాలు చేసుకుంటే బీఆర్‌ఎస్ నేతలు కనీసం స్పందించకపోవడం దౌర్భాగ్యమని విమర్శించారు. అధికారంలో కొనసాగినప్పుడు కేంద్రంలోని బీజేపీకి అన్ని బిల్లుల సమయంలో మద్దతు పలికిన బీఆర్‌ఎస్.. బీసీ రిజర్వేషన్లపై కేంద్రంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేయకపోవడం చూస్తుంటే ఆ పార్టీకి బీసీల పట్ల ఉన్న చిత్తశుద్ధిని స్పష్టం చేస్తోందన్నారు.

కవిత ఏ పార్టీలో ఉన్నారో..?

అసలు కవిత ఏ పార్టీలో ఉన్నారో అర్థం కావట్లేదని మహేశ్ గౌడ్ అన్నారు. బీసీ రిజర్వేషన్లపై ఆమె సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. 'బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ కార్యాచరణ మొదలుపెట్టినప్పుడు కవిత లిక్కర్ స్కామ్‌లో ఊచలు లెక్కపెడుతున్నారు. బీఆర్ఎస్‌లో దయ్యాలు ఉన్నాయన్న ఆమె.. నేడు ఆ దయ్యాల పీడ వదిలిందా? లేదా.. ఎందుకు చెప్పడం లేదు.' అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ చాంపియన్ రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌లు బీసీల అభ్యున్నతి కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్టు తెలిపారు. ఎవరు దొంగలు.. ఎవరు హీరోలన్నది తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారన్నారు. బీసీ రిజర్వేషన్లు కాంగ్రెస్‌తోనే సాధ్యమని చెప్పారు. బీసీల పట్ల బీజేపీ చిత్తశుద్ధి ఏపాటిదో తేలిపోయిందని.. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి చివరికి ఎవరికి కట్టబెట్టారో అందరికీ తెలుసన్నారు.

ఆంధ్రా పాలకులది అన్యాయం.. బీఆర్‌ఎస్‌ది ద్రోహం

» పదేళ్ల బీఆర్‌ఎస్ పాలన.. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధం: చామల

» బీసీ రిజర్వేషన్లు ఆపే కుట్రలు: మేడిపల్లి

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల బీఆర్‌ఎస్ పాలన.. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనపై చర్చకు తాము సిద్ధమని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. గోదావరి, కృష్ణా జలాలపై హరీశ్‌రావు చేసిన సవాల్‌ను పరిగణనలోకి తీసుకుంటున్నామన్నారు. నీళ్ల విషయంలో ఆనాడు ఆంధ్రా పాలకులు తెలంగాణకు అన్యాయం చేస్తే.. బీఆర్‌ఎస్ పాలకులు ద్రోహం చేశారని మండిపడ్డారు. శనివారం గాంధీభవన్‌లో చామల మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాలు పెట్టి తగినంత సమయం కేటాయించాలనడం చూస్తుంటే సభలో హరీశ్ ఏకపాత్రాభినయం చేసే ఆలోచనతో ఆయన ఉన్నట్లు స్పష్టమవుతోందని ఎద్దేవా చేశారు. నీళ్లే కాదు.. నిధులు, నియామకాలపై కూడా తాము చర్చకు సిద్ధమన్నారు. ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా పదేళ్ల బీఆర్‌ఎస్ పాలన సాగిందని విమర్శించారు. ఆనాడు బీఆర్‌ఎస్ నేతలు చిత్తశుద్ధితో పని చేస్తే తెలంగాణ అప్పుల కుప్పగా మారేది కాదన్నారు. రాజకీయాల్లో ఉనికి కోసం కవిత తాపత్రయ పడుతున్నారని.. ఆమె డ్రామాలను ప్రజలు నమ్మబోరని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కల్పించిన 42 శాతం రిజర్వేషన్లను ఆపడానికి కొందరు కోర్టు వెళ్లే కుట్రలు చేస్తున్నారని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. సీఎల్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనలో బీసీలను అడుగడుగునా అణగదొక్కారన్నారు. బీసీలకు గొర్రెలు, బర్రెలు ఇచ్చి కేసీఆర్ బీసీలను రాజ్యాధికారానికి దూరం చేశారని మండిపడ్డారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం కాంగ్రెస్, సీఎం రేవంత్ రెడ్డి చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీల్లో సామాజిక న్యాయం ఎప్పటికీ జరగదని విమర్శించారు. సీఎం రేవంత్ సోషల్ ఇంజనీర్‌గా మారారని, మంత్రివర్గంలోకి నలుగురు దళితులను తీసుకుని చరిత్ర సృష్టించారని కొనియాడారు. గాంధీభవన్‌లో 'అందుబాటులో ప్రజాప్రతినిధులు' కార్యక్రమంలో భాగంగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పాల్గొని ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ఆర్డినెన్స్ తేవాలన్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ గాంధీభవన్‌లో ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో టపాసులు కాల్చి, మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

రాజ్యాంగానికి ఎవరూ అతీతులు కాదు: మల్లు రవి

రాజ్యాంగంపై దాడులు పెరుగుతున్నాయని.. దాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి అన్నారు. కొందరు తామేదో రాజ్యాంగానికి అతీతమైనట్లు ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ఉస్మానియా యూనివర్సిటీలో 'రాజ్యాంగం రూపకల్పనలో అంబేడ్కర్ పాత్ర'పై ప్రసంగించేందుకు వచ్చిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌కి తెలంగాణ ప్రజల తరఫున స్వాగతం పలికినట్లు తెలిపారు. జస్టిస్ గవాయ్ పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ల అమలుపై పలుమార్లు మాట్లాడారని గుర్తు చేశారు. మరోవైపు.. వరంగల్ జిల్లాలో కొండా మురళి వ్యాఖ్యల వివాదంపై ఇరు వర్గాల నివేదికను పరిశీలించిన అనంతరం ఆమోదయోగ్య నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

ట్రైబ్యునల్ పరిధిలోకి బనకచర్ల రాదు

పూర్తి వరద జలాలతోనే బనకచర్ల పథకం.. దీనితో పోలవరం ప్రాజెక్టుకు సంబంధమే లేదు

» డీపీఆర్‌లో 40 ఏళ్ల లెక్కలూ అందిస్తాం

» గోదావరి జలాలు పెన్నాలో కలుస్తాయి

» కృష్ణాలోకి గోదావరి నీళ్లు రానే రావు

» పొరుగు రాష్ట్రాలకు వాటా ఇవ్వక్కర్లేదు

» కేంద్రానికి నివేదించనున్న ఏపీ జల వనరుల శాఖ

అమరావతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గోదావరి జలాలను తీసుకెళ్లి కృష్ణా నదిలో కలిపే అంశం పోలవరం - బనకచర్ల అనుసంధాన పథకంలో లేదని కేంద్రానికి వివరించేందుకు ఏపీ జలవనరుల శాఖ సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వం చేసిన బనకచర్ల ప్రతిపాదనను వెనక్కి పంపుతూ.. కేంద్ర జలశక్తి శాఖ, ఇతర సంస్థలు లేవనెత్తిన అభ్యంతరాలపై 'వాప్కో'స్'తో సమగ్ర నివేదికను తయారుచేయించింది. ఈ నివేదిక రెండు రోజుల కిందట (గురువారం) జలవనరుల శాఖకు వాప్కోస్ అందజేసింది. ఈ నివేదికనూ .. కేంద్ర సంస్థలు వేసిన కొర్రీలనూ జల వనరుల శాఖ సమగ్రంగా పరిశీలన చేస్తోంది. ప్రతి కొర్రీకీ ఆచి తూచి సమాధానం చెప్పేలా సమగ్ర నివేదికను తయారు చేస్తోంది. ఆ నివేదికను సోమవారం లేక మంగళవారం కేంద్రానికి సమర్పించాలని జలవనరుల శాఖ నిర్ణయించింది. రుతుపవనాల సమయంలోను, గోదావరికి వరదలు వచ్చేసమయంలోను పోలవరం దిగువన తీసిన 15 సంవత్సరాల డేటా ఆధారంగా 2,842 టీఎంసీలు వరద జలాలేనని కేంద్రానికి గణాంకాలతో సహా ఏపీ తెలియజేయనుంది. 75 శాతం నికర జలాల కింద కాళేశ్వరం జీ-0 దాకా 932 టీఎంసీలు, ఇంద్రావతి జీ-11 దాకా 737 టీఎంసీలు , లోయర్ గోదావరి జీ-10 దాకా 231 టీఎంసీలు, శబరి దాకా జీ-12లో 383 టీఎంసీలు.... మొత్తం 2,194 టీఎంసీల జలాలు అందుబాటులో ఉంటాయని వివరించనుంది.

కృష్ణాలోకి గోదావరి రాదు..

గోదావరి జలాలు కృష్ణా నదిలో కలిస్తే .. గోదావరి వివాద ట్రైబ్యునల్ తీర్పునకు లోబడి కృష్ణా జలాల్లో కర్ణాటక, మహారాష్ట్రలకు ఉమ్మడి ఏపీ వాటా ఇవ్వాల్సి వస్తుందని కేంద్ర అటవీ,పర్యావరణ శాఖ సహా..పోలవరం అథారిటీ, గోదావరి నదీ యాజమాన్య సంస్థ పేర్కొంది. దీనిపై రాష్ట్రం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. బనకచర్ల పథకంలో గోదావరి జలాలు కృష్ణా నదిలోకి వెళ్లకుండా నాగార్జున సాగర్ కుడికాలువ పై అక్విడెక్టును నిర్మించి .. బొల్లాపల్లి రిజర్వాయరులోకి.. ఆ తర్వాత బనకచర్ల రెగ్యులేటర్‌కు తరలిస్తామని ఏపీ స్పష్టం చేయనున్నది. పెన్నా బేసిన్‌కు గోదావరి జలాలు వెళ్తున్నందున కృష్ణా-గోదావరి జలాల సంగమానికి ఆస్కారమే ఉండదని, అందువల్ల పొరుగు రాష్ట్రాలకు కృష్ణా నదీ జలాల్లో వాటా ఇవ్వాల్సిన అవసరం లేదని కేంద్రానికి రాష్ట్రం స్పష్టం చేయాలని నిర్ణయించింది. అదేవిధంగా 75 శాతం నికర జలాల వినియోగానికి మించి గోదావరి వరద జలాలు ఉన్నాయని తెలపనుంది. అందువల్లే రోజుకు రెండు టీఎంసీల చొప్పున 100 రోజుల పాటు 200 టీఎంసీలను పోలవరం నుంచి బనకచర్లకు మళ్లించాలని భావిస్తున్నామని వివరించనుంది. డీపీఆర్‌ను సమర్పించే సమయంలో హైడ్రాలజీ మెథడాలజీకి సంబంధించి 40 ఏళ్ల గణాంకాలను సమర్పించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టును మాత్రమే సమర్పించినందున .. వాప్కోస్ రూపొందించిన రిపోర్టులో 15 ఏళ్ల లెక్కలను సిద్ధం చేశారు. డీపీఆర్‌ను సమర్పించే సమయంలో 40ఏళ్ల నీటి ప్రవాహ లెక్కలను ఇస్తామని కేంద్రానికి వెల్లడించాలని నిర్ణయించింది.

పోలవరంతో లింకొద్దు..

పోలవరం సాగునీటి ప్రాజెక్టు నిర్మాణానికి .. పోలవరం - బనకచర్ల అనుసంధాన పథకానికి మధ్య ఎలాంటి సంబంధం లేదని కేంద్రానికి రాష్ట్ర జలవనరుల శాఖ స్పష్టం చేయనుంది. పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యాకే బనకచర్లకు అనుమతిస్తామంటూ పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) చెప్పడాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ వివరణను సిద్ధం చేసుకుంది.

'లిక్కర్' సొమ్ముతో

దుబాయ్‌లో 'టెక్కర్'

- 150 కోట్లకు పైగా తరలించిన ఏ9 కిరణ్ రెడ్డి
- 2024లో వైసీపీ ఓడిపోయాక దుబాయ్‌కు జంప్
- సిట్ దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి

అమరావతి జూలై 12 (ఆంధ్రజ్యోతి): పేరు.. తుతేకుల ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డి. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు అతడు ఐఐటీ పట్టభద్రుడు. దుబాయ్, లండన్, నెదర్లాండ్స్, యూఏఈలో పెద్ద పెద్ద వ్యాపారాలు నిర్వహిస్తున్నాడు. బహుళ జాతి సంస్థల్లో పనిచేసి కోట్లాది రూపాయలు సంపాదించాడని అనుకుంటే తప్పులో కాలేసినట్టే! జగన్ పాలనలో జరిగిన మూడున్నర వేల కోట్ల మద్యం కుంభకోణంలో ఏ9 నిందితుడు. కిరణ్ తన 'తెలివితేటల'ను సక్రమ మార్గంలో గాక, లిక్కర్ స్కామ్‌లో దోచుకోవడం, దాచుకోవడంలో చూపించాడు. గత వైసీపీ ప్రభుత్వంలో మద్యం కుంభకోణంలో తన వాటాతో పాటు పెద్దలు దోచుకున్న సొమ్ములో కిరణ్ దాదాపు రూ.150 కోట్ల వరకూ నొక్కేసినట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) గుర్తించింది. హవాలా మార్గంలో 15 రోజులకు ఒకసారి కనీసం రెండు కోట్ల నుంచి రూ. 6 కోట్ల వరకూ విదేశాలకు పంపినట్టు గుర్తించింది.శ్రీకాళహస్తికి చెందిన ఒక పోలీసు కానిస్టేబుల్ కుమారుడైన కిరణ్ కుమార్ రెడ్డి చెన్నైలో ఐఐటీ పూర్తి చేశాడు. ఆ తర్వాత బెంగళూరు కేంద్రంగా డికార్ట్ లాజిస్టిక్స్ పేరుతో వ్యాపారం ప్రారంభించాడు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక అప్పటి సీఎం జగన్ సలహాదారు కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి చెంతకు చేరాడు. లిక్కర్ స్కామ్‌లో కర్త, కర్మ, క్రియ అయిన రాజ్ కసిరెడ్డి(ఏ-1) ముడుపుల సేకరణకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. అప్పటికే డికార్ట్ లాజిస్టిక్స్ నిర్వహిస్తున్న కిరణ్ కుమార్ రెడ్డి తన వద్దకు ఉద్యోగం కోసం వచ్చే యువకుల్లో మెరికల్లాంటి వారిని ఎంపిక చేసి మద్యం ముడుపుల సేకరణకు అప్పగించాడు. పనిలో పనిగా తన వాటాతో పాటు మరికొంత నొక్కేశాడు. గత వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరగడాన్ని ముందే గ్రహించిన కిరణ్ తన 'భవిష్యత్తు' చూసుకున్నాడు. దుబాయ్‌లో సెటిల్ అయ్యేందుకు 2022 నుంచే ప్లాన్ చేసుకున్నాడు. అందులో భాగంగా మద్యం కుంభకోణంలో తన వాటా, కాజేసిన సొమ్మును దేశం దాటించేశాడు. 2024లో రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఓడిపోవడంతో లిక్కర్ స్కామ్‌లో కొందరు సహ నిందితులతో పాటు మరికొందరిని తీసుకుని దుబాయ్ వెళ్లిపోయాడు. దుబాయ్‌లో లాజిస్టిక్స్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ లాభసాటిగా ఉంటుందని తెలుసుకున్నాడు. 'టెక్కర్' పేరుతో ట్రాన్స్‌పోర్ట్, ట్రేడింగ్, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు మొదలు పెట్టాడు. దుబాయ్‌తో పాటు లండన్, నెదర్లాండ్స్ యూఏఈలోనూ వ్యాపారాలు ప్రారంభించాడు. సిట్ అధికారులు ఆరా తీయగా... ఇది తుతేకుల ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డి(టీఈకేకేఈఆర్) కంపెనీ అని తేలింది. కిరణ్ వ్యాపారాలతో పాటు అందులో కీలక వ్యక్తుల వివరాలు కూపీ లాగారు. ఏపీ లిక్కర్ స్కామ్‌లో నిందితులు, అనుమానితులు ఆరుగురికి పైగా ఉన్నట్లు గుర్తించారు. వారితో పాటు పదిహేను మందికి పైగా దక్షిణాది రాష్ట్రాలకు(ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు) చెందిన యువకులు కీలకంగా వ్యవహరిస్తున్నట్లు తెలుసుకున్నారు.

నీట్-యూజీ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్య ప్రవేశాలకు సంబంధించిన నీట్-యూజీ 2025 కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైంది. ఈ మేరకు శనివారం మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) అధికారికంగా ఆలిండియా కోటా, రాష్ట్రస్థాయి కౌన్సెలింగ్ తేదీలను విడుదల చేసింది. నీట్ 2025లో అర్హత సాధించిన వారు కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు దరఖాస్తు చేసుకోవాలని కోరింది. తొలుత అఖిల భారత కోటాకు కౌన్సెలింగ్ జరగనుంది. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్, ఆప్షన్ల ఎంపిక తర్వాత సీటు అలాట్‌మెంట్ జరిగాక ఫిజికల్‌గా రిపోర్టు చేయాలని ఎంసీసీ వెబ్‌సైట్‌లో పేర్కొంది. జూలై 21 నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొంది. ∩ఇక తెలంగాణలో ఈ నెల 30 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమై అక్టోబరు 3నాటికి ముగియనుంది. ఇందుకు సంబంధించి ఆరోగ్య విశ్వవిద్యాలయం త్వరలోనే కౌన్సెలింగ్ నోటిఫికేషన్‌ను విడుదల చేయనుంది. తెలంగాణలో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 4,090 ఎంబీబీఎస్ సీట్లుండగా, ప్రైవేటులో 4,600 సీట్లున్నాయి. ఇక సెప్టెంబరు 1 నుంచి ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభమవుతాయని ఎంసీసీ పేర్కొంది. కాగా దేశంలోని అన్ని ప్రభుత్వ కళాశాలల్లోని సీట్లలో 15 శాతం ఆలిండియా కోటాకు వెళ్తాయి. వాటికి తొలుత కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఈ కోటా కౌన్సెలింగ్‌లోనే దేశంలోన్ని అన్ని ఎయిమ్స్, డీమ్డ్ వర్సిటీలు, సెంట్రల్ యూనివర్సిటీలు, జిప్‌మర్‌లో ఉన్న యూజీ సీట్లను భర్తీ చేస్తారు. మొత్తం నాలుగు రౌండ్ల కౌన్సెలింగ్ ఉంటుంది. మూడు విడతల కౌన్సెలింగ్ నిర్వహించిన తర్వాత ఇంకా విద్యార్థులు చేరకుండా మిగిలిపోయిన సీట్లను నాల్గో విడత (స్ట్రే వెకెన్సీ) ద్వారా భర్తీ చేస్తారు.

నీట్-యూజీ కౌన్సెలింగ్ షెడ్యూల్-2025 ఇలా..

ప్రవేశ షెడ్యూల్	ఆలిండియా, డీమ్డ్ యూనివర్సిటీలు	వెరిఫికేషన్ తేదీ	స్టేట్ కౌన్సెలింగ్	వెరిఫికేషన్ తేదీ
మొదటి రౌండ్ కౌన్సెలింగ్	జూలై 21 - 30	ఆగస్టు 7-8	జూలై 30-ఆగస్టు6	ఆగస్టు 13-14
చేరేందుకు చివరి తేదీ	ఆగస్టు 6	-----	ఆగస్టు 12	-----
రెండో రౌండ్ కౌన్సెలింగ్	ఆగస్టు 12-20	ఆగస్టు 30-సెప్టెంబరు1	ఆగస్టు 19-29	సెప్టెంబరు 5-6
చేరేందుకు చివరి తేదీ	ఆగస్టు 29	----	సెప్టెంబరు 4	-----
మూడో రౌండ్	సెప్టెంబరు 3-10	సెప్టెంబరు 19-21	సెప్టెంబరు 9-18	సెప్టెంబరు 24
చేరేందుకు చివరి తేదీ	సెప్టెంబరు 18	-----	సెప్టెంబరు 23	-----
స్ట్రే వెకెన్సీ	సెప్టెంబరు 22-26	-----	సెప్టెంబరు 25-29	-----
చేరేందుకు చివరి తేదీ	అక్టోబరు 3	-----	అక్టోబరు 3	-----

ఇంజనీరింగ్‌లో 93 శాతం సీట్ల భర్తీ

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): టీజీఎప్‌సెట్‌లో భాగంగా ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి సంబంధించిన మొదటి విడత జాబితాను శనివారం ప్రకటించారు. కౌన్సెలింగ్ ద్వారా కన్వీనర్ కోటాలో మొత్తం 83,054 సీట్లు అందుబాటులో ఉండగా.. 77,154 సీట్లు కేటాయించారు. మొత్తం సీట్లలో ఇవి 92.89 శాతం. ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీలో మొత్తం 195 సీట్లు ఉండగా 119 (61.03%), 20 యూనివర్సిటీల కాలేజీల్లోని 6,108 సీట్లలో 5,163 (84.53%), రెండు ప్రైవేటు యూనివర్సిటీల్లోని 1,367 సీట్లలో 1,357 (99.26%), 149 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లోని మొత్తం 75,384 సీట్లలో 70,515 (93.54%) సీట్లు భర్తీ అయ్యాయి. మొదటి విడతలో రాష్ట్రవ్యాప్తంగా ఇంకా 5,900 సీట్లు మిగిలి ఉన్నాయి. మొదటి విడతలో 95,256 మంది ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తయిందని, 94,059 మంది ఆప్షన్లు ఇచ్చారని ఎప్‌సెట్ కన్వీనర్ శ్రీదేవసేన తెలిపారు. మొత్తం 56.63 లక్షల ఆప్షన్లు స్వీకరించామని, 16,905 మంది ఆప్షన్లు ఇచ్చినా సీటు ఖరారు కాలేదన్నారు. మొత్తం 6,021 మంది ఈడబ్ల్యూఎస్ కోటా సీట్లు పొందారు. ఇది నమూనా (మాక్) సీట్ల కేటాయింపు అని, సంతృప్తి చెందని విద్యార్థులు ఈ నెల 15 వరకు ఆప్షన్లు మార్చుకోవచ్చని విద్యార్థులను శ్రీదేవసేన కోరారు. మార్పులు చేయని విద్యార్థులకు ఇవే సీట్లు కేటాయిస్తారు. అదనపు సీట్ల విషయంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే రెండో విడతలో మరిన్ని సీట్లు అందుబాటులోకి రానున్నాయి.

రోజ్‌గార్ మేళాలో 114 మందికి నియామక పత్రాలు

అందించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి


నియామక పత్రాలు అందజేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : రోజ్‌గార్ మేళా సందర్భంగా శనివారం సికింద్రాబాద్ బోయిగూడ రైల్ కళారంగ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వ శాఖలకు నూతనంగా ఎంపికైన 114 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు ప్రదానం చేశారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని సికింద్రాబాద్, గుంతకల్లు, గుంటూరులతో పాటు జాతీయ స్థాయిలో 47 ప్రదేశాల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 16వ రోజ్‌గార్ మేళాను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ శాఖలకు ఎంపికైన సుమారు 51 వేల మందికి పైగా ఉద్యోగులకు నియామక పత్రాలు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా సికింద్రాబాద్ రైల్ కళారంగ్‌లో ఏర్పాటైన మేళాలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగర్వాల్, దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ సిద్దార్థ్ కటి, సికింద్రాబాద్ డివిజనల్ ఆర్ఎం భరతేష్ కుమార్ జైన్ పాల్గొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.